ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY



తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను

సీనియర్లకు ప్రాధాన్యం — కాస్త వాలకీ మీడియా అవకాశం

సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

శుక్రవారం, 06 నవంబర్ 2026 | Friday 06 November 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 28 సంచిక: 197 | Vol.No 28 Issue No .197 | www.visionandhra.in

కొడంగల్‌కు మహర్దశ..

మూడు రోజుల పాటు సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన..

50 వేల మంది రైతులతో భారీ బహిరంగ సభ



రూ.9,053 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం!

తెలంగాణ స్టేట్ బ్యూరో ।
విజన్ ఆంధ్ర । నవంబర్ 5

ఒకప్పుడు కరువు, వలసలు, వెనుకబాటుతనానికి చిరునామాగా ఉన్న కొడంగల్.. ఇప్పుడు అభివృద్ధికి కేంద్రబిందువుగా మారుతోంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో నవంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సుమారు రూ.9,053.48 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో, మహిళా సంఘాలతో సమావేశం, భారీ రైతు బహిరంగ సభ ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి.

కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి కీలకమైన రహదారులు, విద్య, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు, ప్రజా సౌకర్యాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా రూ.5,060 కోట్లతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు, రూ.2,100 కోట్లతో చేపట్టనున్న ఎంఎన్‌కేఎల్ఐఎస్ రెండో దశ పనులు, రూ.1,410 కోట్లతో చేపట్టనున్న 223 కొత్త, అసంపూర్తి బీటీ రహదారుల పనులు ఈ పర్యటనలో ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. 02

తెలంగాణలో బీజేపీకి కొత్త బాస్ ఎవరు?

స్పెషల్ స్టోరీ
విజన్ ఆంధ్ర...



ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత రాష్ట్ర అధ్యక్షుడి మార్పు ఖాయమా?

- బండి సంజయ్ వర్సెస్ ఈటల రాజేందర్ మాత్రమే కాదు.. రేసులో మరో ముగ్గురు!
- ఐదుగురు బలమైన నేతల్లో ఎవరికి పట్టం?
- 2029 లక్ష్యంగా మోడీ-షా మాస్టర్ ప్లాన్..
- తెలంగాణపై ప్రత్యేక ఫోకస్!
- తెలంగాణలో కాషాయ జెండా ఎగురుతుందా?
- ఢిల్లీలో ఏం జరుగుతోంది?

తెలంగాణ స్టేట్ బ్యూరో,
నవంబర్ 05, విజన్ ఆంధ్ర:

ఇప్పటివరకు తెలంగాణలో బీజేపీ ప్రధాన ప్రతిపక్ష పాత్రకే పరిమితమైంది. కానీ ఇకపై ఆ పరిస్థితి మారాలని, తెలంగాణలో కూడా కాషాయ జెండా ఎగరాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గట్టిగా భావిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే రాష్ట్ర నాయకత్వంలో మార్పు తప్పనిసరి అనే ఆలోచనలో కేంద్ర నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇది కేవలం ఒక పదవి మార్పు కాదు. ఇది 2029 ఎన్నికలకు వేసే పునాది. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి వేసే మొదటి, అత్యంత కీలకమైన అడుగు.

ఎందుకు మార్పు? లోతైన విశ్లేషణ

ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. బీజేపీ మూడో స్థానంలో ఉన్నా, లోక్ సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించింది. 8 ఎంపీ సీట్లు గెలిచి తన సత్తా చాటింది. అయితే అసెంబ్లీ స్థాయిలో పార్టీ ఇంకా ఆశించిన స్థాయికి చేరుకోలేదు. గ్రామ స్థాయిలో పార్టీ నిర్మాణం, బూత్ స్థాయి బలోపేతం, ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాల్లో ఇంకా వేగం పెరగాల్సి ఉందని కేంద్ర నాయకత్వం భావిస్తోంది. తెలంగాణలో బీజేపీకి ఓటు బ్యాంక్ ఉంది. కానీ ఆ ఓటు బ్యాంక్ ను సీట్లుగా మార్చుకోవడంలో ఇంకా లోపాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ ఇంకా బలపడాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లో ఇంకా పట్టు పెంచాలి. యువత, మహిళలు, రైతులు, నిరుద్యోగుల్లో పార్టీ పట్ల నమ్మకం పెంచాలి. ఇవన్నీ చేయాలంటే ఒక బలమైన, జనాకర్షణ ఉన్న, అందరినీ కలుపుకుని వెళ్లగల నాయకుడు కావాలని కేంద్రం భావిస్తోంది. 10

> "తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అత్యంత ఆసక్తికరమైన, అత్యంత వేడి వేడి చర్చ ఒకటి జోరుగా సాగుతోంది. టీ స్టాల్ దగ్గర నుంచి ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయం వరకు ఇదే చర్చ. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని మార్చాలని బీజేపీ కేంద్ర నాయకత్వం యోచిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. భారతదేశంలో చాలా రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉండగా, ఇప్పుడు తెలంగాణపై కూడా పూర్తి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. 2029 ఎన్నికల నాటికి తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని కేంద్ర నాయకత్వం గట్టిగానే ప్రణాళికలు రచిస్తున్నట్లు బీజేపీ శ్రేణులు చెబుతున్నాయి.





ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 కు సర్వం సిద్ధం

- డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో మెగా సమ్మిట్
- డిసెంబర్ 8న తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ - సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర,
నవంబర్ 5: సెక్రటేరియట్:

డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026 ఏర్పాట్ల పురోగతిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షించారు. సమ్మిట్ వేదిక, వివిధ హాళ్లు, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, కార్యక్రమాల నిర్వహణపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మంత్రులకు, అధికారులకు పలు సూచనలు చేశారు.



ప్రతి ప్రతినిధికి లైజనింగ్ అధికారి

గ్లోబల్ సమ్మిట్ కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ఒక లైజనింగ్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమ్మిట్ కు సంబంధించిన పూర్తి 02



శ్రీ కురుమూర్తి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు

సచివాలయంలో సీఎంను కలిసిన దేవస్థానం కమిటీ

తెలంగాణ స్టేట్ బ్యూరో
విజన్ ఆంధ్ర, నవంబర్ 05:
సెక్రటేరియట్:

ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్న శ్రీ కురుమూర్తి వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా దేవస్థానం కమిటీ ప్రతినిధులు ముఖ్యమంత్రి 02

'ఆర్ఆర్ ట్యాక్స్' నిజమే అయితే చర్యలేవి?

- మోదీ, షాలకు కేటీఆర్ ప్రశ్న

- చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణ
- బీజేపీ-కాంగ్రెస్ మధ్య అవగాహన ఉందని ఆరోపణ

02

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో



ఢిల్లీ హోటల్ గొడవ... గాంధీ భవన్ విచారణ వాయిదా!

- అనివార్య కారణాల వల్ల రాలేమని మంత్రి దామోదర రాజనర్సింహా, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు సమాచారం
- ఇద్దరినీ మరోసారి పిలిచి చర్చించనున్న పీసీసీ

తెలంగాణ స్టేట్ బ్యూరో,
విజన్ ఆంధ్ర, నవంబర్ 05:

ఢిల్లీ షాంగ్రిలా హోటల్ లో మంత్రి దామోదర రాజనర్సింహా, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మధ్య జరిగిన గొడవ వ్యవహారంలో కొత్త మలుపు చోటుచేసుకుంది. ఈ ఘటనపై విజన్ ఆంధ్ర పత్రిక లో మంగళవారం వివరంగా వార్త 02



అయ్యప్ప సొసైటీపై సర్వే చేయాలి

- రేవంత్ సర్కారుకు కవిత నెల రోజుల డెడ్‌లైన్ 02
- అయ్యప్ప సొసైటీ అక్రమ కట్టడాలపై సర్వేకు కవిత డిమాండ్
- కాంగ్రెస్ వచ్చాక 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని ఆరోపణ
- సీఎం సోదరులే డబ్బులు దండుకుంటున్నారని వ్యాఖ్య

మృత్యువును రెండుసార్లు తప్పించుకున్న ఎమ్మెల్యే!

ఒకే రోజు, ఒకే రూట్ లో, రెండు ప్రమాదాలు



- వేముల వీరేశంకు తృటిలో తప్పిన పెను ముప్పు
- నకిరేకల్ నుంచి తుంగతుర్తి వరకు ఉత్కంఠ



తెలంగాణ స్టేట్ బ్యూరో,
విజన్ ఆంధ్ర, నవంబర్ 05:

ఆ రోజు నకిరేకల్ - చిట్యాల - తుంగతుర్తి రోడ్డులో ప్రయాణించిన ప్రతి ఒక్కరికీ గుండె ఆగినంత పని అయింది. కారణం కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశం. ఒకే రోజు, వరుసగా రెండు రోడ్డు ప్రమాదాలకు గురై, రెండుసార్లూ మృత్యువును తృటిలో తప్పించుకున్నారు.


ఉదయం ఒక ప్రమాదం, మధ్యాహ్నం మరో ప్రమాదం. రెండు ప్రమాదాల్లోనూ కార్లు దెబ్బతిన్నాయి. కానీ ఎమ్మెల్యే మాత్రం క్షేమంగా బయటపడ్డారు. ఈ వార్త తెలియగానే నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో కార్యకర్తలు, అభిమానులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. "దేవుడు కాపాడాడు" 02

ఏపీలో ముగిసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్..

- చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా సాగిన ప్రక్రియ,
- ప్రాథమిక అంచనాల ప్రకారం 65%-68% పోలింగ్ నమోదు,
- నవంబర్ 7న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

అమరావతి నవంబర్ 05:

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరంలో కీలక ఘట్టమైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం కారణంగా ఉదయం పోలింగ్ మందకొడిగా సాగినా, మధ్యాహ్నం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. చెదురుమదురు ఘర్షణలు, వాగ్వాదాలు మినహా పోలింగ్ ప్రక్రియ చాలా వరకు ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 58.55% పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. పోలింగ్ ముగిసే సమయానికి ఈ శాతం 65 నుంచి 68 శాతం మధ్య ఉండవచ్చని 02



పెండింగ్ కేసులకు ఇక జాప్యం లేదు

- మహబూబ్ నగర్ పోలీసులకు ఎస్పీ జానకి స్ట్రిక్ట్ ఆదేశాలు

- మాదకద్రవ్యాలు, మహిళల భద్రత, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి
- నెలవారీ నేర సమీక్ష సమావేశంలో కీలక నిర్ణయాలు



తెలంగాణ స్టేట్ బ్యూరో,
విజన్ ఆంధ్ర, నవంబర్ 05:

మహబూబ్ నగర్ జిల్లాలో పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, దర్యాప్తులో జాప్యం లేకుండా నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం జరిగిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ అధికారులకు పలు కీలక సూచనలు 02

ఏపీలో ముగిసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్..

ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. రాయలసీమ, కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనగా, కొన్ని గిరిజన, తీర ప్రాంతాల్లో పోలింగ్ శాతం కాస్త తక్కువగా నమోదైనట్లు సమాచారం. ఈ ఎన్నికల బరిలో నిలిచిన సుమారు 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గాను 77 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 9,821 ఎంపీటీసీ స్థానాలకు గాను 2,051 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఈరోజు పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగానే సాగినప్పటికీ, పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. కొన్ని చోట్ల పెట్రోల్ బాంబులతో దాడులు జరిగాయి. కొన్ని చోట్ల ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో దాడులకు దిగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అయితే, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనల వల్ల పోలింగ్‌కు పెద్దగా అంతరాయం కలగలేదు. పోలింగ్ ముగిసిన వెంటనే అధికారులు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేసి, కట్టుదిట్టమైన భద్రత నడుమ వాటిని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఏవైనా కేంద్రాల్లో తీవ్రమైన అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే, నవంబర్ 6న అక్కడ రీ-పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 7వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ ఫలితాల ఆధారంగా నవంబర్ 11, 12 తేదీల్లో ఎంపీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ల ఎన్నికలు జరగనున్నాయి. దీంతో స్థానిక ప్రజాప్రతినిధుల ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది.

అయ్యప్ప సొసైటీపై సర్వే చేయాలి

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ఖానామెట్ అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తున్నామని, లేదంటే తమ పార్టీ కార్యకర్తలే అక్రమ కట్టడాలకు 'రెడ్ మార్క్' వేస్తారని హెచ్చరించారు. హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలో సుమారు 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులే దగ్గరుండి పర్మిషన్లు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప సీఎం రేవంత్‌కు మరేమీ కనిపించడం లేదని ఆమె విమర్శించారు. ఈ వ్యవహారంలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అయ్యప్ప సొసైటీలో రిజిస్ట్రేషన్లు జరగవని, అక్కడ ఇళ్లు కొనుగోలు చేసి ప్రజలు నష్టపోవద్దని కవిత సూచించారు. గురుకుల ట్రస్ట్ భూములపై గతంలో తాము ఎన్నో ఉద్యమాలు చేశామని గుర్తుచేశారు. ఇదే సొసైటీలో నారాయణ, చైతన్య వంటి విద్యాసంస్థలు కూడా ఉన్నాయని ఆమె తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనపైనా కవిత స్పందిస్తూ, ఆయన కేవలం రాజకీయాలు మాట్లాడి వెళ్లారని, రాష్ట్రంలోని కరవు పరిస్థితులపై స్పందించలేదని విమర్శించారు.

'ఆర్ఆర్ ట్యాక్స్' నిజమే అయితే చర్యలేవి?

'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేతలు ఆరోపణలు చేస్తున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తన ఎక్స్ పోస్టులో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోదీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. అలాంటప్పుడు ఆ వసూళ్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు తరచూ వస్తున్న మోదీ, అమిత్ షాలు ఈ అంశంపై బహిరంగంగా విమర్శలు చేయడం తప్ప, తదుపరి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు. ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అంతర్గత అవగాహన ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్యలకు ముందుకు రావడం లేదని విమర్శించారు. ఆరోపణలు చేయడం, రాజకీయంగా విమర్శలు గుప్పించడం తప్ప ఆ వసూళ్లపై విచారణ జరిపించేందుకు బీజేపీ నేతలు చొరవ చూపడం లేదని అన్నారు. 'ఆర్ఆర్ ట్యాక్స్' అంశంపై ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ ఆరోపణలను తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఖండించింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఈ అంశం రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. అయితే చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారన్న కేటీఆర్ ఆరోపణపై స్వతంత్రంగా నిర్ధారితమైన ఆధారాలు ఈ కథనంలో ప్రస్తావించలేదు.


శ్రీ కురుమూర్తి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

ఎ. రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వానించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డితో పాటు దేవాలయ కమిటీ సభ్యులు, అర్చకులు ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, కార్యక్రమాల వివరాలను కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలకు రావాలని, స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఆహ్వానాన్ని స్వీకరించి, బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరగాలని ఆకాంక్షించినట్లు సమాచారం. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు తెలుస్తోంది. శ్రీ కురుమూర్తి వెంకటేశ్వర స్వామి ఆలయం మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటి. ప్రతి ఏటా జరిగే బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ ఏడాది కూడా భారీగా భక్తులు వస్తారని కమిటీ అంచనా వేస్తోంది. ఈ నెల 10 నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ప్రత్యేక పూజలు, సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

ఢిల్లీ హోటల్ గొడవ...

గాంధీ భవన్ విచారణ వాయిదా!

వేయడం జరిగింది. ఆ వార్త తర్వాత టీపీసీసీ విచారణకు ఆదేశించింది. గురువారం గాంధీ భవన్ లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో సమావేశం జరగాల్సి ఉంది.



అయితే ఈ సమావేశానికి ఇద్దరూ హాజరు కాలేకపోతున్నారు. అనివార్య కారణాల వల్ల గాంధీ భవన్ లో జరిగే సమావేశానికి హాజరు కాలేకపోతున్నానని మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు ఇద్దరూ పీసీసీకి సమాచారం ఇచ్చారు. దీంతో గురువారం విచారణ వాయిదా పడింది. వారిద్దరినీ మరోసారి పిలిచి చర్చించనున్నట్లు పీసీసీ తెలిపింది. కొత్త తేదీని త్వరలోనే ప్రకటిస్తారని సమాచారం.

అసలు ఢిల్లీలో ఏం జరిగింది?

విజన్ ఆంధ్రలో మంగళవారం వచ్చిన కథనం ప్రకారం, ఢిల్లీ పర్యటన సందర్భంగా షాంగ్రిలా హోటల్ లో మంత్రి, ఎమ్మెల్యే మధ్య మాటామాటా పెరిగి చివరకు తన్నుకునే స్థాయికి వెళ్లింది. హోటల్ లాబీలోనే ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు, అక్కడ ఉన్నవారు కల్పించుకుని సర్దిచెప్పినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ ఘటన తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు బహిరంగంగానే ఉన్నాయి. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలుగుతుందని సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తం చేయడంతో టీపీసీసీ విచారణకు ఆదేశించింది. ఇద్దరినీ గాంధీ భవన్ కు పిలిచి వివరణ తీసుకోవాలని నిర్ణయించింది.

ముందు దుమ్మా అన్నారు, ఇప్పుడు అనివార్య కారణాలు అంటున్నారు

ఉదయం నుంచి మంత్రి విచారణకు గైర్హాజరు అవుతున్నారని, "నేను విచారణకు వచ్చేది ఏంది" అంటూ దుమ్మా కొట్టారని వార్తలు వచ్చాయి. మరోవైపు ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మధ్యాహ్నం విచారణకు హాజరవుతారని, షాంగ్రిలా హోటల్ సీసీటీవీ ఫుటేజ్ తెప్పించానని, విచారణలో ఆ ఫుటేజ్ ను ఆధారాలుగా సమర్పిస్తానని తెలిపారని వార్తలు వచ్చాయి. కానీ తాజా సమాచారం ప్రకారం ఇద్దరూ గురువారం రాలేమని చెప్పారు. అనివార్య కారణాల వల్ల సమావేశానికి హాజరు కాలేకపోతున్నామని పీసీసీకి సమాచారం ఇచ్చారు. దీంతో విచారణ మరో తేదీకి వాయిదా పడింది.

సీసీటీవీ ఫుటేజ్ పైనే అందరి దృష్టి

ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తెప్పించిన షాంగ్రిలా హోటల్ సీసీటీవీ ఫుటేజ్ పైనే ఇప్పుడు అందరి దృష్టి ఉంది. ఆ ఫుటేజ్ లో అసలు ఏం జరిగిందో స్పష్టంగా ఉంటుందని, విచారణలో దానినే ఆధారంగా సమర్పిస్తానని ఆయన ఇంతకుముందు తెలిపారు. మరోసారి జరిగే సమావేశంలో ఆ ఫుటేజ్ ను ఆయన సమర్పిస్తారా, లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

పీసీసీ ఏం చేస్తుంది?

పీసీసీ ఇప్పుడు ఇద్దరినీ మరోసారి పిలిచి చర్చించనుంది. ఇద్దరి వెర్షన్ విని, ఆధారాలు పరిశీలించి అధిష్టానానికి నివేదిక ఇవ్వనుంది. ఈ వివాదం ఎంత త్వరగా సమసిపోతే పార్టీకి అంత మంచిదని నేతలు భావిస్తున్నారు. ఢిల్లీ హోటల్ లో మొదలైన గొడవ ఇప్పుడు గాంధీ భవన్ విచారణ వరకు వచ్చి, ఇప్పుడు వాయిదా దశకు చేరింది. మరోసారి జరిగే సమావేశంలో ఇద్దరూ హాజరవుతారా, ఫుటేజ్ బయటకు వస్తుందా, వివాదం సద్దుమణుగుతుందా అనేది వేచి చూడాలి.

పెండింగ్ కేసులకు ఇక జాప్యం లేదు

చేశారు.
జిల్లాలో నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం, నాణ్యమైన దర్యాప్తు, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి పోలీస్ అధికారి ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని ఎస్పీ చెప్పారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు నేరస్తులకు చట్ట ప్రకారం శిక్ష పడేలా పటిష్టమైన ఆధారాలతో కేసుల దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లాలోని నేరాల పరిస్థితి, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, పోలీస్ స్టేషన్ల పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలను సమీక్షించారు.

పెండింగ్ కేసులకు ప్రత్యేక కార్యాచరణ

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసులను సమీక్షిస్తూ, వాటి పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణ రూపొందించుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, అవసరమైన సాక్ష్యాధారాలను పక్కాగా సేకరించాలని, నిర్దేశిత గడువులోగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. కేసుల విచారణలో నిర్లక్ష్యం, జాప్యం సహించబోమని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత

మహిళలు, బాలికలు, చిన్నారులపై జరిగే నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ తెలిపారు. భరోసా కేంద్రం, షీ-టీమ్స్ ద్వారా బాధితులకు తక్షణ సహాయం అందించాలని, మహిళల భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మహిళలపై నేరాలు, పోక్సో, ఎస్సీ / ఎస్టీ కేసులు, మిస్సింగ్ కేసులు, రౌడీ షీట్లపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

జిల్లాలో గంజాయి తదితర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. మాదకద్రవ్యాల సరఫరా, విక్రయాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారిని గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో డీ-అడిక్షన్ కేంద్రాలకు పంపించి అవసరమైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యువత, విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై నిరంతరం అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత

సైబర్ నేరాలు, ఆన్ లైన్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి అవసరమైన సహాయం అందించాలని అధికారులకు సూచించారు. సైబర్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు సీసీటీఎన్ఎస్ 2.0 లో పెండింగ్ వివరాలను సకాలంలో నమోదు చేయాలని, నాట్ గ్రిడ్, గాండీవ వెబ్ అప్లికేషన్లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ర్యాష్ డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణ స్పందన

పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని, నేరాల నియంత్రణలో సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్ బీ డీఎస్పీ రమణారెడ్డి, వన్ టౌన్ ఇన్ స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్ స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్, జడ్చర్ల టౌన్ ఇన్ స్పెక్టర్ కమలాకర్, జడ్చర్ల రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ మహేష్, భూత్పూర్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ రామకృష్ణ, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ కృష్ణయ్య, ఎస్ బీ ఇన్ స్పెక్టర్ రవి బాబు, ఐటీ సెల్ సబ్ ఇన్ స్పెక్టర్లు రవి, ఇతర ఎస్ ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మృత్యువును రెండుసార్లు తప్పించుకున్న ఎమ్మెల్యే!

అంటూ అందరూ అనుకున్నారు.

మొదటి ప్రమాదం - ఉదయం, నకిరేకల్ నుంచి చిట్యాలకు

ఉదయం ఎమ్మెల్యే వేముల వీరేశం నకిరేకల్ నుంచి చిట్యాలకు బయలుదేరారు. ఆయన ఫార్చ్యూనర్ కారులో ఉన్నారు. రోడ్డుపై ట్రాఫిక్ మామూలుగానే ఉంది. అంతలోనే ఎదురుగా వేగంగా వస్తున్న కార్నివాల్ కారు అదుపు తప్పి ఫార్చ్యూనర్ ను బలంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన శబ్దానికి చుట్టుపక్కల వాళ్లంతా పరుగున వచ్చారు. ఫార్చ్యూనర్ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. కారులో ఉన్నవారు ఒక్క క్షణం ఏం జరిగిందో అర్థం కాక షాక్ లో ఉండిపోయారు. కానీ అదృష్టవశాత్తు ఎమ్మెల్యేకు, కారులో ఉన్నవారికి పెద్ద గాయాలు కాలేదు. చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. ఎమ్మెల్యేను సురక్షితంగా పక్కకు తీసుకెళ్లారు. అందరూ అనుకున్నారు - "ప్రమాదం తప్పింది, ఇక అంతా సవ్యంగా ఉంటుంది" అని. కానీ అసలు కథ ఇంకా మిగిలే ఉంది.

రెండో ప్రమాదం - చిట్యాల నుంచి తుంగతుర్తికి

మొదటి ప్రమాదంలో కారు దెబ్బతినడంతో ఎమ్మెల్యే కారు మారారు. చిట్యాల నుంచి తుంగతుర్తికి క్రిస్టా కారులో బయలుదేరారు. కొంత దూరం వెళ్లగానే మళ్లీ అదే పరిస్థితి. ఈసారి ఎదురుగా వస్తున్న లారీ క్రిస్టా కారును ఢీకొట్టింది. లారీ వేగం ఎక్కువగా ఉండటంతో కారు పక్కకు తిరిగిపోయింది. ఆ దృశ్యం చూసిన వారికి గుండె జారినంత పని అయింది. కానీ మరోసారి అదృష్టం ఎమ్మెల్యేను కాపాడింది. ఈ రెండో ప్రమాదంలో కూడా వేముల వీరేశం సురక్షితంగా బయటపడ్డారు. కారులో ఉన్న ఇతరులకు కూడా ప్రాణాపాయం తప్పింది. రెండుసార్లు ఇలా జరగడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

స్థానికులు, పోలీసులు - దేవుళ్లలా స్పందించారు

రెండు ప్రమాదాల్లోనూ స్థానికులు, పోలీసులు సకాలంలో స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ ను నియంత్రించారు. గాయపడిన వారికి సాయం చేశారు. ఎమ్మెల్యేను సురక్షితంగా తరలించారు. ఒకవేళ వారు ఆలస్యం చేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని అక్కడ ఉన్నవారు చెబుతున్నారు. వారి స్పందనే ఎమ్మెల్యేకు ధైర్యం ఇచ్చింది.

నియోజకవర్గాల్లో టెన్షన్ - ఆ తర్వాత రిలీఫ్

వార్త తెలియగానే నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో టెన్షన్ నెలకొంది. కార్యకర్తలు ఫోన్ల మీద ఫోన్లు చేశారు. "ఎమ్మెల్యే ఎలా ఉన్నారు? దెబ్బలు తగిలాయా?" అని ఆరా తీశారు. ఎమ్మెల్యే క్షేమంగా ఉన్నారని తెలియగానే అందరూ హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో "వీరేశం క్షేమంగా ఉన్నారు" అనే పోస్టులు వెల్లువెత్తాయి. చాలామంది "ఒకే రోజు రెండు ప్రమాదాల నుంచి బయటపడటం అంటే మామూలు విషయం కాదు, దేవుడి ఆశీస్సులు ఉన్నాయి" అని అంటున్నారు.

పోలీసుల దర్యాప్తు - ఎందుకు జరిగాయి?

రెండు ప్రమాదాలు ఎందుకు జరిగాయి? అతివేగమా? నిర్లక్ష్యమా? రోడ్డు పరిస్థితి కారణమా? అనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కార్నివాల్ కారు డ్రైవర్, లారీ డ్రైవర్ నిర్లక్ష్యంపై కూడా విచారణ జరుగుతోంది. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుపై వేగ నియంత్రణ, సైన్ బోర్డులు, పోలీస్ చెకింగ్ పెంచాలని వారు కోరుతున్నారు.

ఒకే రోజు రెండుసార్లు - ఇది కేవలం వార్త కాదు, హెచ్చరిక

ఈ ఘటన ఎమ్మెల్యేకు మాత్రమే జరిగిన ప్రమాదం కాదు. ప్రతి రోజూ ఈ రోడ్లపై ప్రయాణించే వేల మంది ప్రజలకు ఇది ఒక హెచ్చరిక. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ ఎంత ప్రమాదకరమో ఈ ఘటన మళ్లీ గుర్తు చేసింది. ఎమ్మెల్యే వేముల వీరేశం రెండు ప్రమాదాల నుంచి బయటపడటం అందరికీ ఊరట. కానీ ఈ రోడ్డుపై ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 కు సర్వం సిద్ధం

సమాచారాన్ని ముందుగానే ప్రతినిధులకు అందజేయడంతో పాటు వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానించాలని సూచించారు. ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారితో పాటు భద్రతా అధికారిని నియమించాలని సూచించారు. సమ్మిట్ కు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు చేసుకునేందుకు, పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే కంపెనీల ప్రతినిధులకు ప్రత్యేక ఆహ్వానాలు అందించాలన్నారు. నవంబర్ 15 నాటికి సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి పూర్తి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గత ఏడాది కంటే 6 రెట్లు పెద్దది

గత ఏడాది తెలంగాణ రైజింగ్ సమ్మిట్ తో పోలిస్తే ఈసారి మరింత విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో ఒక ఎక్స్ పో హాల్ ఉండగా, ఈసారి ఆరు ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తున్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యమిస్తూ సదస్సు కార్యక్రమాలను రూపొందించారు. సమ్మిట్ లో భాగంగా రక్షా ఎక్స్ పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ ఎక్స్ పో, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, తెలంగాణ పెవిలియన్, ఎడ్యుకేషన్ ఎక్స్ పో, క్లైమేట్ కాంక్లేవ్ ల ఏర్పాట్లను అధికారులు వివరించారు.

రక్షా ఎక్స్ పో - 49 సంస్థలు

రక్షా ఎక్స్ పోలో రక్షణ, ఏరోస్పేస్, అంతరిక్షం, సైబర్ సెక్యూరిటీ రంగాలకు చెందిన ఆధునిక



పరికరాలు, డ్రోన్లు, రోబోటిక్స్ ప్రదర్శించనున్నారు. వైమానిక విన్యాసాలు కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రక్షా ఎక్స్ పోలో పాల్గొనేందుకు ఇప్పటివరకు 49 సంస్థలు ముందుకు వచ్చాయి. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాలకు సంబంధించి ఇండియా జాయ్ - 2026 నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్టార్టప్ ల కోసం ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు చేసి 136 స్టార్టప్ ల ఆవిష్కరణలను ప్రదర్శించేలా ప్రణాళిక రూపొందించారు. తెలంగాణ ఇన్నోవేషన్ స్టార్టప్ ఛాలెంజ్ లో భాగంగా వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను ఆహ్వానిస్తున్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి 60 కంపెనీల ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల పెవిలియన్ లో ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయ డ్రోన్లు, పాడి, మత్స్య, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, చేనేత, బతుకమ్మ, కాకతీయుల శిల్పకళతోపాటు రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలను ప్రతిబింబించేలా ప్రత్యేకంగా తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు చేస్తున్నారు. గ్లోబల్ సమ్మిట్ లో పర్యాటక రంగానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే, విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి సంబంధించి ప్రత్యేక ఎడ్యుకేషన్ ఎక్స్ పోలో 'నర్సరీ నుంచి ఆక్స్ ఫర్డ్ వరకు' తెలంగాణ విద్యారంగం ప్రతిబింబించేలా సమ్మిట్ లో చర్చలు జరగాలని చెప్పారు. మూడు రోజుల సమ్మిట్ లో నాలుగు ప్రధాన హాళ్లలో 52 రంగాలవారీ సమావేశాలు నిర్వహించేలా ప్రణాళికరూపొందించినట్లు అధికారులు తెలిపారు. సమ్మిట్ నిర్వహణ కోసం 25 రంగాలవారీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు ఉత్తమ్. కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, గడ్డం వివేక్ వెంకటస్వామి సభ్యులుగా ఉన్న మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాట్ల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ముఖ్యమంత్రి సూచించారు.

వాతావరణ మార్పులపై ప్రత్యేక చర్చ

- తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్

ఎల్ నినో ప్రభావం, వాతావరణ మార్పులతో ఎదురవుతున్న సమస్యలు, వాటిని ఎదుర్కొనడానికి తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక పరిష్కారాలపై డిసెంబర్ 8న తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ఈ సదస్సులో దాదాపు 200 మంది శాస్త్రవేత్తలు, రైతులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొంటారు. కరువును తట్టుకునే వ్యవసాయం, పశుసంరక్షణ, తాగునీటి భద్రత, అధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షణ, అడవులు, జీవవైవిధ్య పరిరక్షణ, వ్యర్థాలను సంపదగా మార్చడం వంటి ఐదు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. ఇప్పటికే వాతావరణ మార్పుల కారణంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక కార్యాచరణను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో కరువు, వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించే దిశగా ఈ సదస్సు నిర్ణయాత్మక పాత్ర పోషించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కొడంగల్‌కు మహర్దశ..

రూ.9,053 కోట్లతో అభివృద్ధి పనులు

ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా మొత్తం రూ.9,053.48 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, శిలాఫలకాల ఆవిష్కరణలు జరగనున్నాయి. వీటిలో కొడంగల్ నుంచి పరిసర ప్రాంతాలకు రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే రేడియల్ రోడ్డు నిర్మాణం కీలకమైనది.

విద్యారంగంలో రూ.116.80 కోట్లతో పది తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, రూ.123 కోట్లతో కొడంగల్‌లో వ్యవసాయ కళాశాల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. మద్దూరులో రూ.20 కోట్లతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మరో రూ.20 కోట్లతో సమీకృత డివిజనల్ కార్యాలయ సముదాయాన్ని నిర్మించనున్నారు.

కొడంగల్, కోస్గి, మద్దూరులో రూ.41.83 కోట్లతో ఆధునిక బస్టాండ్లు, రూ.59.30 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. తిమ్మారెడ్డిపల్లిలో గురులోక మసంద్ ప్రభు మందిరం అభివృద్ధికి రూ.4.45 కోట్లు, కొడంగల్‌లో నిరంజన్ మఠం అభివృద్ధికి రూ.5.10 కోట్లు కేటాయించారు.

పారిశ్రామిక రంగంలో లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ, హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.10 కోట్లతో పర్యాటక హోటల్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

అదేవిధంగా రూ.46.08 కోట్లతో నిర్మాణం పూర్తిచేసుకున్న ప్రభుత్వ భవనాలను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు.

నవంబర్ 7: రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ప్రారంభం

ముఖ్యమంత్రి పర్యటన నవంబర్ 7న ప్రారంభం కానుంది. ఉదయం 11 గంటలకు వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని హకీంపేటకు చేరుకోనున్న రేవంత్‌రెడ్డి.. అక్కడ నిర్వహించే మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభిస్తారు.

రైతు మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం పారిశ్రామికవేత్తలతో సమావేశమై పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలపై చర్చించనున్నారు. కార్యక్రమాల అనంతరం కొడంగల్‌కు చేరుకుంటారు.

నవంబర్ 8: వరుస ప్రారంభోత్సవాలు.. రేడియల్ రోడ్డుకు శంకుస్థాపన

రెండో రోజు నవంబర్ 8న ఉదయం హకీంపేటలో స్వయం సహాయక సంఘాల మహిళలతో నిర్వహించే సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు.

లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తారు. హకీంపేటలో నాట్కో సంస్థ సీఎస్ఆర్ నిధులతో రూ.4 కోట్లతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలను, రూ.2.35 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు.

బొంరాస్‌పేటలో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల, రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాలను ప్రారంభించనున్నారు. కొడంగల్‌లో రూ.3.80 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయ భవనాలను ప్రారంభిస్తారు. దుద్యాలలో రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, రూ.12 కోట్లతో నిర్మించిన సమీకృత మండల కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారు.

ఈ పర్యటనలో అత్యంత కీలకమైన కార్యక్రమంగా కోస్గి మండలం నాచారం గ్రామంలో రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వద్ద కొత్తవల్‌గూడ నుంచి నాచారం సమీపంలోని జాతీయ రహదారి-167 వరకు ఈ రహదారిని నిర్మించనున్నారు.

అనంతరం కోస్గిలో రూ.6 కోట్లతో నిర్మించిన సైన్స్ మ్యూజియాన్ని, దౌల్తాబాద్ మండలం బాలంపేటలో రూ.2.35 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, దౌల్తాబాద్‌లో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభిస్తారు.

కార్యక్రమాల అనంతరం కొడంగల్‌లోని తన నివాసానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.

నవంబర్ 9: 50 వేల మంది రైతులతో భారీ బహిరంగ సభ

మూడో రోజు నవంబర్ 9న ముఖ్యమంత్రి కొడంగల్ నివాసం నుంచి హకీంపేటకు చేరుకుని రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ సభకు రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులను సమీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, సాగునీటి సౌకర్యాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు వంటి అంశాలపై ఈ సభలో చర్చకు ప్రాధాన్యం ఉండనుంది. భారీ రైతు సమీకరణతో ఈ కార్యక్రమం రాజకీయంగా, పరిపాలనాపరంగా కూడా ప్రాధాన్యం సంతరించుకోనుంది.

మారనున్న కొడంగల్ రూపురేఖలు!

రహదారుల విస్తరణతో రవాణా సౌకర్యాలు మెరుగుపడటం, వ్యవసాయ కళాశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, సైన్స్ మ్యూజియం ద్వారా విద్యారంగానికి ఊతం లభించడం, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంతో యువతకు నైపుణ్య శిక్షణ అందడం, పారిశ్రామిక కారిడార్లు, పామాయిల్ ఫ్యాక్టరీతో ఉపాధి అవకాశాలు పెరగడం వంటి అంశాలు కొడంగల్ అభివృద్ధికి కీలకంగా మారనున్నాయి.

ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ కళాశాలలు, పోలీస్ స్టేషన్లు, బస్టాండ్లు, కార్యాలయ భవనాల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మూడు రోజుల పర్యటన ద్వారా కొడంగల్ అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని స్థానికులు ఆశిస్తున్నారు.

మొత్తంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన కొడంగల్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి రంగాల్లో కీలక మార్పులకు పునాది వేయనుంది. ప్రకటించిన ప్రాజెక్టులు నిర్ణీత సమయంలో పూర్తయితే కొడంగల్ ప్రాంత ఆర్థిక, సామాజిక ముఖచిత్రం మారే అవకాశముంది.

సంపాదకీయం

ఐడీబీఐ వాటాలపై అనుమానాలు

బిజెపి ప్రభుత్వం మరో ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటుకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసింది. 1964లో పారిశ్రామిక అభివృద్ధి రుణాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పరచిన ప్రభుత్వ రంగ బ్యాంకు ఐడిబిఐ ని కెనడాకు చెందిన ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్స్‌కి కేంద్రం అప్పగిస్తోంది. అక్టోబర్ 14న కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ దీనికి ఆమోద ముద్రవేసింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఈ బ్యాంకుపై అధికారం చేతులు మారిపోతుంది. బ్యాంకుల విస్తరణ కారణంగా ఐడిబిఐ 2015లో పబ్లిక్ సెక్టర్ బ్యాంకుగా మారిపోయింది. ప్రస్తుతం అది మిగతా వాణిజ్య బ్యాంకుల మాదిరిగానే శాఖల ఏర్పాటుతోపాటు సేవలు అందిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న 2100 శాఖలు ఉన్న ఈ బ్యాంకులో 20వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 2015-16 లో ఈ బ్యాంకును మూల ధన కొరత, నిరర్థక ఆస్తుల పెరుగుదల లాంటి చిక్కులను ఎదుర్కొని రూ. 3వేల కోట్ల నష్టాలను మూట కట్టుకుంది. ఈ విపత్తు నుండి బ్యాంకును బయటపడేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీని వాడుకుంది. రూ. 22వేల కోట్లు వెచ్చించి ఎల్ఐసి ఈ బ్యాంకులో సుమారు సగం వాటాను సొంతం చేసుకుంది. అలా బలపడిన ఐడిబిఐ ఇప్పటికీ లాభాల బాటలోనే నడుస్తోంది. ఆనాటి వాటా అమ్మకంవల్ల ఈ బ్యాంకుపై హక్కులు 45.48% కేంద్ర ప్రభుత్వానికి, 49.24% ఎల్ఐసికి చెందుతాయి. ఇందులోంచి ఇప్పుడు కేంద్రం 30.48%, ఎల్ఐసి 30.24% వాటాను ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్‌కి అమ్మేస్తున్నాయి. వాటి మొత్తం విలువ రూ. 53 వేల కోట్లు. జులైలో జరిగిన వేలం పాటలో ఆ ఒక్క సంస్థే పాల్గొనడంతో ఈ ఒప్పందం కుదిరింది. ఇందువల్ల రూ. 81 ఉన్న బ్యాంకు షేర్ విలువను రూ. 76కు తగ్గించవలసి వచ్చింది. ఎల్ఐసికి మిగలబోయే 19% వాటాను కూడా త్వరలోనే బహిరంగ మార్కెట్ ద్వారా అమ్మేసేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఐడిబిఐలో ఈ వాటాను కొనుగోలు చేసి బ్యాంకుపై పెత్తనం పొందుతున్న ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్ సంస్థ యజమాని వివియన్ ప్రేమ్ వత్స. అతను ప్రవాస భారతీయుడు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఐఐటి మద్రాస్‌లో చదివాడు. కెనడా వెళ్లి ఒక దివాళా తీసిన బీమా కంపెనీని కొని ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్‌గా పేరు మార్చి లాభాలు గడిస్తూ ప్రముఖ వ్యాపారవేత్తగా ఎదిగారు. తన వ్యాపార విస్తరణలో భాగంగా ఇప్పుడు ఐడిబిఐని కొనుగోలు చేస్తున్నారు. బలమైన పునాదులున్నప్పటికీ సంక్షోభంలో ఉన్న కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడమే ప్రేమ్ వత్సా విజయానికి ప్రధాన సూత్రం. అలాంటి కంపెనీలను గుర్తించడంలో ఆయనకు అసాధారణమైన సామర్థ్యం ఉంది. అంతేకాదు, వాటిలో దీర్ఘకాలం పెట్టుబడులను కొనసాగించే సహనం కూడా ఉంది. కాలగమనాన్ని అంచనా వేయడంలోనూ వత్సా దిట్ట. సంక్షోభం రాబోతోందన్న సంకేతాలను ముందుగానే పసిగట్టగలరు. ఈ సామర్థ్యంతోనే 1987లో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల పతనాన్ని, బ్లాక్ మండేగా ప్రసిద్ధి చెందిన పరిణామాన్ని, 1990లో జపాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడాన్ని, 2008లో సబ్‌ప్రైమ్ సంక్షోభంగా పిలిచే అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభాన్ని ఆయన ముందుగానే గుర్తించారు. ఆ సమయంలో అమెరికా ఆర్థిక మందగమనాన్ని అవకాశంగా మలుచుకున్న ప్రేమ్ వత్సా, భవిష్యత్తులో మంచి పనితీరు కనబరిచే అవకాశమున్న కంపెనీల షేర్లను అతి తక్కువ ధరలకు కొనుగోలు చేశారు. అయితే, ఫెయిర్‌ఫాక్స్ కూడా ఎదురుదెబ్బలు చవిచూసింది. హార్వీ, ఇర్మా, మారియా తుపానులతో పాటు కాలిఫోర్నియాలో చెలరేగిన కార్చిచ్చుల వల్ల సంస్థకు గణనీయమైన నష్టాలు వచ్చాయి. కోవిడ్-19 మహమ్మారి కూడా సంస్థకు పెద్ద సవాలుగా మారింది. ఆ సమయంలో దాని బీమా వ్యాపారం భారీ నష్టాలను చవిచూసింది. అయితే, ప్రేమ్ వత్సా సామర్థ్యం ఫెయిర్‌ఫాక్స్‌ను మళ్లీ పుంజుకునేలా చేసింది. 2022 అక్టోబర్‌తో పోలిస్తే 2025లో ఫెయిర్‌ఫాక్స్ విలువ నాలుగు రెట్లు పెరిగింది. ఫెయిర్‌ఫాక్స్ వ్యాపార వ్యూహం విజయవంతమైంది. బీమా క్లెయిమ్‌లు చెల్లించాల్సిన సమయం రాకముందే భారీ మొత్తంలో ప్రీమియంలను వసూలు చేసి, బలమైన పునాదులున్నప్పటికీ తక్కువ ధరకు లభించే షేర్లలో పెట్టుబడులు పెట్టడం ద్వారా సంస్థ విజయాన్ని సాధించింది. వ్యాపార, పారిశ్రామిక రంగాలకు చేసిన అసాధారణ సేవలకు గుర్తింపుగా ప్రేమ్ వత్సాకు పద్మశ్రీ పురస్కారం లభించింది. ఇప్పటికే ఆయన 2016 లో రూ. 1180 కోట్లతో కేరళంలోని సిఎస్‌బి బ్యాంకులో 51% వాటా సొంతం చేసుకున్నారు. 2020 లో భారత కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించడం విశేషం. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం ఒక విదేశీయుడు దేశంలోని రెండు బ్యాంకులను హస్తగతం చేసుకోరాదు. ఈ లెక్కన ఫెయిర్ ఫ్యాక్స్ సంస్థ ఒక బ్యాంకు నుంచి వైదొలగాలి లేదా రెండు బ్యాంకులను కలిపేసి ఒక్క బ్యాంకుగా మార్చాలి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటాలను బహిరంగంగా అమ్మేస్తూ, వాటిలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంచుతూ దేశ బ్యాంకింగ్ రంగాన్ని బలహీనపరుస్తోంది. బ్యాంకులను జాతీయం చేసిన లక్ష్యాలకు అవి దూరమవుతున్నాయి. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బ్యాంకు ఉద్యోగులు సమ్మెలు, ఆందోళనలు చేపట్టినా వాటి ప్రభావం ప్రభుత్వ చర్యలపై పెద్దగా ఉండడం లేదు. ఐడిబిఐని బాహాటంగా అమ్మేయడమే దీనికి తార్కాణం. దేశంలోని రెండు బ్యాంకులను ఒకే విదేశీ సంస్థ కొనుగోలు చేయడం వల్ల ఆ రెండు బ్యాంకుల ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఒక బ్యాంకులోంచి వాటా వెనక్కి తీసుకొనే బదులు రెండింటిని కలిపి వేయడానికే యాజమాన్యం మొగ్గు చూపుతుంది. ప్రైవేటు చేతుల్లోకి వెళ్లి తమ అస్తిత్వాన్ని కోల్పోవడానికి ఐడిబిఐ ఉద్యోగులు సిద్ధంగా లేరు. ఇప్పటికే ఫెయిర్ ఫాక్స్ సొంతమైన సిఎస్‌బి ప్రైవేటు బ్యాంకు, ఐడిబిఐ ప్రభుత్వ రంగ బ్యాంకు. ప్రభుత్వ రంగ సంస్థ ప్రైవేటు చేతుల్లోని వెళితే దాని ప్రభావం ఉద్యోగుల పని భారం, వేతనాలపై అధికంగా పడుతుంది.

ప్రవల్లిక మృతి తర్వాత ఆర్టీసీ కీలక నిర్ణయం

హైదరాబాద్, నవంబర్ 5మహిళా కండక్టర్ ప్రవళిక మృతి తెలంగాణ ఆర్టీసీలో కీలక మార్పుకు దారితీసింది. ప్రయాణికుల భద్రతతో పాటు సిబ్బంది రక్షణకు సంస్థ కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఇకపై ఆర్టీసీ ఆధ్వర్యంలో నడిచే అన్ని బస్సులకు తప్పనిసరిగా డోర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. డోర్లు పూర్తిగా మూసిన తర్వాతే బస్సులు కదలాలని ఆదేశించింది. డోర్లు లేని బస్సులను గుర్తించి వెంటనే వాటిని అమర్చాలని అధికారులకు సూచించింది. ఆర్టీసీ పరిధిలోని అన్ని రకాల బస్సులకు ఈ నిబంధన వర్తించనుంది. ఇప్పటివరకు డోర్లు లేకుండా నడుస్తున్న బస్సులను గుర్తించి తక్షణమే తలుపులు ఏర్పాటు చేయాలని సంస్థ ఆదేశించింది. ఇకపై బస్సు బయలుదేరే ముందు డోర్లు మూసి ఉన్నాయో లేదో సిబ్బంది నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ప్రవళిక మృతి నేపథ్యంలో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మణుగూరు డిపోకు చెందిన మహిళా కండక్టర్ ప్రవళిక విధుల్లో ఉండగా టికెట్ విషయంలో ఓ మహిళా ప్రయాణికురాలితో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ప్రయాణికురాలు ఆమెను బస్సు నుంచి బయటకు నెట్టివేయడంతో ప్రవళిక కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆసుపత్రికి తరలించినా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఆర్టీసీ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రవళిక కుటుంబాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు.

భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

భూభారతి, జీవో 118, 59, యూఎల్‌సీ, 90-డి, 92 దరఖాస్తులపై ప్రత్యేక కార్యాచరణ

నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు.

కలెక్టర్ సి. నారాయణ రెడ్డి


రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 5, (విజన్ ఆంధ్ర): జిల్లాలో భూ సంబంధిత పెండింగ్ దరఖాస్తులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు.

గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు కిరణ్మయి, చంద్రా రెడ్డితో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూభారతి, జీవో 118, 59, యూఎల్‌సీ, 90-డి, 92 దరఖాస్తుల పరిష్కార పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి పోర్టల్ లో పెండింగ్ లో ఉన్న సుమారు 22 వేల దరఖాస్తులను నవంబర్ 15లోగా పరిష్కరించాలని, జీవో 118 దరఖాస్తులను వారం



రోజుల్లో, జీవో 59, 92 దరఖాస్తులను 15 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. యూఎల్‌సీకి సంబంధించి జీవో 455, 456, 740 కింద ఉన్న మాన్యువల్ దరఖాస్తులను రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా పరిష్కరించాలని సూచించారు. భూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలిగ్రామసభలకు వారం రోజుల ముందుగానే నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. అటవీ, రోడ్లు భవనాలు, ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన భూముల వివరాలను సేకరించి, ఆయా శాఖల అధికారుల సమక్షంలో సరిహద్దులను నిర్ధారించాలని, వారి అభిప్రాయాలు, సంతకాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామసభల నిర్వహణలో నిర్దేశిత ఎస్ఓపీని తప్పనిసరిగా పాటించాలని, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి హాజరు కావాలని, సమావేశ మినిట్స్‌ను అధికారిక రిజిస్టర్లలో నమోదు చేసి హాజరైన వారి సంతకాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రీ-సర్వేకు సంబంధించిన 13 ఫార్మాట్లను సక్రమంగా నిర్వహిస్తూ, సర్వే బౌండరీస్ యాక్ట్ • 1923, తెలంగాణ భూభారతి చట్టం • 2024 నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ, రిజర్వ్, ఇతర శాఖల భూముల విషయంలో క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని, నోటీసుల జారీ, సరిహద్దుల నిర్ధారణ, గ్రామసభ మినిట్స్ సహా అన్ని రికార్డులను భద్రపరచాలని కలెక్టర్ ఆదేశించారు. తప్పుడు నివేదికలు సమర్పించడం, రికార్డుల తారుమారు, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే సంబంధిత అధికారులపై కఠిన శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు డాక్టర్ కిరణ్మయి, చంద్రారెడ్డి, ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ రాంరెడ్డి, డిఆర్ఓ శారదా దేవి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లు, యూఎల్‌సీ విభాగం అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, గ్రామపాలన అధికారులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 5 (విజన్ ఆంధ్ర) ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆర్థిక చేయూత అందించారు. నాగర్‌కర్నూల్ జిల్లా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న పెబ్బేరు మండలం గుమ్మడం తండాకు చెందిన నాగమ్మ, రవీందర్‌ల కుమారుడు శశిధర్‌కు గురువారం రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న తనకు మెస్ ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి రూ.15 వేల ఆర్థిక సాయం అందించి విద్యార్థిని ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాయుడు, గంధం రాజశేఖర్, నరసింహనాయుడు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేవారికి ఊరట

విజయవాడ నవంబర్ 5,ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాలక కోసం దరఖాస్తు చేసుకునే తెలంగాణ నుంచి అభ్యర్థులకు మైగ్రేషన్ అవసరం లేదు. ఇకపై ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసేటప్పుడు మైగ్రేషన్ సర్టిఫికెట్ సమర్పించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. కాకపోతే సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో మాత్రం తాము నిర్ణీత గడువులోగా తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వలస వచ్చినట్లు ధ్రువీకరణ పత్రాలను కచ్చితంగా సమర్పించాలని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేవారికి ఊరట దక్కింది. తెలంగాణ నుంచి ఏపీకి వచ్చిన అభ్యర్థులకు మైగ్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి కాదని తెలిపింది. దరఖాస్తు సమయంలో మైగ్రేషన్ సర్టిఫికెట్ సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టత ఇచ్చింది. ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో మైగ్రేషన్ లేకపోయినా సరే దరఖాస్తులు స్వీకరించాలని సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డీఎస్సీ, ఏపీపీఎస్సీ, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు, మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, పాఠశాల విద్యా శాఖకు ఆదేశాలు పంపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లు 2024 జూన్ 1 నాటికి లేదా అంతకంటే ముందు తెలంగాణ నుంచి ఏపీకి వచ్చినవారికి ఈ నిబంధన వర్తిస్తుంది. తాము తెలంగాణ నుంచి ఏపీకి ఆ గడువులోగా వచ్చినట్లు ధ్రువీకరణ సమయంలో సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. స్థానికత సర్టిఫికెట్లు కొత్తగా ఏర్పడిన జిల్లాల ప్రకారం జారీచేసే అంశంపై మార్గదర్శకాలు రావాల్సి ఉంది. అలాంటప్పుడు కొత్త జిల్లాల ప్రకారం స్థానికతను ఎలా క్లెయిమ్ చేయాలనేది స్పష్టత రావాల్సి ఉంది. ఏపీ ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి రిక్రూట్‌మెంట్ బోర్డులు దరఖాస్తు సమయంలోనే మైగ్రేషన్ సర్టిఫికెట్ సమర్పించాలనే నిబంధనను అమలు చేస్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ నుంచి వచ్చినవారు దరఖాస్తు సమయంలోనే ఇబ్బందిపడుతున్నారు. అందుకే ఏపీ ప్రభుత్వం మైగ్రేషన్ విషయంలో వెసులుబాటు కల్పించింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వులతో ఉద్యోగాల కోసం దరఖాస్తు సమయంలో మైగ్రేషన్ సర్టిఫికెట్ సమర్పించాల్సిన అవసరం లేకుండా పోడంతో వేలాది మంది అభ్యర్థులకు ఊరట దక్కింది. ఏపీ ప్రభుత్వం ఎన్‌టీఏ నిర్వహించే నీట్, జేఈఈ మెయిన్, సీయూఈటీ, యూజీసీ నెట్ పరీక్షలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడానికి జిల్లా స్థాయి సమన్వయ కమిటీలను తిరిగి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది

ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను 100 శాతం సాధించాలి

అధికారులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కర్ నాయక్ ఆదేశం

వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబరు 5 (విజన్ ఆంధ్ర)జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులోగా వంద శాతం సాధించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కర్ నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, లక్ష్యాల సాధన, పెండింగ్ పనులు, భవిష్యత్తు కార్యాచరణపై సమీక్షించారు. గర్భిణుల నమోదు, వైద్య పరీక్షలు, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ, ప్రమాదకర గర్భిణుల గుర్తింపు, మాతా శిశు మరణాల వివరాల నమోదు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. నవజాత శిశువులు, తక్కువ బరువుతో జన్మించిన పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలని, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం కింద చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి లోపాలున్న వారికి అవసరమైన చికిత్సలు చేయించాలని ఆదేశించారు. 6 నుంచి 19 ఏళ్ల పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని, అర్హులైన




బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వంద శాతం అందించాలని పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణ, కుష్టు వ్యాధి నిర్మూలన, టీబీ ముక్త్ భారత్, తలసేమియా నియంత్రణ కార్యక్రమాలను లక్ష్యాలకు అనుగుణంగా అమలు చేయాలన్నారు. 30 ఏళ్లు పైబడిన వారందరికీ రక్తపోటు, మధుమేహం తదితర అసంక్రమిక వ్యాధుల పరీక్షలు నిర్వహించాలని, వ్యాధిగ్రస్తులకు సకాలంలో చికిత్స అందించడంతోపాటు ప్రతి నెలా ఫాలోఅప్ చేయాలని సూచించారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి కీటక జనిత వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, దోమల నియంత్రణకు యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించాలని తెలిపారు. టీబీ అనుమానితులకు ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వారికి వెంటనే చికిత్స ప్రారంభించాలని, అర్హులకు పోషకాహార కిట్లు, నిక్షయ్ పోషణ్ యోజన కింద ఆర్థిక సాయం అందేలా చూడాలన్నారు. మానసిక ఆరోగ్య సేవల కోసం టెలి మానస్ 14416 టోల్‌ఫ్రీ నంబరుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గురువారం వృద్ధుల ఆరోగ్య దినోత్సవం నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించాలని చెప్పారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన సేవలను అందుబాటులో ఉంచాలని, టీ డయాగ్నస్టిక్స్ ద్వారా ప్రజలకు వైద్య పరీక్షలు సమర్థవంతంగా అందించాలని తెలిపారు. కుక్కకాటు, పాముకాటు బాధితులకు అవసరమైన టీకాలు, చికిత్సలు సకాలంలో అందించాలన్నారు. అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్, అమ్మ ఒడి 102 సేవలు నిరంతరాయంగా అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి ప్రోగ్రాం అధికారి తమ పరిధిలోని కార్యక్రమాల పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరించాలని భాస్కర్ నాయక్ సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ మారుతి నందన్ గౌడ్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ రాకేష్ రెడ్డి, మంజుల, వివిధ ఆరోగ్య కార్యక్రమాల కోఆర్డినేటర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

15 రోజుల్లో గ్రాడ్యుయేట్ ఓటరు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి

జిల్లా రెవెన్యూ అధికారి రామిరెడ్డి ఆదేశం

వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబరు 5 (విజన్ ఆంధ్ర) గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కోసం అందిన ఫారం-18 దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి రామిరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఓటరు నమోదు ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. వనపర్తి జిల్లాలో ఇప్పటివరకు 26,500 ఫారం-18 దరఖాస్తులు అందగా, వాటిలో 5,500 దరఖాస్తులను ఆమోదించినట్లు రామిరెడ్డి తెలిపారు. మిగిలిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి త్వరితగతిన ఆమోదం తెలపాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా పరిశీలన పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అలాగే జిల్లాలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులు, యువతకు ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్



కళాశాలల్లో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించాలని తెలిపారు. నవంబరు 2 నుంచి 28వ తేదీలోగా ఈ పోటీలను పూర్తి చేయాలని నోడల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ యాదయ్య, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, డీపీఆర్ఓ సీతారాం, డీవైఎస్ఓ సుధీర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆగస్టు నాటికి ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ పూర్తి

రూ.80 కోట్లతో 12 కోర్టులకు నూతన భవనాలు..తుది దశకు చేరుకున్న నిర్మాణ పనులు

నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 5 (విజన్ ఆంధ్ర) జిల్లా కేంద్రంలో రూ.80 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్ పనులు తుది దశకు చేరుకున్నాయి. గురువారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నిర్మాణ పనులను పరిశీలించి, పురోగతిపై ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కాంప్లెక్స్‌లో మొత్తం 12 రకాల కోర్టులకు అవసరమైన భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మొదటి, రెండో అంతస్తుల స్లాబ్ పనులు పూర్తయ్యాయని, మరో అంతస్తు స్లాబ్ పనులు చివరి దశలో ఉన్నాయని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో కొన్ని కారణాల వల్ల స్వల్ప జాప్యం జరిగిందన్నారు. పనులను వేగవంతం చేసి వచ్చే ఏడాది ఆగస్టు నాటికి కాంప్లెక్స్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. కోర్టు కాంప్లెక్స్ అందుబాటులోకి



వస్తే న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలకు ఒకే ప్రాంగణంలో మెరుగైన న్యాయసేవలు అందుతాయని చెప్పారు. జిల్లా న్యాయవ్యవస్థకు ఆధునిక వసతులు కల్పించడంలో ఈ నిర్మాణం కీలకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ శాఖ ఎస్ఈ, ఈఈ, ఇతర అధికారులు, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి, ఎస్ఎల్ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యం

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 5 (విజన్ ఆంధ్ర)నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వనపర్తి పట్టణంలోని 7వ వార్డుకు చెందిన భాగ్యమ్మ, యాదయ్య దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 11వ వార్డుకు చెందిన చంద్ర రామకృష్ణ గృహప్రవేశానికి హాజరై దంపతులను అభినందించారు. వనపర్తి మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఆంజనేయులు, నిరంజన్‌ల గృహప్రవేశ కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణలో నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలకు హామీలిచ్చి మోసం చేశారే తప్ప, అర్హులైన నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి, ఎస్ఎల్ఎన్ రమేష్, వైస్ ఛైర్మన్ మధుసూదన్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, స్థానిక కౌన్సిలర్ కదిరె నాగమ్మ రాములు, ఇతర కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతారాంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో పేరెంట్ కమిటీ సమావేశం



కామారెడ్డి బ్యూరో నవంబర్ 5(విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం లోని సీతారాంపూర్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా గత నెలలో జరిగిన యస్ ఎం 1 పరీక్షల ప్రగతి పత్రాలను విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రధానోపాధ్యాయులు దత్తాద్రి అంద జేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో అభ్యసన స్థాయి నీ పెంచాలని ఉపాధ్యాయులే కాకుండా తల్లిదండ్రుల కృషి ఉండాలని, నవంబర్ నెలలో 100 శాతం హాజరు నమోదుకు అందరం కృషి చేయాలని తెలిపారు. ఈ సమమేశంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు శర్మ, జ్యోతి, రామరాజు పేరెంట్స్ యెల్లం,రామచంద్రం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు జిల్లావ్యాప్తంగా గంజాయి స్పెషల్ డ్రైవ్

తెల్లవారుజామున 5 గంటల నుండి 90 మంది అనుమానితుల ఇళ్లలో తనిఖీలు
యూరిన్ డ్రగ్ టెస్టుల ద్వారా 57 మంది గంజాయి సేవించినట్లు నిర్ధారణ
గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యం
మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై నిరంతర నిఘా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 5(విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు తెల్లవారుజామున 5 గంటల నుండి జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక గంజాయి తనిఖీ డ్రైవ్ నిర్వహించారు. ఆదిలాబాద్, ఉట్నూర్ పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో గంజాయి సేవిస్తున్నట్లు అనుమానం ఉన్న వ్యక్తులు, గతంలో మాదకద్రవ్యాల వినియోగం, సరఫరా కార్యకలాపాల్లో పాల్గొన్న వ్యక్తుల ఇళ్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా మొత్తం 90 మందిని తనిఖీ చేయగా, ప్రత్యేక డ్రగ్ టెస్టింగ్ కిట్లు, యూరిన్ టెస్టుల ద్వారా 57 మంది గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయింది.

జిల్లాలో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టడంతో పాటు మాదకద్రవ్యాల వినియోగదారులను గుర్తించే లక్ష్యంతో ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లాలో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక నిఘా, ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని ఎస్పీ తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే 8712659973 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. మాదకద్రవ్యాల రహిత జిల్లానే లక్ష్యం.. యువత భవిష్యత్తే మా బాధ్యత.

దీపావళి సందర్భంగా పేకాటపై ప్రత్యేక నిఘా

పేకాట ఆడినా, ఆడించినా కఠిన చర్యలు తప్పవు
పేకాట స్థావరాలపై ప్రత్యేక బృందాలతో నిఘా
పేకాట నిర్వహణ, ప్రోత్సాహం, సహకారం అందించిన వారిపై చట్టపరమైన చర్యలు
సమాచారం అందించండి.. వివరాలు గోప్యంగా ఉంచుతాం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 5 (విజన్ ఆంధ్ర)దీపావళి పండుగ సందర్భంగా జిల్లాలో ఎక్కడైనా పేకాట నిర్వహించినా, ఆడినా, ఆడించినా లేదా పేకాట స్థావరాలను ఏర్పాటు చేసి ఇతరులను ప్రోత్సహించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. పేకాట చట్టవిరుద్ధమైన కార్యకలాపమని, పేకాట నిర్వహణకు ఎలాంటి అవకాశం లేకుండా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి పటిష్టమైన నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు పేకాటపై ప్రత్యేక దృష్టి సారించి, ఎక్కడైనా పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే దాడులు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నా, ఆడిస్తున్నా లేదా పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నట్లు తెలిసినా వెంటనే జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న మెసేజ్ యువర్ ఎస్పీ వాట్సాప్ నంబర్ 8712659973 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ప్రజలందరూ పోలీసులకు సహకరించి పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ దీపావళి పండుగను ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. పేకాటకు దూరంగా ఉండండి ▪ పండుగను ప్రశాంతంగా జరుపుకోండి.

దండారి నృత్యాలు డోలీ చప్పులతో ఘన స్వాగతం

కొమురం భీం విగ్రహానికి ఘన నివాళులు
గతంలో చేసిన సేవలను కొనియాడిన
బాదిగూడ గ్రామస్తులు..
రాథోడ్ బాపురావుకు అండగా ఉంటామని వెల్లడి
గుస్సాడిలు గ్రామస్తుల తో కలిసి దండారి నృత్యలు చేసిన బోథ్ మాజీ ఏమ్మెల్యే



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 5 (విజన్ ఆంధ్ర)ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దండారి ఉత్సవాలు గిరిజన గ్రామాల్లో ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయిలి. ఈ నేపథ్యంలో లిఇచ్చోడ మండలం బాదిగూడ గ్రామంలోలి నిర్వహించిన లిదండారి ఉత్సవాల్లో తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా అధ్యక్షులు బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పాల్గొని సందడి చేశారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. లిగ్రామస్తులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొని ఆదివాసీ సంప్రదాయాల పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారులి. ఈ సందర్భంగా ముందుగా గిరిజనుల ఆరాధ్య దైవం, ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన వీరుడు కొమురం భీం విగ్రహానికి రాథోడ్ బాపురావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారులి. కొమురం భీం ఆశయాలు, పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. లిఆదివాసీల ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలలి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులు, స్థానిక నాయకులు, యువకులతో ఆయన ఆత్మీయంగా ముచ్చటించారు. లిగతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో రాథోడ్ బాపురావు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అందించిన సహకారాన్ని గ్రామస్తులు గుర్తుచేసుకున్నారులి. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఆపద సమయంలో అండగా నిలిచిన నాయకుడిగా ఆయనను అభివర్ణించారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలతో ఏర్పరచుకున్న అనుబంధాన్ని గ్రామస్తులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజలతో కలిసిమెలిసి ఉండే స్వభావం ఆయనకు ఉందని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ మద్దతును స్పష్టంగా ప్రకటించారు. లిగతంలో తమ గ్రామానికి, ప్రాంతానికి చేసిన సేవలను మరువలేమని, భవిష్యత్తులోనూ మాజీ ఏమ్మెల్యే రాథోడ్ బాపురావు వెంటే ఉంటామని వెల్లడించారు.లి ఆయనకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. గ్రామస్తుల అభిమానానికి మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కృతజ్ఞతలు తెలిపారు. దండారి ఉత్సవాలు కేవలం వేడుకలు మాత్రమే కాకుండా ఆదివాసీ సమాజ ఐక్యతకు, తరతరాలుగా వస్తున్న సంస్కృతి పరిరక్షణకు వేదికలుగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. సంప్రదాయ నృత్యాలు, ఆచార వ్యవహారాల ద్వారా గిరిజనుల జీవన విధానం, కళా వైభవం ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. లిబాదిగూడ గ్రామంలోలి జరిగిన ఈ కార్యక్రమం ఆదివాసీ సంప్రదాయాల పట్ల ఉన్న గౌరవంతో పాటు మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు గ్రామస్తులతో ఉన్న అనుబంధాన్ని మరోసారి చాటిచెప్పింది. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. స్థానికులు, యువత, గిరిజన పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో గ్రామ పటేన్లు, మండల్ కన్వీనర్ షేక్ ఖిలాల్ బాయ్, మైనార్టీ మండల చైర్మన్ షేక్ ఫారీద్, సిరికొండా మండల్ కన్వీనర్ సతీష్ జాదవ్, గులాబ్, జైనున్ హస్సేన్ ,అత్తహుళ్ల కలిమ్, గ్రామ పెద్దలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు 'ఉన్నతి విద్య' దోహదం

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం: కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 5)విజన్ ఆంధ్ర)విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారిలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు సర్వతోముఖాభివృద్ధికి 'ఉన్నతి విద్య' కార్యక్రమం దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని మసూద్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలక్‌మందిర్) పీఎం శ్రీ పాఠశాలలో 'ఉన్నతి విద్య' కార్యక్రమాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఉన్నతికి బాట.. విద్యతో ప్రయాణం అభ్యసనం, అభివృద్ధి, విజయం' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు పటిష్టమైన విద్యా పునాది కల్పిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.అనంతరం కలెక్టర్ పాఠశాల తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠ్యాంశాలపై వారి అవగాహనను పరీక్షించడంతో పాటు బోధనా విధానాలు, పాఠశాలలో అందుబాటులో ఉన్న వసతుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సందేహాలకు సమాధానాలిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం నింపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, సెక్టోరల్ అధికారులు లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్





కామారెడ్డి బ్యూరో నవంబర్ 5(విజన్ఆంధ్ర) కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డులో భారతి గారు ఎస్ఎస్సి ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సుమారు రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాలను ప్రారంభించి, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలలకు సహకారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. సుమారు రూ.22 లక్షలతో పాఠశాల భవనాన్ని నిర్మించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించిన భారతి కి, ఎస్ సి ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని చైర్‌పర్సన్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ కాసార్ల గోదావరి, కమిషనర్ పర్వతాలు ,కౌన్సిలర్స్ వినోద రాజు పాటిల్, మాధవి, టిపిఓ దేవరాజు, డీఈవో మల్లికార్జున్, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చివరి దశ పనులన్నీ పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి

పెండింగ్ పనుల్లో వేగం పెంచాలి.
-నాణ్యతలో రాజీ పడకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రియాంక.



నారాయణపేట ప్రతినిధి, నవంబర్ 5 (విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు వద్ద నిర్మిస్తున్న నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ప్రియాంక గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ భవన సముదాయంలోని వివిధ విభాగాలు, ఛాంబర్లు, సమావేశ మందిరాలు, ఇతర మౌలిక సదుపాయాల పనులను నిశితంగా తనిఖీ చేసి, నిర్మాణ పనుల ప్రస్తుత పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.నూతన కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్, వీడియో కాన్ఫరెన్స్ హాల్, సమావేశ మందిరం తదితర విభాగాల్లో కొనసాగుతున్న ఫర్నిచర్ ఏర్పాటు పనులను కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. ఆయా గదుల్లో ఏర్పాటు చేస్తున్న ఫర్నిచర్ నాణ్యత, అమరిక, ఇంటీరియర్ డిజైన్ పనులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఛాంబర్లు ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా ఉండేలా అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఫర్నిచర్ పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేస్తున్న సౌండ్ సిస్టమ్, ఫర్నిచర్ పనులను పరిశీలిస్తూ, సమావేశాలు,ఉన్నతాధికారులతో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లకు ఎలాంటి అంతరాయం కలగకుండా సౌండ్ సిస్టమ్ స్పష్టమైన శబ్ద నాణ్యతతో పనిచేసేలా చూడాలని సూచించారు. ఆధునిక సాంకేతిక సదుపాయాలు సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు.అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. కార్యాలయానికి వచ్చే అధికారులు, ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. పార్కింగ్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఎన్ఈ వెంకట రమణయ్యను ఆదేశించారు.కలెక్టరేట్ భవన సముదాయంలో మిగిలి ఉన్న చిన్నచిన్న పనులను సైతం నిర్లక్ష్యం చేయకుండా గుర్తించి పూర్తి చేయాలని, అన్ని విభాగాల్లో విద్యుత్, ఫర్నిచర్, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.పది రోజుల్లోగా చివరి దశ పనులన్నింటినీ పూర్తి చేసి నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభోత్సవానికి పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, నిర్దేశించిన గడువులోగా పనులన్నీ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె పేర్కొన్నారు.కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్డీఓ వెంకట్ రాములు, కలెక్టరేట్ ఏవో అనిల్ కుమార్, సీపీఓ ఖాషు వాహన్, ఆర్‌అండ్‌బీ డీఈఈ రాములు, తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పాఠశాల భరోసా కల్పిస్తుంది

కృష్ణా మండల విద్యాధికారి నిజాముద్దీన్

కృష్ణ నవంబర్ 5 (విజన్ ఆంధ్ర) తెలంగాణ విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కృష్ణ మండల పరిధిలోని ముడుమాలలో గురువారంవిద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమును ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కృష్ణమండల విద్యాధికారి నిజాముద్దీన్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు ముడుమాల పాఠశాల భరోసని స్తుందని తల్లిదండ్రులు ఇంకా పాఠశాల అభివృద్ధికి సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల పట్ల తీసుకుంటున్న చర్యలపట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాలల్లోని విద్యార్థు ల చేత వివిధ సబ్జెక్టులలో వారి నైపుణ్యాలను ప్రదర్శించారు. అదేవిధంగా క్రమం తప్పకుండా పాఠశాలకు100 శాతం హాజరవుతున్న విద్యార్థుల కు సర్టిఫికెట్లను అందజేయడమే కాకుండా వారి తల్లిదండ్రులను సన్మానించి సన్మానించారు.విద్యార్థులకు హోల్టిస్టిక్ కార్డులను అందజేశారు.పాఠశాలలో ఎల్ ని నో కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు అదేవిధంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మొక్కలను మామిడి కొబ్బరి గంధము వంటి మొక్కలను నాటడం జరిగింది

ఈ కార్యక్రమంలో ఏ ఏ పి సి చైర్మన్ నింగమ్మ పాఠశాల ఉపాధ్యాయ బృందం కుర్మయ్య,జనార్దన్ రెడ్డి,శ్రీనివాస్, రమేష్, తిమ్మప్ప విద్యార్థుల తల్లిదండ్రులు బంగారు తిమ్మప్ప, రాజు కృష్ణయ్య, మారెప్ప, లక్ష్మి శ్రీనివాసులు, శ్రీనివాసులు వెంకటమ్మ, నరసమ్మ, ప్రశాంత్ వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రిగ్గింగ్‌కు పాల్పడుతోందన్న వంశీ

విజయవాడ, నవంబర్ 5,రాష్ట్రంలోని అధికార కూటమి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పరిషత్ ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే ప్రభుత్వం అక్రమాలకు, రిగ్గింగ్‌కు పాల్పడుతోందని ఆరోపించారు. గన్నవరం జడ్పీ హైస్కూల్‌లో తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం వంశీ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు."ప్రభుత్వంపై ప్రజలు కోపంగా ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫలితాలు తేడాగా వస్తాయనే భయం చంద్రబాబుకు పట్టుకుంది. అందుకే నామినేషన్లు వేయనివ్వలేదు. వేసినవి రిజెక్ట్ చేశారు. బూత్ ఏజెంట్లను బయటకు పంపి రిగ్గింగ్ చేసుకుంటున్నారు" అని వంశీ ఆరోపించారు.

జీవీఎంసీ ఎన్నికల్లో ఆసక్తికరం రెబల్‌గా గెలిచిన టీమిండియా క్రికెటర్ నితీశ్ రెడ్డి పెదనాన్న

విశాఖపట్టణం, నవంబర్5,మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభంజనం సృష్టించింది. మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుంది. కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ముక్కా శ్రావణి ఏకంగా 2.44 లక్షల ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. మొత్తం 120 వార్డులకు గాను టీడీపీ 64, జనసేన 26, బీజేపీ 8 డివిజన్లలో గెలుపొందాయి. దీంతో కూటమి బలం 98కి చేరింది. వైసీపీ కేవలం 13 స్థానాలకే పరిమితమైంది. సీపీఎం ఒక స్థానంలో, స్వతంత్రులు 8 వార్డుల్లో విజయం సాధించారు. ఈ ఎన్నికల ఫలితాల్లో ఓ ఆసక్తికరమైన అంశం చోటుచేసుకుంది. టీమిండియా యువ క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి పెదనాన్న కాకి గోవిందరెడ్డి, రెబల్ అభ్యర్థిగా పోటీ చేసి కార్పొరేటర్‌గా గెలుపొందారు. గాజువాక నియోజకవర్గం పరిధిలోని 86వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన, 200 ఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. నితీశ్ కుమార్ రెడ్డి తండ్రి ముత్యాల రెడ్డి, కాకి గోవిందరెడ్డి అన్నదమ్ములు.సుమారు 35 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న కాకి గోవిందరెడ్డి, టీడీపీలో సీనియర్ నేతగా గుర్తింపు పొందారు. గతంలో పార్టీలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా, అధికార ప్రతినిధిగా, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా పలు కీలక పదవులు నిర్వహించారు. ఈసారి ఎన్నికల్లో 86వ వార్డు నుంచి టీడీపీ టికెట్ ఆశించగా, ఆయనకు నిరాశే ఎదురైంది. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన ఆయన, పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అభిమానుల ఒత్తిడి మేరకు తన భార్య శ్రీదేవిని 85వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దింపారు. అయితే, ఆమె ఓటమి చెందగా, గోవిందరెడ్డి మాత్రం గెలిచి తన పట్టు నిరూపించుకున్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే జారీ చేయాలి

నారాయణపేట ప్రతినిధి, నవంబర్ 5 (విజన్ ఆంధ్ర) తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయుటకు డీఎస్సీ, గురుకుల నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు హెచ్. నర్సింహా, తిరుపతి, శివ కుమార్,వెంకటేష్, ప్రభాకర్ తదితరులు గురువారం ఒక ప్రకటనలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితి 34 సంవత్సరాల నుండి 44 సంవత్సరాల వరకు పెంచిన జీవో వచ్చి 6 నెలలు పూర్తి అయిన ఉపాధ్యాయ ఖాళీలకు సంబంధించిన నోటిఫికేషన్ గురించి ఎలాంటి ప్రకటన చేయకపోవడం వలన వయోపరిమితి అయిపోతున్న అభ్యర్థుల్లో ఆందోళన ప్రారంభమైందని తెలిపారు. వయోపరిమితి పెంచిన జీవో గడువు ఆరు నెలలలో ముగుస్తుందని అన్నారు.ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి గా బాధ్యతలు చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగ అభ్యర్థుల బాధకు అర్థం చేసుకొని వెంటనే ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయుటకు నోటిఫికేషన్ జారీ చేయాలని వారు కోరారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్05 (విజన్ ఆంధ్ర)మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోనిరోటరీ క్లబ్ ఆఫ్ మహబూబాబాద్ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. డిస్ట్రిక్ట్ లీడర్ రొటేరియన్ వద్దుల సురేందర్ రెడ్డి ఆర్థిక సహకారంతో ఈ సేవా కార్యక్రమం జరిగింది. అధ్యక్షులు దూదికట్ల సత్యం ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో సెక్రెటరీ శంతన్ రామరాజు, ట్రెజరర్ ముల్లంగి మోహన్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈసందర్భంగా అధ్యక్షులు దూదికట్ల సత్యం మాట్లాడుతూ సమాజానికి రోటరిక్లబ్ చేస్తున్న సేవల్లో భాగంగా ఈ సేవాకార్యక్రమం నిర్వహించామని అన్నాడు. పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రాంతంతో పాటు పుర వీధుల్లో తలదాచుకున్న నిరుపేదలు, యాచకులను గుర్తించి దుప్పట్లు అందజేశామన్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులకు ఆర్నబ్, మురసు తుఫాన్లతో చలి తీవ్రత పెరిగిందన్నారు. మానవతాదృక్పథంతో మహబూబాబాద్ రోటరిక్లబ్ ఈకార్యక్రమాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. గతం, వర్తమానంతో పాటు భవిష్యత్తులో సైతం రోటరిక్లబ్ సమాజ శ్రేయస్సే భాగంగా మరెన్నో ప్రజాహిత సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తూనే ఉంటుందని అన్నాడు.ఇంకా ఈ కార్యక్రమంలో పాస్ట్ ప్రెసిడెంట్లు వేమిశెట్టి కిషోర్ కుమార్, బొల్లం శ్రీనివాస్, బోనగిరి గిరిదర్ గుప్తా, సీనియర్ రొటేరియన్లు సాదు మహిపాల్ రెడ్డి, వల్లాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాల నివారణకు హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా గుర్తించి, తగిన వైద్య సేవలు అందించాలి

ప్రతి గర్భిణీని 12 వారాల్లోపు నమోదు చేయాలి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుధీర





కామారెడ్డి బ్యూరో నవంబర్ 5(విజన్ఆంధ్ర)జిల్లాలో మాతృ మరణాలను పూర్తిస్థాయిలో నివారించేందుకు హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి, వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ (ఎంసీహెచ్) డాక్టర్ సుధీర సూచించారు.గురువారం కామారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, నమోదు, సురక్షిత ప్రసవాలపై అవగాహన కల్పిస్తూ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బంది, ఎంపీహెచ్ఏ (మహిళా) సిబ్బందికి ఈ శిక్షణ అందించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుధీర ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ సుధీర మాట్లాడుతూ వైద్యాధికారుల నుంచి పర్యవేక్షక సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గర్భిణీని గర్భధారణ జరిగిన 12 వారాల్లోపు 100 శాతం నమోదు చేయాలని, ప్రతి గర్భిణీకి ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించడంతో పాటు కనీసం తొమ్మిది వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.రక్తహీనత, గతంలో పలుమార్లు గర్భం దాల్చడం, గుండె సంబంధిత వ్యాధులు, అధిక రక్తపోటు, సికిల్ సెల్ రక్తహీనత తదితర సమస్యలు ఉన్న గర్భిణులను హైరిస్క్ గర్భిణులుగా గుర్తించి, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రసవానికి ముందుగానే తగిన ప్రణాళిక రూపొందించి, అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి మాట్లాడుతూ జిల్లాలో ఒక్క మాతృ మరణం కూడా సంభవించకుండా వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బంది, ఎంపీహెచ్ఏ (మహిళా) సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. హైరిస్క్ గర్భిణులను నిరంతరం పర్యవేక్షిస్తూ, సురక్షిత ప్రసవాలు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మాతృ మరణాలు లేని జిల్లాగా కామారెడ్డిని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ శిక్షణ కార్యక్రమంలో శిశు వైద్య నిపుణులు డాక్టర్ శిరీష, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ సురేఖ, ఆర్మన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు డాక్టర్ సంతోషి, డాక్టర్ శర్వాణి పాల్గొని పలు వైద్యపరమైన అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బంది, ఎంపీహెచ్ఏ (మహిళా) సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ రైల్వే సమస్యలు పరిష్కరించాలని వినతి



కృష్ణ ,నవంబర్ 5 (విజన్ ఆంధ్ర) కృష్ణ మండల కేంద్రంలో గత కొంతకాలంగా కృష్ణా రైల్వే స్టేషన్లో సమస్యలతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని డిప్యూటీ జనరల్ మేనేజర్ సౌత్ సెంట్రల్ రైల్వే మేనేజర్ కిరణ్ కుమార్ కు గురువారం తన కార్యాలయంలో కలుసుకొని అమర్ కుమార్ దీక్షిత్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అమర్ కుమార్ దీక్షిత్ మాట్లాడుతూ కృష్ణ రైల్వే స్టేషన్ లో మంచినీటి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు నీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అంతేకాకుండా కృష్ణా స్టేషన్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా కృష్ణా రైల్వే స్టేషన్ లో ప్రయాణికులు టికెట్ తీసుకునే సమయం లో కూడా ట్రైన్లు నిలిచే విధంగా చూడాలని ఆయన తెలిపారు.

కొఠియా గ్రామాల్లో ఓటర్లను అడ్డుకుంటున్న ఒడిశా పోలీసులు

శ్రీకాకుళం, నవంబర్ 5,ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొఠియా గ్రామాల్లో మరోసారి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఎన్నికల వేళ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళుతున్న గిరిజనులను ఒడిశా పోలీసులు అడ్డుకుంటూ, వేధింపులకు గురిచేయడం కలకలం రేపింది. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కొఠియా గ్రామాల్లో పర్యటించి, అక్కడి పరిస్థితిని సమీక్షించారు. ఒడిశా అధికారుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

భూ రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి



రంగారెడ్డి జిల్లా బ్యూరో నవంబర్ 5, (విజన్ ఆంధ్ర): భూ భారతి కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం మనోరాబాద్ గ్రామంలో గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి అధ్యక్షతన భూ రీసర్వే గ్రామసభ మరియు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డులను ఆధునికీకరించడం, భూముల కొలతల్లో ఖచ్చితత్వాన్ని పెంపొందించడం, భూ సరిహద్దు వివాదాలను పరిష్కరించడం, భూ యజమానుల హక్కులను స్పష్టంగా నిర్ధారించడం భూ రీసర్వే ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఆధునిక డిజిపిఎస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భూములను అత్యంత ఖచ్చితత్వంతో సర్వే చేసి, డిజిటల్ భూ రికార్డులను రూపొందించడం జరుగుతుందని వివరించారు. రీసర్వే ద్వారా భూముల సరిహద్దులను స్పష్టంగా గుర్తించడం వల్ల రైతుల మధ్య భూ వివాదాలు తగ్గుతాయని, భూముల విస్తీర్ణాన్ని కచ్చితంగా నిర్ధారించడంతో పాటు పాత భూ రికార్డులను డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావచ్చని పేర్కొన్నారు.అలాగే భూ యాజమాన్య హక్కుల స్పష్టత, ప్రభుత్వ మరియు ప్రైవేటు భూముల ఆక్రమణల గుర్తింపు, భూముల సబ్‌డివిజన్ వివరాల నమోదు వంటి ప్రయోనాలు కలుగుతాయని తెలిపారు. ఖచ్చితమైన భూ రికార్డులు అందుబాటులో ఉండటం వల్ల రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంతో పాటు బ్యాంకు రుణాలు పొందేందుకు సైతం సౌలభ్యం కలుగుతుందని వివరించారు. రీసర్వే పూర్తయిన అనంతరం నిబంధనల ప్రకారం కొత్త భూ రికార్డులు, పట్టా వివరాలను డిజిటల్ విధానంలో పొందుపరచడం జరుగుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా అధికారులు మనోరాబాద్ గ్రామ భూ వివరాలను గ్రామసభలో వెల్లడించారు. గ్రామ మొత్తం భౌగోళిక విస్తీర్ణం 288 ఎకరాల 07 గుంటలు కాగా, మొత్తం 48 సర్వే నంబర్లు ఉన్నాయి. ఇందులో పట్టా భూమి 267 ఎకరాల 16 గుంటలు, ప్రభుత్వ భూమి 18 ఎకరాల 35 గుంటలుగా వివరించారు. ప్రభుత్వ భూముల్లో ఎండోమెంట్ భూమి 3 ఎకరాలు, ప్రభుత్వ భూమి 10 ఎకరాల 05 గుంటలు, లావణ్య పట్టా భూమి 5 ఎకరాల 30 గుంటలుగా గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా రీసర్వే చేయవలసిన సబ్‌డివిజన్ నంబర్లు 388 ఉన్నట్లు వెల్లడించారు.భూ రీసర్వే ప్రక్రియలో రైతులందరూ చురుకుగా భాగస్వాములై అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. రైతులు తమ భూములకు సంబంధించిన పాత రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్‌లు, ఇతర సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, సర్వే సమయంలో తమ భూముల సరిహద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించుకోవాలని కోరారు. పారదర్శకమైన, ఖచ్చితమైన డిజిటల్ భూ రికార్డుల వ్యవస్థ ఏర్పాటుకు భూ రీసర్వే ఎంతో దోహదపడుతుందని, దీనివల్ల భూ యజమానులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎడి ఎస్ఎల్ఆర్ యం. రామ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్ డి ఓ శ్రీనివాస్ రెడ్డి, మంచాల్ తహసిల్దార్ వి.ప్రసాద్ రావు, ఇబ్రహీంపట్నం డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే డి.శ్రీనివాస్, మండల సర్వేయర్ ఎస్. వి. ధనశ్రీ, మంచాల్ మండల లైసెన్స్ సర్వేయర్లు, గ్రామ పాలన అధికారి ఎన్. జంగయ్య, సర్పంచ్ ఎ. సంజీవ రెడ్డి, మంచాల్ మండల సిబ్బంది మరియు గ్రామ రైతులు హాజరయ్యారు.

మయూరధ్వజుని దానశీలత గుర్తుగా ధ్వజస్థంభం

గర్భాలయానికి ఎదురుగా వెలుపల ఉండే పవిత్ర స్థంభమే ధ్వజస్థంభం
గర్భగుడిలో ఉన్న మూలవిరాట్ విగ్రహంతో సమానంగా ధ్వజస్థంభాన్ని చూస్తారు
మయూరధ్వజుని దానగుణం ఎలా ధ్వజ స్థంభంగా మారింది ?
కొటాలగూడ గ్రామంలో బీరప్ప జాతర మహోత్సవం సందర్భంగా ధ్వజస్థంభం ప్రతిష్ఠాపన
బీరప్ప జాతర కమిటీ అధ్యక్షుడు ఎల్లన్నోళ్ళ మల్లేశం, కమిటీ ఆధ్వర్యంలో నిర్వహణ



వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 05 (విజన్ ఆంధ్ర) : దైవదర్శనం కోసం ఏ దేవాలయానికి వెళ్లినా ముందుగా ధ్వజస్థంభానికి మొక్కి ప్రదక్షిణ చేసిన తరువాతే లోపలికి వెళతాం. గురువారం వికారాబాద్ మండల పరిధిలోగల కొటాలగూడ గ్రామంలో బీరప్ప స్వామి విగ్రహం ప్రతిష్టాపన, అక్క మహంకాళి, చెల్లెలు చంద్రావతి, 9 హోమ గుండాల యజ్ఞంతో ధ్వజస్తంభం ప్రతిష్టాపన, బీరప్ప స్వామి కామరాతి ఆదిదంపతుల కళ్యాణం జరిగింది. ధ్వజస్తంభం ప్రాముఖ్యత గురించి తెలుసుకుందాం. ధర్మరాజు ధర్మమూర్తిగా, గొప్ప దాతగా పేరు పొందాలనే కోరికతో వివిధగా దానధర్మాలు చేయడం మొదలుపెడతాడు. ఈ క్రమంలో తాను చాలా గొప్ప ధర్మమూర్తినని ధర్మరాజు భావించ సాగాడు. ఇదంతా చూస్తున్న శ్రీకృష్ణుడు అతనికి తగిన రీతిగా గుణపాఠం చెప్పాలనుకుంటాడు. వెంటనే ధర్మరాజుతో అశ్వమేధ యాగం చేసి, శత్రు రాజులను జయించి దేవతలను, బ్రాహ్మణులను సంతుష్టి పరచి రాజ్యాన్ని సుస్థిరం, సుభిక్షం చేయమని చెబుతాడు.ధర్మరాజు శ్రీకృష్ణుని మాట శిరసావహించి అశ్వమేధానికి సన్నాహాలు చేయించి యాగాశ్వానికి రక్షకులుగా నకుల సహదేవులను సైన్యంతో పంపుతాడు. ఆ యాగాశ్వం అన్ని రాజ్యాలు తిరిగి చివరికి మణిపుర రాజ్యం చేరుతుంది. ఆ రాజ్యానికి రాజు మయూర ధ్వజుడు. ఆయన మహా పరాక్రమవంతుడు, గొప్ప దాతగా పేరుగాంచాడు. మయూరధ్వజుని కుమారుడు తామ్ర ధ్వజుడు, పాండవుల యాగాశ్వాన్ని బంధిస్తాడు.తామ్రధ్వజునితో యుద్ధం చేసిన నకుల సహదేవులు, భీమార్జునులు ఓడిపోతారు. తమ్ములందరూ ఓడిపోయిన విషయం తెలుసుకున్న ధర్మరాజు స్వయంగా యుద్ధానికి బయలుదేరగా శ్రీకృష్ణుడు అతన్ని వారించి మయూరధ్వజుడ్ని యుద్ధంలో జయించడం సాధ్యం కాదని మహా బలపరాక్రమ వంతులైన భీమార్జునులు ఓడిపోయారని అతడ్ని కపటోపాయంతో మాత్రమే జయించాలని చెబుతాడు. శ్రీకృష్ణుడు ధర్మరాజు ఇద్దరు కలిసి వృద్ధ బ్రాహ్మణుల రూపంలో మణిపురం చేరుతారు. ఆ బ్రాహ్మణులను చూసిన మయూరధ్వజుడు వారికి ఏదైనా దానం ఇవ్వదలచి ఏమి కావాలో కోరుకొమ్మని అడుగుతాడు. దానికి శ్రీకృష్ణుడు 'రాజా! మీ దర్శనార్థమై మేము వస్తున్న దారిలో ఒక సింహం అడ్డు వచ్చి ఇతని కుమారుడ్ని పట్టుకుంది. బాలుని విడిచి పెట్టవలసిందిగా మేము ప్రార్థించగా సింహం మానవ భాషలో మీ కుమారుడు మీకు కావాలంటే మణిపుర రాజైనా మయూరధ్వజుని శరీరంలోని సగభాగం నాకు ఆహారంగా ఇవ్వాలి. కానీ ఆ అర్ధ శరీరాన్ని అతడి భార్య పుత్రులు స్వయంగా కోసి ఇవ్వాలి. అప్పుడు మీరు ఆ అర్ధ శరీరాన్ని తెచ్చి ఇస్తే ఇతడ్ని వదిలేస్తానని చెప్పిందని మయూర ధ్వజునికి నమ్మకం కలిగించేలా వివరిస్తారు. కాబట్టి ఓ రాజా! దాన ప్రభువులైన మీరు మా యందు దయ తలచి మీ శరీరంలోని సగభాగాన్ని దానమిచ్చి ఇతడి కుమారుని కాపాడమని కోరుతాడు. బ్రాహ్మణుల వేషంలో ఉన్న శ్రీకృష్ణ ధర్మరాజుల కోరిక విన్న మయూరధ్వజుడు అందుకు అంగీకరించి దానికి తగిన ఏర్పాట్లు చేయిస్తాడు. తన భార్యాసుతులతో అతని శరీరాన్ని మధ్యకు కోసి వారికి ఇవ్వమని చెబుతాడు. వారు ఆయన శరీరాన్ని సగంగా కోయటం చూసిన ధర్మరాజు అతని దాన గుణానికి నివ్వెరపోయాడు. ఇంతలో మయూరధ్వజుని ఎడమకన్ను నుంచి నీరు కారడం చూసిన ధర్మరాజు 'తమరు కన్నీరు కారుస్తూ ఇచ్చిన దానం మాకు వద్దు గాక వద్దు' అంటాడు. అందుకు మయూర ధ్వజుడు "మహాత్మా! తమరు పొరపాటుగా అర్థం చేసుకున్నారు. నేను బాధతో నా శరీరాన్ని మీకివ్వటం లేదు. నా శరీరంలోని కుడి భాగం పరోపకారానికి ఉపయోగపడింది. కానీ ఆ భాగ్యం తనకు కలగటం లేదు కదా అని ఎడమ కన్ను చాలా బాధపడుతూ కన్నీరు కారుస్తున్నది అని వివరిస్తాడు. మయూరధ్వజుని దానశీలతకు మెచ్చిన శ్రీకృష్ణుడు తన నిజరూపాన్ని చూపి "మయూరధ్వజా నీ దానగుణం అమోఘం. ఏదైనా వరం కోరుకో అనుగ్రహిస్తాను" అంటాడు. అప్పుడు మయూరధ్వజుడు "పరమాత్మా! నా శరీరం నశించినా నా ఆత్మ పరోపకారార్థం ఉపయోగపడేలా నిత్యం మీ ముందు ఉండేలా అనుగ్రహించండి" అని కోరుతాడు. 'ఓ మయూరధ్వజా! నేటి నుంచి ప్రతి దేవాలయం ముందు నీ గుర్తుగా నీ పేరున ధ్వజస్తంభాలు వెలుస్తాయి. వాటిని ఆశ్రయించిన నీ ఆత్మ నిత్యం దైవ సాన్నిధ్యంలో ఉంటుంది. దైవదర్శనం కోసం ఆలయానికి వచ్చిన భక్తులు ముందు నిన్ను దర్శించి ప్రదక్షిణ, నమస్కారాలు ఆచరించిన మీదటనే ప్రజలు తమ ఇష్టదైవాలను దర్శించుకుంటారని శ్రీకృష్ణుడు వరమిస్తాడు. ప్రతినిత్యం నీ ఆత్మ ఆశ్రయించి ఉన్న ధ్వజస్తంభం ముందు ఎవరు దీపం ఎవరు ఉంచుతారో వారి జన్మ సఫలం అవుతుంది. నీ శిరసున ఉంచిన దీపం రాత్రులందు బాటసారులకు దారి చూపే దీపం అవుతుంది" అంటూ అనుగ్రహించాడు. ఆనాటి నుంచి ఆలయాల ముందు ధ్వజస్తంభాలు తప్పనిసరిగా ప్రతిష్ఠించడం ఆచారమైంది. బీరప్ప జాతర కమిటీ అధ్యక్షుడు ఎల్లన్నోళ్ళ మల్లేశం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ సర్పంచ్ కరంతోట్ రాఘవన్ నాయక్ తో పాటు పలుగుట్ట మల్లేశం పీరంపల్లి జగదీష్ సత్యనారాయణ పులుమద్ది సత్యనారాయణ పులుమద్ది శ్రీశైలం పులుమద్ది పరమేష్ చించల్పేట్ కుమార్ పోలీస్ సందీప్ రెడ్డి చించల్పేట్ శ్రీనివాస్ ఎల్లన్నోల శ్రీశైలం గట్టుపల్లి మహేష్ గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ జోగులాంబ ఆలయాల అభివృద్ధి కి మహత్తర ప్రణాళిక

పునరుజ్జీవన ప్రాజెక్టు రూ.57.50 కోట్లు ఆమోదం
అలంపూర్‌ను అంతర్జాతీయ స్థాయి వారసత్వ,ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



అలంపూర్ నవంబర్ 5 (విజన్ ఆంధ్ర బ్యూరో)అలంపూర్ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రూపొందించిన రూ.57.50 కోట్ల అలంపూర్ వారసత్వ, పర్యాటక, పట్టణ పునరుజ్జీవన ప్రాజెక్టుకు ఆమోదం లభించడం జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వ నేషనల్ అపెక్స్ కమిటీ ఆమోదం పొందిన తెలంగాణ రాష్ట్రంలోని ఐదు ప్రధాన నగర అభివృద్ధి ప్రాజెక్టుల్లో అలంపూర్ ఇంటిగ్రేటెడ్ హెరిటేజ్,టూరిజం అండ్ అర్బన్ రీజనరేషన్ ప్రాజెక్టుకు స్థానం లభించడం జోగులాంబ గద్వాల జిల్లాకు గర్వకారణమని తెలిపారు.మొత్తం రూ.57.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం 25 శాతం వాటాగా రూ.14.38 కోట్లు,రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటాగా రూ.14.38 కోట్లు, మిగిలిన 50 శాతం వాటాగా రూ.28.75 కోట్లను మార్కెట్ ఫైనాన్స్ వరల్డ్ బ్యాంక్ ద్వారా సమకూర్చనున్నట్లు వెల్లడించారు. అలంపూర్ వారసత్వ సంపద పరిరక్షణ, ఆలయాల అభివృద్ధి, భక్తులు, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యంగా ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ప్రతిపాదన రూపకల్పన నుంచి ఉన్నతస్థాయిలో సమర్పణ వరకు జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక కృషి చేసినట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ,నిరంతర పర్యవేక్షణతో పాటు మున్సిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారుల సమన్వయ కృషి వల్ల అలంపూర్ ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో ఆమోదం లభించిందని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు,సంబంధిత శాఖల సిబ్బందిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.అలంపూర్ లోని ప్రధాన రహదారులు,అంతర్గత రహదారుల అభివృద్ధి,స్పాంజ్ పార్క్,పుష్కర ఘాట్ పునరుద్ధరణ, ఆధునిక పార్కింగ్ సదుపాయాల కల్పన,పాదచారుల కోసం ప్రత్యేక పెడెస్ట్రియన్ కారిడార్ల నిర్మాణం, ల్యాండ్‌స్కేపింగ్ ద్వారా పట్టణ సుందరీకరణ,ఆధునిక వీధి దీపాల ఏర్పాటు వంటి తదితర పనులను చేపడతామని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా అలంపూర్ చారిత్రక వైభవం మరింత ఇనుమడించడంతో పాటు,భక్తులు, పర్యాటకులకు మరింత సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి,ప్రముఖ పర్యాటక ఆకర్షణగా నిలవనుందని పేర్కొన్నారు

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, లక్ష్యసాధనకు వ్యక్తిత్వ వికాస శిక్షణ దోహదం -జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 5 (విజన్ ఆంధ్ర)విద్యార్థులు చిన్నతనం నుంచే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో చదువుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. పట్టుదల, సానుకూల దృక్పథం అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు.గురువారం మావల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో 'ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు, చేస్తున్న త్యాగాలను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని, వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. మనసులోని భయాలను వీడి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే ఏ రంగంలోనైనా విజయాలు సాధించవచ్చని తెలిపారు.జీవితంలో లక్ష్య నిర్దేశం, మానవతా విలువలు, వేదికపై మాట్లాడే భయాన్ని అధిగమించడం, సానుకూల ఆలోచనా విధానం, జ్ఞాపకశక్తిని పెంపొందించే మెమరీ టెక్నిక్స్ తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఇలాంటి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని తమలోని ప్రతిభను వెలికితీసుకోవాలని సూచించారు.అనంతరం ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థినుల ఆరోగ్య వివరాలతో రూపొందించిన హెల్త్ ప్రొఫైల్ పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సాధన, కేజీబీవీ ప్రత్యేకాధికారి సువర్ణ, సెక్టోరల్ అధికారి సరిత, ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్ డైరెక్టర్లు రంజిత్, రాము, సుధాకర్, వైద్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

ర్‌ఆర్ ట్యాక్స్' నిజమే అయితే చర్యలేవి? మోదీ, షాలకు కేటీఆర్ ప్రశ్న

హైదరాబాద్, నవంబర్ 5,తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేతలు ఆరోపణలు చేస్తున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమి లేదని ఎద్దేవా చేశారు.తన ఎక్స్ పోస్టులో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోదీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు.

చదువుతోపాటు కళా రంగాల్లోనూ రాణించడం ప్రశంసనీయం

ఢిల్లీలో ప్రదర్శనలిచ్చిన బాల భవన్ విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల నవంబర్ 5(విజన్ ఆంధ్ర బ్యూరో)విద్యార్థులు చదువుతోపాటు సంగీత, నృత్య, చిత్రలేఖన తదితర కళా రంగాల్లోనూ రాణించడం ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గద్వాల బాల భవన్ విద్యార్థులు అనన్య, సుస్వర ప్రియ, సాహితీప్రియ, పూజ్యశ్రీత అక్టోబర్ 30వ తేదీ నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మూడు రోజులపాటు నేషనల్ బాల భవన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన జాతీయ బాలల సదస్సు, ఏకీకరణ శిబిరంలో పాల్గొని తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, ఎస్కార్ట్ గా వెళ్ళిన వాయిద్య శిక్షకులు బోడ శంకర్ ను గురువారం ఐడిఓసిలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీలో విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనల గురించి, అక్కడ ఇతర రాష్ట్రాల విద్యార్థులతో వారి అనుభవాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, మన దేశంలో విభిన్న భాషలు మాట్లాడే, సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన ప్రజలు జీవిస్తున్నప్పటికీ మనమంతా భారతీయులమే కాబట్టి కలిసి మెలిసి జీవిస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఏకీకరణ శిబిరం ముఖ్య ఉద్దేశం కూడా భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబించడమేనని పేర్కొన్నారు. అక్కడికి వివిధ రాష్ట్రాల నుంచి భిన్న కళా రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులు రావడంతో అందరిలో స్నేహ సంబంధాలు పెంపొందించబడతాయని అన్నారు.మన భారతీయ సనాతన, సంప్రదాయ నృత్యాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని, ఎంతో మంది విదేశీయులు సైతం భరతనాట్యం, కూచిపూడి, కథాకళి, ఒడిస్సి వంటి నృత్య రీతుల్లో శిక్షణ పొందుతుండటమే ఇందుకు నిదర్శనమని కలెక్టర్ పేర్కొన్నారు. వివిధ కళల్లో రాణించడం వలన క్రమశిక్షణ అలవడుతుందని, ఆదర్శనీయమైన జీవన విధానానికి కళలు మార్గదర్శనం చూపుతాయనడంలో అతిశయోక్తి లేదన్నారు. కళాకారులు తమ ప్రదర్శనలతో మానసిక ఆనందాన్ని పొందుతారని, ప్రేక్షకులు సైతం సంతోషించడానికి విభిన్న కళలు దోహదపడతాయన్నారు. ఎంతోమంది కళాకారులు అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చాటి అవార్డులు, రివార్డులు పొందడం జరిగిందన్నారు. ఆయా కళలను చాలా మంది వృత్తిగా చేపట్టి ఔత్సాహిక విద్యార్థులకు శిక్షణను కూడా ఇస్తుండడం గర్వకారణమన్నారు. 40 ఏళ్ల కిందట గద్వాలలో ఏర్పాటు చేసిన బాల భవన్ వేలాది మంది కళాకారులను తీర్చిదిద్దిన ఘనతను పొందిందన్నారు. విద్యార్థులు భవిష్యత్తులోనూ బాలభవన్ ను సద్వినియోగం చేసుకుంటూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రదర్శనలతో జోగులాంబ గద్వాల జిల్లాకు పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

కేవలం 3 గంటల్లో తప్పిపోయిన బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించిన ఇచ్చోడ పోలీసులు


ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి దిగిన రెండు ప్రత్యేక పోలీసు బృందాలు
ఇచ్చోడ నిర్మల్ బైపాస్ వద్ద బాలికను గుర్తించి రక్షించిన పోలీసులు
పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 5 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న ఓ బాలిక పలు కారణాలతో గురువారం ఉదయం 7 గంటల సమయంలో పాఠశాల నుంచి బయటకు వెళ్లిపోయింది. పాఠశాల సిబ్బంది బాలిక కోసం పాఠశాల పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో ఉదయం 9:30 గంటలకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.వెంటనే స్పందించిన ఇచ్చోడ ఎస్‌హెచ్‌ఓ వి. ప్రవీణ్ కుమార్ రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు వేగంగా తనిఖీలు నిర్వహిస్తూ ఇచ్చోడ " నిర్మల్ బైపాస్ వద్ద ఉన్న ఓ గ్యారేజ్ సమీపంలో తన బంధువుల ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బాలికను మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో గుర్తించి సురక్షితంగా రక్షించారు. విచారణలో బాలికకు చదువు మీద ఆసక్తి తక్కువగా ఉన్నట్లు అనిపించింది అని తెలిపారు.అనంతరం బాలికను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలికను కేవలం మూడు గంటల్లోనే సురక్షితంగా గుర్తించి అప్పగించిన పోలీసులకు ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా బాలికను సురక్షితంగా రక్షించడంలో చురుకుగా వ్యవహరించిన ఇచ్చోడ ఎస్‌హెచ్‌ఓ వి. ప్రవీణ్ కుమార్, ఎస్సై చిన్న గంగన్న, పోలీస్ సిబ్బంది సంజీవ్, గణేష్ తదితరులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు.పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు గమనించినప్పుడు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

రైతుల సంక్షేమమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యం

పుటాన్ దొడ్డి పీఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఏఐసిసి. కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్




ఎర్రవల్లి నవంబర్ 5(విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని పుటాన్ దొడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా బోయ మధు నాయుడు, వైస్ చైర్మన్‌గా శ్యాంసుందర్ రావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలంపూర్ మాజీ శాసనసభ్యులు, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ హాజరయ్యారు. ఈ నందర్భంగా డాక్టర్. ఎస్. ఏ.సంపత్ కుమార్ మాట్లాడుతూ,సహకార సంఘాలు రైతులకు మరింత చేరువగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ సహకారంతో వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడాలని నూతన చైర్మన్ బోయ మధు నాయుడు, వైస్ చైర్మన్ శ్యాంసుందర్ రావులకు సూచించారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల సంక్షేమం, అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీను, ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

య్యప్ప సొసైటీ భూమి పై లీ సర్వే చేయాలి

హైదరాబాద్, నవంబర్ 5,హైదరాబాద్‌లోని ఖానామెట్ అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తున్నామని, లేదంటే తమ పార్టీ కార్యకర్తలే అక్రమ కట్టడాలకు 'రెడ్ మార్క్' వేస్తారని హెచ్చరించారు. హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలో సుమారు 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులే దగ్గరుండి పర్మిషన్లు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప సీఎం రేవంత్‌కు మరేమీ కనిపించడం లేదని ఆమె విమర్శించారు.

18 లక్షల విలువచేసే 100 మొబైల్ ఫోన్లు బాధితులకు తిరిగి అందజేత

జిల్లాలో బాధితులు పోగొట్టుకున్న, చోరికి గురైన మొబైల్ ఫోన్లు
మొబైల్ ఫోన్ పోయిందా.. సీఈఐఆర్ లో ఫిర్యాదు చేయాలి
ప్రత్యేక బృందంతో పోయిన సెల్ఫోన్ లు తిరిగి రాబట్టే ప్రక్రియ
పట్టణంలో బస్టాండ్, రైల్వే స్టేషన్, మార్కెట్, రిమ్స్ ప్రదేశాలలో ప్రత్యేక చర్యలు
ఇప్పటివరకు 1800 మొబైల్ ఫోన్స్ తిరిగి అందజేత.లిజిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 5 (విజన్ ఆంధ్ర)మొబైల్ ఫోన్ లేనిదే ఎలాంటి పని జరగని ప్రస్తుత సమాజంలో మనకు అత్యంత విలువైనది, తక్కువ సమయంలో ఎక్కువ పని చేసే సాంకేతిక పరికరం మొబైల్ ఫోన్. మొబైల్ ఫోన్లో అన్ని వివరాలు, అన్ని జ్ఞాపకాలు, అన్ని లావాదేవీలకు సంబంధించిన అప్లికేషన్లు ఉంటాయి, సాధారణంగా ప్రజలు మొబైల్ ఫోన్లు పోగొట్టుకోవడం, దొంగలించబడటం జరుగుతుంది. పోగొట్టుకున్న వాటిని పొందాలంటే, బాధితులు వెంటనే https://www.ceir.gov.in అనే వెబ్సైట్ లో లేదా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లా నందు ఇలా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టడం కోసం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ప్రత్యేకంగా రికవరీ బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఇలా వీరు వివిధ రాష్ట్రాల నుండి, జిల్లాల నుండి బాధితులు పోగొట్టుకున్నటువంటి, దొంగలించబడినటువంటి నెలరోజుల వ్యవధిలో 100 మొబైల్ ఫోన్ లను తిరిగి రాబట్టడం జరిగింది. గత 18 నెలల్లో ఈ బృందం దాదాపు 1800 మొబైల్ ఫోన్స్ లను తిరిగి బాధితులకు అందజేసింది. మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు దాదాపు మధ్యతరగతి కుటుంబీకులు, బీదవారు వారు ఎంతగానో కష్టపడి కొనుక్కున్న మొబైల్ ఫోన్ను తిరిగి వారికి అందజేయాలని సదుద్దేశంతో జిల్లా ఎస్పీ ఈ బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యంగా మొబైల్ ఫోన్ దొంగతనాలు జరిగే ప్రాంతాలు రైతు బజార్, రిమ్స్, రైల్వే స్టేషన్, బస్టాండ్, ఇళ్లలో దొంగతనాలు, బంధువులకు ఫోన్ చేస్తానంటూ ఫోన్ తస్కరించడం లాంటివి జరుగుతున్నాయని, వాటి వల్ల అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. మొబైల్ ఫోన్లను తిరిగి ఇచ్చే క్రమంలో గురువారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న, చోరీకి గురైనటువంటి బాధితులకు 100 మొబైల్ ఫోన్లు (దాదాపు 18 లక్షల విలువ చేసే) వివిధ ప్రాంతాల నుండి తెప్పించి బాధితులకు తిరిగి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి అందుకున్న బాధితులు సంతోషం వ్యక్తం చేస్తూ, జిల్లా ఎస్పీకి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రతి నెల రోజుల లో పోగొట్టుకున్నటువంటి మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టి బాధితులకు అందజేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఒకవేళ ఎప్పుడైనా ప్రజలు, బాధితులు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న ఎడల వెంటనే దగ్గర్లో ఉన్న సంబంధిత పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని తెలిపారు. మొబైల్ దొంగతనాలు జరిగే క్రమంలో వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మొబైల్ ఫోన్ దుకాణాల యజమానులు, రిపేరింగ్ దుకాణాల యజమానులు, మొబైల్ ఫోను కొనే ముందు మొబైల్ ఫోన్ యజమాని అనుమతి సరైన పత్రాలు తీసుకోవాలి, దొంగ మొబైల్ ఫోన్లు కొన్న ఎడల వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అదిలాబాద్ డి.ఎస్.పి ఎల్ జీవన్ రెడ్డి, ప్రత్యేక బృందం సభ్యులు ఆర్ఎస్ఐ లు మహేష్, పి గోపి కృష్ణ, రియాజ్, మజీద్, అన్వేష్, నవనీత్, జుబేర్ మరియు ఇజాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి బాధ్యతను మరింత పెంచుతుంది

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా విధులు నిర్వహించాలి
జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్.

గద్వాల నవంబర్ 5 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీస్ శాఖలో మహబూబ్ నగర్ 2 టౌన్ నుండి జిల్లా లోని మనోపాడ్ కు ముచ్చూవల్ ట్రాన్స్ఫర్ లో వచ్చి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న కె.తిరుమలేష్ హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొంది జిల్లాకు అలాట్ అయినా సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ టి. శ్రీనివాసరావు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పదోన్నతి పొందిన కె. తిరుమలేష్ కు హెడ్ కానిస్టేబుల్ హోదా పట్టిలు తొడిగి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పదోన్నతి అనేది కేవలం పదవి పెరగడం మాత్రమే కాదని, ప్రజలకు మరింత బాధ్యతతో సేవలు అందించే అవకాశం అని అన్నారు. ఇప్పటివరకు చూపిన నిబద్ధత, క్రమశిక్షణతో పాటు పదోన్నతి అనంతరం మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను అర్థం చేసుకుని సత్వర పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. పోలీసు శాఖపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టడం ప్రతి పోలీసు అధికారి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి. ఎస్పీ మొగిలయ్య, శాంతినగర్ సి ఐ శంకర్, మనోపాడ్ ఎస్సై స్వాతి పాల్గొన్నారు.

మిడిదొడ్డిలో భూభారతి రీ సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి



సిద్దిపేట జిల్లా ప్రతిని 05 నవంబర్(విజన్ ఆంధ్ర)సిద్దిపేట జిల్లా కేంద్రంలో గల మీరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామం మరియు తొగుట మండలం చందాపూర్ గ్రామంలో భూభారతి-రి సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలోపరిశీలించారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....రాష్ట్రంలో రైతులు, భూ యజమానుల సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చే భూభారతి-రి సర్వే ను చేపడుతుందని తెలిపారు.మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామ విస్తీర్ణం 556 ఎకరాలు, 186 ఎకరాలు సర్వే జరిగిందని మరియు తొగుట మండలం చందాపూర్ గ్రామ విస్తీర్ణం 780 ఎకరాలు, 50 ఎకరాలు సర్వే పూర్తి జరిగిందని అధికారులు కలెక్టర్ కి తెలిపారు.గ్రామ సరిహద్దు, ప్రభుత్వ స్థలాలు, అబాది, చెరువులు, కుంటలు, నక్ష బాటలు చేశాకే పట్టా భూములు సర్వే చెయ్యాలని, పట్ట భూములు సర్వే కొరకు ముందు రెండు రోజులు ముందుగానే రైతులకు భూ యజమానులకు సమాచారం అందించాలని, స్థానికంగా లేని భూ యజమానుల సైతం సమాచారం అందించాలని జీపీఓ, సర్వేయర్ లను ఆదేశించారు.సర్వే ప్రక్రియను రైతులు భూ యజమానులు నిశితంగా గమనించి ఏలాంటి సందేహాలున్న అధికారులకు తెలిపి నివృత్తి చేసుకోవాలని, సర్వే చేసిన వెంటనే భూమి యొక్క సర్వే వివరాలను తప్పనిసరిగా రైతులకు తెలియజేయాలని సర్వేలను ఆదేశించారు.ఓకే భూ యజమానికి ఒకే చోట పలు సర్వే నంబర్లలో భూమి ఉన్నట్లయితే వారికి భూ భారతి చట్టంలో ఆ యజమానికి ఒకే సర్వే నంబర్ కేటాయించడం జరుగుతుందని తెలిపారు. రైతులు భూ యజమానులకు ఈ సర్వేకు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే భూమి కొనేటప్పుడు తప్పనిసరిగా సర్వే చేయించుకున్నాకే కొనుగోలు జరపాలని సూంచారు.ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న సాదా బైనామా అప్లికేషన్ పెండింగ్లో ఉంచకుండా డిస్పోజల్ చేయాలని తహసీల్దార్ లను ఆదేశించారు.కలెక్టర్ వెంట ఆయా మండల తహసీల్దార్లు, గ్రామ సర్పంచులు ప్రజాప్రతినిధులు భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

చిన్న జీయర్ స్వామి 70వ పుట్టినరోజు సందర్భంగా 90 రోజుల కార్యక్రమం ముగింపు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 5 (విజన్ ఆంధ్ర):జై శ్రీమన్నారాయణ జై జై శ్రీమన్నారాయణశ్రీ శ్రీ శ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి మంగళ శాసనములతో 70తిరునక్షత్రము అనగా (జన్మదినము) సందర్భంగా స్వామివారి ఆదేశాను గుణంగా వికాస తరంగిణి మానుకోట జిల్లా శాఖ వారిచే జరుగుతున్న ఇంటింటా సత్సంగంలో భాగంగా ప్రతిరోజు 90 రోజుల పారాయణము భక్తులతో భక్తిశ్రద్ధలతో ప్రతి పారాయణములో విష్ణుసహస్రనామం, యతిరాజా రాజా వింశతి దాటిపంచకము,శ్రీ కృష్ణాష్టకం,హనుమాన్ చాలీసా పారాయణం90 రోజులు జరిగినది మరియు స్వామివారు సంకల్పముతో స్థానిక రామాలయంలో ఈరోజు వరకు 11 రోజులు రోజుకు11సార్లు తిరుప్పావై నాలుగవ పాశుర పారాయణం జనుపించి ఈరోజు ఉదయముపారాయణముతర్వాత జమండ్ల పెళ్లి సమీపమున గల మున్నేరు జలప్రవాహములో పసుపు కుంకుమలు, కొబ్బరికాయలుకొట్టి వరుణ పాయనము కలిపివర్షాలువిరివిగాపడాలని వరుణ దేవునికి మొక్కులు చెల్లించామని ఈ కార్యక్రమములోఓం నారాయణ లోయ రాజకుమారి, కొండ్ల వెంకటేశ్వర్లు శ్రీనివాస్ రెడ్డి, శోభారాణి,రావులవిజయ,బండిఅరుణ, మల్లేశ్వరి తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని వికాస తరంగిణి మానుకోటజిల్లా శాఖ వారు తెలియజేశారు.

జిల్లా లో రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు

సైబర్ నేరాలు, డ్రగ్స్ నేరాల పై ప్రజలను చైతన్యం చెయ్యాలి
జిల్లా పోలీస్ అధికారులతో నెలవారి సమీక్ష సమావేశం
- జిల్లా ఎస్పీ టి శ్రీనివాసరావు



గద్వాల నవంబర్ 5 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా లో ప్రధాన రహదారుల పై రోడ్డు ప్రమాదాలు జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ నియమాల పై కఠినంగా వ్యవహరించాలని, భవిష్యత్తు కు సవాలు విసురుతున్న డ్రగ్స్, సైబర్ నేరాలను నియంత్రించడం తో పాటు ప్రజలను చైతన్యం చెయ్యాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు పోలీస్ అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా పోలీస్ కార్యాలయం లోని సమావేశం హల్ నందు జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో నెల వారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని సర్కిల్స్, పోలీస్ స్టేషన్లలో ఉన్న పెండింగ్ కేసులు, దర్యాప్తులో నాణ్యత, నేరాల నియంత్రణ అంశాలపై ఎస్పీ సమీక్షించారు.అనంతరం అధికారులకు పలు సూచనలు చేస్తూ జిల్లా లో ప్రధాన రహదారుల పై రోడ్డు ప్రమాదాలు జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అందుకు జాతీయ రహదారి పై పనులు జరుగుతున్న ప్రదేశాలలో రోడ్డు ఆథారిటీ వాళ్ళతో సమన్వయశీ చేసుకొని రెడ్ బ్లింకర్స్ లైట్స్ ఏర్పాటు చెయ్యాలని, అవసరమైన చోట డివైడర్స్, రెడియం స్టిక్కరింగ్ వేయించాలని అన్నారు, జిల్లా లో జాతీయ రహదారుల వెంబడి ఎలాంటి బెల్ట్ షాప్స్ లేకుండా చూడాలని, ట్రాఫిక్ నియమాల పై కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. రెగ్యులర్ గా చేసే ట్రాఫిక్, స్పెషల్ డ్రైవ్ లను అలాగే కొనసాగించాలని ఇల్లీగల్ ఆక్టివిటీస్ ను ముందస్తుగా గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. భవిష్యత్తు కు సవాలు విసురుతున్న డ్రగ్స్, సైబర్ నేరాలను నియంత్రించడం తో పాటు ప్రజలను మరింత చైతన్యం చెయ్యాలని అన్నారు. షీ టీం ల పని తీరు మెరుగుపడాలని, నర్సింగ్, మెడికల్ కళాశాల లో షీ టీం నిఘా పెంచాలని, విద్యార్థులకు షీ టీం పై అవగాహన పెంచాలని ఆదేశించారు. అలాగే ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని, ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉండేలా దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. సి.సి.టి.ఎన్.ఎస్ ను ఎప్పటికప్పుడు అప్డేట్ చెయ్యాలని, రాబోయే జాతరాలకు జనం క్రౌడ్ ను ముందస్తుగా గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. బీట్, నైట్ పెట్రోలింగ్ ను ఎఫెక్టీవ్ గా అమలు చెయ్యాలని అధికారులను ఆదేశించారు .ఈ సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీ కె. శంకర్, డీఎస్పీ మొగిలయ్య, గద్వాల, అలంపూర్, శాంతినగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు టి. శ్రీను, వి. ప్రదీప్ కుమార్, శంకర్, డి.సి.ఆర్.బి. ఇన్స్పెక్టర్ టాటా బాబు, అలాగే అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, జిల్లా పోలీసు కార్యాలయ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంగారెడ్డి పట్టణం లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన నిర్మలా జగ్గారెడ్డి

-13వ వార్డులో రూ.10 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ :05(విజన్ ఆంధ్ర)సంగారెడ్డి పట్టణంలోని 13, 34వ వార్డుల్లో చేపట్టనున్న డ్రైనేజీ అభివృద్ధి పనులను టీజీఐఐసీ మాజీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి గురువారం నాడు ప్రారంభించారు.పట్టణంలోని 13వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. అదేవిధంగా 34వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, వైస్ చైర్మన్ షఫీ, కౌన్సిలర్లు వీణా కిరణ్, అన్వర్, మహేష్, శ్రీకాంత్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మహేందర్ రెడ్డి, శ్రీధర్, రాజశేఖర్ రెడ్డి, అడ్డూ, మున్నా, రాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక గుస్సాడి దండారి వేడుకలు

జిల్లా కలెక్టర్ రాజర్షి షా.. ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 5 (విజన్ ఆంధ్ర)ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు గుస్సాడి దండారి ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గిరిజనుల ప్రత్యేక సంస్కృతిని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.గురువారం సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో నిర్వహించిన గుస్సాడి దండారి ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో మంద మకరంద్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవాల్లో సందడి చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజనుల విశిష్టమైన సంప్రదాయంలో భాగమైన గుస్సాడి దండారి వేడుకల్లో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏడాది ఈ వేడుకల్లో భాగస్వామ్యం కావడం సంతోషాన్నిస్తోందని పేర్కొన్నారు. తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ వాటిని భావితరాలకు అందిస్తున్న గిరిజనులను అభినందించారు.ఐటీడీఏ పీవో మంద మకరంద్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల అభివృద్ధితో పాటు వారి సాంస్కృతిక వేడుకలకు ఐటీడీఏ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. గుస్సాడి దండారి నృత్య సంప్రదాయం ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని, ఈ వారసత్వాన్ని భావితరాలకు అందించడం అందరి బాధ్యతని తెలిపారు. గిరిజన సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, గుస్సాడి దండారి వేడుకలు ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఒక గ్రామానికి చెందిన దండారి బృందాలు మరో గ్రామానికి వెళ్లి వేడుకల్లో పాల్గొనడం గిరిజనుల మధ్య ఉన్న ఐక్యతకు నిదర్శనమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ శాంతిభద్రతలను పాటిస్తూ పండుగలను సంప్రదాయబద్ధంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని సూచించారు. రిమ్మ గ్రామం ఇప్పటికే అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తోందని, గ్రామస్థులంతా ఐక్యంగా గుస్సాడి దండారి ఉత్సవాల్లో పాల్గొనడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రుత్విక్, ఎంపీడీవో సంతోష్, గ్రామ పటేల్ శంకర్, విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు మహేందర్, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సింగల్ విండో డైరెక్టర్ కే. నరసింహులును సన్మానించిన న్యాయవాది, సీనియర్ జర్నలిస్టులు



అయిజ నవంబర్ 5 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ కేంద్రంలోని న్యాయవాది ఇ. సురేష్ గౌడ్ కార్యాలయంలో అయిజ మండల సింగిల్ విండో డైరెక్టర్ గా నియమింపబడ్డ కనికే. నరసింహులును జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఇ. సురేష్ గౌడ్ (న్యాయవాది) సీనియర్ జర్నలిస్టులు టీ.వీరన్న, బి కే సురేష్ పూలమాలవేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ కనికే. నరసింహులు మాట్లాడుతూ, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ ఆశీస్సులతో అయిజ మండల సింగిల్ విండో డైరెక్టర్ గా నియమించారని అందుకు సంపత్ కుమార్ కి రుణపడి ఉంటానని ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. వారు నాపై ఉంచిన నమ్మకాన్ని పోగొట్టుకోనని అన్నారు. మండల రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సేవకుడిగా పని చేస్తానని తెలియజేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్



గద్వాల నవంబర్ 5(విజన్ ఆంధ్ర బ్యూరో)గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు కోసం వచ్చిన ఫారం-18 దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసి 15 రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఎన్నికల విభాగం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా తయారీపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధాన అధికారి పలు సూచనలు చేశారు. సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కొనసాగుతున్న ఓటర్ ఎన్రోల్మెంట్ ప్రక్రియలో భాగంగా వచ్చిన దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రాబోయే 15 రోజుల్లో వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా అన్ని జిల్లాల్లో ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్లను ఏర్పాటు చేసి విద్యార్థులు, యువతకు ఓటు హక్కు, ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు.జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఇప్పటి వరకు మొత్తం 20,917 ఫారం-18 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. గత ఎన్నికల సమయంలో 14 వేల గ్రాడ్యుయేట్స్ ఓటర్లు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుత దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారి దరఖాస్తులకు త్వరితగతిన ఆమోదం తెలపాలని ఆదేశించారు. నిర్దిష్ట గడువులోగా వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలో ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్లను ఏర్పాటు చేసి, వాటి ద్వారా విద్యార్థులు, యువతకు ఓటు హక్కు, ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, తదితరులు పాల్గొన్నారు

కొమురం భీం కాలనీలో జరిగిన దండోరా ఉత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్




ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 5 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ పట్టణంలోని 12వ వార్డు కొమరం భీం కాలనీలో నిర్వహిస్తున్న ఆదివాసీ సంప్రదాయ దండారి ఉత్సవాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ సోదరులు నిర్వహించిన సంప్రదాయ గుస్సాడి నృత్యాలను ఆమె ఆసక్తిగా తిలకించారు.ఈ సందర్భంగా బండారి అనూష సతీష్ మాట్లాడుతూ దండారి ఉత్సవాలు ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు ప్రతీకలని పేర్కొన్నారు. తరతరాలుగా తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న ఈ ఉత్సవాలను ఆదివాసీలు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవడం గొప్ప విషయమన్నారు.గుస్సాడి నృత్యం ఆదివాసీల ప్రత్యేకమైన కళారూపమని, ఇందులో వారి జీవన విధానం, ఆచారాలు, విశ్వాసాలు, పూర్వీకుల వారసత్వం ప్రతిబింబిస్తాయని తెలిపారు. దండారి ఉత్సవాల సందర్భంగా తమ ఆరాధ్య దైవాలను ప్రార్థిస్తూ, ప్రకృతి మాతకు కృతజ్ఞతలు తెలుపుతూ, పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార సంప్రదాయాలను కొనసాగించడం ఆదివాసీల ప్రత్యేకత అని అన్నారు.ఆధునిక కాలంలోనూ తమ మూలాలను మరువకుండా, సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందిస్తున్న ఆదివాసీ సమాజాన్ని అభినందించారు. ఆదివాసీల కళలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు సమాజంలో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు మన దేశంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెబుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గొడం గణేష్, ఆనందరావు , ఇందిరా , మహిళలు , ఆదివాసీ నాయకులు, స్థానిక పెద్దలు, యువత, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని గద్వాల పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్

ప్రిన్సిపల్ వెంకట్ రెడ్డి పైన కఠినమైన చర్యలు తీసుకోవాలి

పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ కి ఫిర్యాదు

టిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య



గద్వాల నవంబర్ 5(విజన్ ఆంధ్ర బ్యూరో)మహబూబ్నగర్ పాలమూరు యూనివర్సిటీలో బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా టిఆర్ఎస్వి. కోఆర్డినేటర్ కురువ పల్లయ్య సమయపాలన పాటించని గద్వాల పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ కి ఫిర్యాదు చేశారుఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య మాట్లాడుతూకాలేజీ డెవలప్మెంట్ కోసం ఏమాత్రం చొరవ చూపకుండా కేవలం వాళ్ల ఉద్యోగాల కోసం మాత్రమే పిజి సెంటర్ ను నిర్వహిస్తున్నారని అన్నారు.ఇక్కడ అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థులకు భరోసా కల్పించడం లేదని, వచ్చిన వాళ్ళు మరల తిరిగి వెళ్ళిపోతున్నారు. 250 మంది విద్యార్థులు ఉండాల్సిన పీజీ సెంటర్ లో 100 లోపు విద్యార్థులు కూడా లేరని అన్నారు.దీనికి అంతటి కారణం పూర్తిగా పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే అని విమర్శించారు.ఇప్పుడున్న సబ్జెక్టులలో విద్యార్థులు ఎవరు జాయిన్ కావడం లేదు, కేవలం 10 లోపు 20 లోపు మాత్రమే ఉంటున్నారు. కొన్నింటిలో ఐదు లోపే ఉన్నారు.పీజీ సెంటర్ పట్ల ఇప్పుడున్న ప్రిన్సిపాల్ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తూ ఇక్కడ వ్యవస్థను అంతా నాశనం చేస్తున్నాడని తెలిపారు.నాసిరకమైన బోధన జరుగుతూ ఉన్నది, క్వాలిఫికేషన్ లేని వాళ్ళతో పాఠాలు బోధిస్తున్నారు.ప్రిన్సిపాల్ క్రింది స్థాయి ఉద్యోగుల పట్ల అహంకారంగా వ్యవహరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు.విద్యార్థులను కూడా పై అధికారులు మెప్పుకోసం భయభ్రాంతులకు గురిచేసి బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని తెలిపారు.తక్షణమే అతనిపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీయు అధ్యక్షుడు గద్దం భరత్ బాబు ఉన్నారు.

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచాలి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



వేములవాడ, నవంబర్ 05 (విజన్ ఆంధ్ర)వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ పట్టణంలో వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించి. ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా ప్రతి పనికి సంబంధించి కూలీల సంఖ్య పెంచాలని, పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ అధికారులు అభివృద్ధి పనులను పరిశీలిస్తూ.. వేగంగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. రాజన్న ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి.. మున్సిపల్ అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. పరిశీలనలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు త్వరలో ప్రారంభం

-బ్యాడ్మింటన్,టేబుల్ టెన్నిస్‌లో బాలబాలికలకు కోచ్‌తో ప్రత్యేక శిక్షణ
-క్రీడాకారులకు మెరుగైన వసతుల కల్పనే లక్ష్యం
-జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎ.సురేష్



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్-05(విజన్ ఆంధ్ర)జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టును త్వరలో ప్రారంభించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎ. సురేష్ తెలిపారు. క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కోర్టును ఏర్పాటు చేసినట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.కోర్టును వినియోగించుకోవాలనుకునే క్రీడాకారులు రూ. 1,000 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి నెలా రూ. 1,000 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. కోచ్ ద్వారా బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌లో శిక్షణ పొందే బాలబాలికలకు నెలకు రూ. 800 ఫీజుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. గంట చొప్పున కోర్టును వినియోగించుకునే వారు బ్యాడ్మింటన్ ఆడేందుకు రూ. 300 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.కోర్టు ఉదయం 5.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కోర్టులో ఆడే క్రీడాకారులు తప్పనిసరిగా బ్యాడ్మింటన్ షూస్ ధరించాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయం మొదటి అంతస్తులోని గది నంబరు 232లో నేరుగా లేదా ఫోన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 9963960063 నంబరులో సంప్రదించాలని సురేష్ సూచించారు.

మా గ్రామ చెరువుకు డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయాలి

అదనపు కలెక్టర్ నర్సింగరావు కి వినతి



అయిజ నవంబర్ 5 (విజన్ ఆంధ్ర) జోగులాంబగద్వాల జిల్లా, అయిజ మండలం వెంకటాపురం గ్రామంలోని చెరువులలో నీరు పూర్తిగా ఎండిపోయి, గ్రామ ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువుల్లో నీరు లేకపోవడం వలన పశువులకు త్రాగునీటి కొరత ఏర్పడటంతో పాటు, భూగర్భ జలాలు తగ్గిపోయి వ్యవసాయానికి కూడా ఇబ్బందులు కలుగుతున్నాయి.కావున మా గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, సమీప డ్యామ్ నుంచి మా గ్రామ చెరువులకు నీటిని విడుదల చేసి చెరువులను నింపే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు వినతిపత్రం అందజేశారు.గ్రామ ప్రజలు మాట్లాడుతూఈ సమస్యపై తక్షణమే స్పందించి మా గ్రామ ప్రజలకు, రైతులకు, పశువులకు నీటి సౌకర్యం కల్పించి మా గ్రామ చెరువులను నీటితో నింపేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పొద్దునపు కలెక్టర్ కి మనవి చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చిన్న భీమన్న, గ్రామ మాజీ సర్పంచ్ తిమ్మన్న, గ్రామ ప్రజలు రాజశేఖర్, వెంకటేష్, దేవరాజు,రంగస్వామి, సురేష్,రాజు, బడేసాబ్,మధు యాదవ్ , పెద్దయ్య , తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కిసాన్ మేళాతో రైతులకు అవగాహన

రైతులను సమాయత్తం చేయాలి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల నవంబర్ 05(విజన్ ఆంధ్ర బ్యూరో)ప్రభుత్వం ఈనెల ఏడవ తేదీ నుంచి 9 వరకు వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట గ్రామంలో నిర్వహిస్తున్న కిసాన్ మేళాకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ తెలిపారు. కిసాన్ మేళాతో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలుగుతుందని అన్నారు. కిసాన్ మేళాకు బస్సుల ఏర్పాట్లు, రైతులకు కల్పించాల్సిన సౌకర్యాలపై జిల్లా కలెక్టర్ గురువారం క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాలోని అన్ని మండలాల అధికారులతో వేబేక్స్ సమావేశంలో మాట్లాడారు. కిసాన్ మేళాకు పెద్ద ఎత్తున రైతులు రావడం వలన వారికి నూతన వ్యవసాయ పద్ధతులు, ఆధునిక యంత్రాలు, ఇతరత్రా వ్యవసాయానికి సంబంధించిన సమగ్ర విషయాలు తెలుస్తాయన్నారు. ఈ నెల 9న ఉదయం 10 గంటల వరకు బస్సులు అన్ని మండలాలకు చేరుకోవాలని ఆదేశించారు. మొత్తం 50 బస్సుల్లో జిల్లా రైతులు కిసాన్ మేళాకు వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేయాలన్నారు. ఎక్కువమంది రైతులు మేళాకు వచ్చేందుకు ఆసక్తి చూపితే అదనపు బస్సులు కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి బస్సుకు ఒక సమన్వయ అధికారిని నియమించడంతోపాటు అన్ని బస్సుల్లో వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స కిట్స్ తో అత్యవసర వైద్య సహాయం అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఆయా బస్సుల్లో ఉండే అధికారుల ఫోన్ నెంబర్లు సంబంధిత బస్సుల్లో ప్రయాణించే రైతులందరికీ తెలియజేయాలని సూచించారు. దాంతో ఎవరూ కూడా తప్పిపోకుండా ఉండేందుకు జాగ్రత్త పడవచ్చన్నారు. ప్రతి బస్సుపై మండలం పేరు, ఇతర అవసరమైన వివరాలతో పోస్టర్లను అతికించాలన్నారు. 10 బస్సులకు ఒక పోలీస్ అధికారి వర్యవేక్షణ చేస్తారన్నారు. అన్ని మండలాల రైతులకు ఎర్రవల్లి చౌరస్తా సమీపంలో మధ్యాహ్న, రాత్రి భోజనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులందరినీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కిసాన్ మేళాకు తీసుకెళ్లి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, డీఎస్పీ మొగిలయ్య, డిఏఓ వీరప్ప, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ వైద్య శిబిరం ద్వారా అందించిన సేవలు అభినందనీయం

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 5,(విజన్ ఆంధ్ర):ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్, భారతీయ రైల్వే సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచంలోనే తొలి హాస్పిటల్ రైలు లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ ఉచిత వైద్య శిబిరం ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లాలోని కాగజ్ నగర్ లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడంలో లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ సేవలు అభినందనీయమని తెలిపారు. ఈ శిబిరం ద్వారా నిరుపేదలకు ఉచిత శస్త్రచికిత్సలు, కంటి పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు సంబంధిత వైద్య సేవలు, ప్లాస్టిక్ సర్జరీలు అందించడం ప్రశంసనీయమని తెలిపారు. వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, రైల్వే అధికారులు అందించిన వైద్య సేవ ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరి సేవలు అభినందనీయమని తెలిపారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

-అధిక ధరలకు బియ్యం విక్రయించిన సూపర్ మార్కెట్‌పై కేసు నమోదు
జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె.శ్రీనాథ్



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్-05(విజన్ ఆంధ్ర)ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకే బియ్యం విక్రయించాలని, అంతకుమించి ధరలు వసూలు చేస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి కె. శ్రీనాథ్ హెచ్చరించారు. గురువారం పెద్దపల్లి పట్టణంలోని కూనారం రోడ్డులో గల శ్రీ సాయి సూపర్ మార్కెట్‌లో పౌరసరఫరాల శాఖ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి సంబంధిత సూపర్ మార్కెట్‌పై కేసు నమోదు చేశారు. అదే రోడ్డులోని ఏజీ మార్ట్‌లోనూ తనిఖీలు చేపట్టి విక్రయ ధరలను పరిశీలించారు. తెలంగాణ పౌరసరఫరాల శాఖ మార్గదర్శకాల ప్రకారం 26 కిలోల బ్యాగ్ ప్యాక్ బియ్యంలో బీపీటీ, కేఎన్ఎం రకం కిలో రూ. 66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం రూ. 74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం రూ. 79కు మించి విక్రయించరాదని శ్రీనాథ్ స్పష్టం చేశారు. ప్రతి సూపర్ మార్కెట్, బియ్యం విక్రయ కేంద్రంలో ఈ ధరలు వినియోగదారులకు కనిపించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. బియ్యం కృత్రిమ కొరత సృష్టించడం, నిర్ణీత ధరల కంటే అధికంగా విక్రయించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులు బియ్యం కొనుగోలు చేసే సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన ధరలను పరిశీలించి, అధిక ధరలు వసూలు చేస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.
ఈ తనిఖీల్లో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రఘువీర్ సింగ్, డీటీ పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.


నిరుద్యోగులకు ఉద్యోగావకాశం నవంబర్ 10న జాబ్‌మేళా

-కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్‌లో 64 పోస్టుల భర్తీ
-జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్-05(విజన్ ఆంధ్ర)జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 10న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు. కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో ఖాళీగా ఉన్న 64 పోస్టులను ఈ జాబ్‌మేళా ద్వారా భర్తీ చేయనున్నట్లు గురువారం వెల్లడించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ మొదటి అంతస్తులో గల జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం (గది నంబరు 233)లో ఉదయం 11 గంటలకు మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మొత్తం పోస్టుల్లో 60 సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, నాలుగు ఫీల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులకు ఇంటర్, డిగ్రీ లేదా డిప్లొమా, ఫీల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులకు బీఎస్సీ అగ్రికల్చర్ అర్హత ఉండాలని సూచించారు. పురుషులు, మహిళలు ఇద్దరూ దరఖాస్తు చేసుకోవచ్చని, ఎంపికైన వారికి నెలకు రూ. 10 వేల నుంచి రూ. 18 వేల వరకు వేతనంతో పాటు టీఏ, డీఏ, ప్రోత్సాహకాలు అందిస్తారని తెలిపారు. ఉద్యోగులకు పెద్దపల్లి జిల్లాలోనే పని చేసే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అప్‌డేటెడ్ రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్, ఆధార్ కార్డు కాపీ, అనుభవ ధ్రువీకరణ పత్రాలతో హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8985336947, 8121262441 నంబర్లలో సంప్రదించాలని రాజశేఖర్ పేర్కొన్నారు.

ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్ శ్రేణులకు అభినందనలు



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 5 (విజన్ ఆంధ్ర బ్యూరో)ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన ఓటు బచావో - దేశ్ బచావో కార్యక్రమాన్ని విజయవంతం చేసి తిరిగి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులను అభినందిస్తూ గురువారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమదుర్గ భవన్‌లో సంబరాలు నిర్వహించారు.
టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి విజయోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, ఢిల్లీలో నిర్వహించిన 'ఓటు బచావో - దేశ్ బచావో' కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో బస్సుల ద్వారా తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

-అధిక ధరలకు బియ్యం విక్రయించిన సూపర్ మార్కెట్‌పై కేసు నమోదు
జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె.శ్రీనాథ్

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్-05(విజన్ ఆంధ్ర)ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకే బియ్యం విక్రయించాలని, అంతకుమించి ధరలు వసూలు చేస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి కె. శ్రీనాథ్ హెచ్చరించారు. గురువారం పెద్దపల్లి పట్టణంలోని కూనారం రోడ్డులో గల శ్రీ సాయి సూపర్ మార్కెట్‌లో పౌరసరఫరాల శాఖ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి సంబంధిత సూపర్ మార్కెట్‌పై కేసు నమోదు చేశారు. అదే రోడ్డులోని ఏజీ మార్ట్‌లోనూ తనిఖీలు చేపట్టి విక్రయ ధరలను పరిశీలించారు. తెలంగాణ పౌరసరఫరాల శాఖ మార్గదర్శకాల ప్రకారం 26 కిలోల బ్యాగ్ ప్యాక్ బియ్యంలో బీపీటీ, కేఎన్ఎం రకం కిలో రూ. 66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం రూ. 74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం రూ. 79కు మించి విక్రయించరాదని శ్రీనాథ్ స్పష్టం చేశారు. ప్రతి సూపర్ మార్కెట్, బియ్యం విక్రయ కేంద్రంలో ఈ ధరలు వినియోగదారులకు కనిపించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. బియ్యం కృత్రిమ కొరత సృష్టించడం, నిర్ణీత ధరల కంటే అధికంగా విక్రయించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులు బియ్యం కొనుగోలు చేసే సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన ధరలను పరిశీలించి, అధిక ధరలు వసూలు చేస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.
ఈ తనిఖీల్లో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రఘువీర్ సింగ్, డీటీ పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు -ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ :05(విజన్ ఆంధ్ర)రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులకు సూచించారు. రైతులు ఎంతో కష్టపడి పండించిన ప్రతి గింజను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. గురువారం నాడు సంగారెడ్డి మండలంలోని కులాబ్‌గుర్, కొత్లాపూర్ గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు ఇప్పటికే అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, పంట కొనుగోళ్ల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులందరికీ సమాన ప్రాధాన్యత కల్పించాలని, దళారీ వ్యవస్థకు తావులేకుండా నేరుగా రైతుల నుంచే ధాన్యం సేకరించాలని అధికారులకు సూచించారు. ప్రతి క్వింటాల్ సన్నధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన రూ. 500 బోనస్‌ను అర్హులైన రైతులందరికీ అందించాలని, గత ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న బోనస్ బకాయిలను సైతం తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అదేవిధంగా రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ కోతలు, పంట రుణాల సమస్యలు, ఎరువుల కొరత వంటి అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరినట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం తేమ శాతం పరీక్షలు, తూకం ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా రవాణా ఏర్పాట్లు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రైతులకు చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటాయని పేర్కొన్న ఆయన.. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర, ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాలు సకాలంలో అందినప్పుడే వ్యవసాయ రంగం బలోపేతం అవుతుందని అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోళ్ల ప్రక్రియను అధికారులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చక్రపాణి, ఆయా గ్రామాల సర్పంచులు, డీసీఎంఎస్ ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈ-హెచ్‌ఆర్ఎంఎస్‌పై ప్రతి ఉద్యోగికి అవగాహన ఉండాలి

అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



వనపర్తి జిల్లా ప్రతినిధి,నవంబరు 5 (విజన్ ఆంధ్ర) ప్రభుత్వ ఉద్యోగులు తమ సర్వీసుకు సంబంధించిన వివరాలు, సెలవుల మంజూరు, బిల్లులు తదితర ఉద్యోగ సేవలను ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు ఈ-హెచ్‌ఆర్ఎంఎస్ పోర్టల్‌ను తప్పనిసరిగా వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులకు ఐఎఫ్ఎంఐఎస్ ఈ-హెచ్‌ఆర్ఎంఎస్ పోర్టల్ వినియోగంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన అన్ని వివరాలు, కార్యకలాపాలను ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు ఈ పోర్టల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పోర్టల్‌లో అందుబాటులో ఉన్న సేవలు, వాటిని వినియోగించుకునే విధానంపై ప్రతి ఉద్యోగి పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. తమకు సంబంధించిన పనులను ఆన్‌లైన్‌లో సక్రమంగా నిర్వహించుకునేలా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ట్రెజరీ శాఖ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోర్టల్‌లోని సేవలు, విధివిధానాలు, వినియోగ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ రాంరెడ్డి, జెడ్పీ సీఈఓ యాదయ్య, ఏటీఓ హరికృష్ణ, ఎస్‌టీఓలు రాందాస్, రాజేష్ కన్నా, వివిధ శాఖల జిల్లా అధికారులు, శాఖాధిపతులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు


నల్లగొండ డిఎం& హెచ్ ఓ కార్యాలయంలో కారుణ్య నియామక బోగస్ దందా అధికారికంగా బట్టబయలు!

యంవో,సూపరింటెండెంట్ సస్పెండ్,ముగ్గురు క్లర్కులకు బదిలీ వేటు.
విజన్ ఆంధ్ర కథనమే నిజమని తేల్చిన అధికారులు
మే లో చనిపోయినట్లు బోగస్ సర్టిఫికెట్,నవంబర్ లో నిజంగా మరణం

ఉమ్మడి నల్లగొండ బ్యూరో, (విజన్ ఆంధ్ర):నల్లగొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో సంచలనం సృష్టించిన అక్రమ కారుణ్య నియామక వ్యవహారంపై చివరకు జిల్లా యంత్రాంగం స్పందించింది. రాష్ట్ర స్థాయిలోను,జాతీయ స్థాయిలోను,సోషల్ మీడియాలోనూ,మరి ఇతర గ్రూపులలో చెక్కలు కొడుతున్న ఈ వ్యవహారాలన్నిటిపై అధికారులకు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించిన అధికారులు. విజన్ ఆంధ్ర పత్రికల్లో వచ్చిన కథనాల్లోని ఆరోపణలు నిజమేనని అధికారికంగా అంగీకరించారు. దీంతో ఈ బోగస్ దందా అధికారికంగా బట్టబయలైంది. నల్లగొండ జిల్లాలోని శాలిగౌరారం మండల పరిధిలో ని పీహెచ్సీ హెల్త్ అసిస్టెంట్ గా పనిచేసిన చామకూరి వెంకటేశ్వర్లు అనే ఉద్యోగి కార్యాలయ రికార్డుల ప్రకారం 31 ఆగస్టు 2025 తేదీన సర్వీస్ నుండి ఉద్యోగ విరమణ పొందారని జిల్లా వైద్యాధికారి స్వయంగా పేర్కొన్నారు. ఆయన సహజంగా రిటైర్ అయ్యారు. ఆయన సర్వీస్ అయిపోయింది. ఇక ఆయనకు,ఆయన కుటుంబానికి ప్రభుత్వపరంగా ఎటువంటి కారుణ్య నియామకానికి ఈ నిబంధన వర్తించదని అధికారులు తేల్చారు. కానీ ఇక్కడే అసలు కుట్ర మొదలైంది. శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్,సదరు ఉద్యోగి చామకూరి వెంకటేశ్వర్లు 28.09.2025 తేదీన మరణించినట్లు సర్వీస్ రికార్డులలో నమోదు చేశారు. అంటే రిటైర్ అయిన నెల రోజులకే ఆయన చనిపోయినట్లు క్రియేట్ చేశారు. ఎందుకు? ఆయన కుమారుడు చామకూరి రాజుకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించేందుకు. ఈ ప్రతిపాదనలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయానికి సమర్పించారు. ఇక్కడే మరో అతి పెద్ద తప్పు జరిగింది. తొలుత సమర్పించిన కారుణ్య నియామక ప్రతిపాదనలు అసంపూర్ణంగా ఉన్నందున,రెండుసార్లుతిరస్కరించబడ్డాయి. అంటే ఫైల్ లో సరైన పత్రాలు లేవు. కానీ అయినా వదలకుండా,మరణ ధృవీకరణ పత్రం,కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం,సర్వీస్ బుక్ తదితర అవసరమైన పత్రాలను జతపరిచి తిరిగి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ ప్రతిపాదనలను కార్యాలయ స్థాయిలో సంబంధిత సెక్షన్ క్లర్క్,కార్యాలయ సూపరింటెండెంట్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పరిశీలించి,తదుపరి చర్యల నిమిత్తం జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి పరిశీలనకు సమర్పించారు. ఈ ప్రతిపాదనలను కింది స్థాయి నుండి పై స్థాయి వరకు ఎవరూ సరిగ్గా పరిశీలించలేదు,పరిశీలించినా కళ్లు మూసుకుని సంతకాలు పెట్టారని అర్థమవుతోంది. అసలు నిజం ఎలా బయటపడింది? చామకూరి వెంకటేశ్వర్లు వాస్తవానికి 17.11.2025 తేదీన మరణించినట్లు ఆయన దశదిన కర్మకు సంబంధించిన ఆహ్వాన పత్రం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వెలుగులోకి వచ్చింది. ఈ సమాచారంపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి స్వయంగా విచారణ చేపట్టి, ప్రభుత్వ ఆసుపత్రి,సూర్యాపేటలోని వైద్య రికార్డులను పరిశీలించారు. చామకూరి వెంకటేశ్వర్లు మూత్రపిండాల వ్యాధితో చికిత్స పొందుతూ 17.11.2025 తేదీన మరణించినట్లు నిర్ధారణ అయిందని అధికారికంగా పేర్కొన్నారు. అంటే ఇక్కడ రెండు మరణ తేదీలు ఉన్నాయి. ఒకటి బోగస్ మరణ తేదీ 28.09.2025,ఉద్యోగం కోసం సృష్టించింది. రెండోది నిజమైన మరణ తేదీ -17.11.2025, ఆసుపత్రిలో జరిగింది. దీనిని బట్టి 28.09.2025 తేదీన మరణించినట్లు నమోదు చేసి సమర్పించిన మరణ ధృవీకరణ పత్రం,కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం, సంబంధిత సర్వీస్ రికార్డులలోని వివరాలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమయ్యాయి. వాస్తవ మరణ తేదీకి విరుద్ధంగా సమర్పించిన పత్రాల ఆధారంగా కారుణ్య నియామక ప్రతిపాదనలు రూపొందించినట్లు గుర్తించి, సదరు కారుణ్య నియామక ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేశామని జిల్లా వైద్యాధికారి రాహుల్ ప్రకటించారు. తక్షణ చర్యలు-కలెక్టర్ కొరడా.. ఈ వ్యవహారంలో శాలిగౌరారం స్థాయిలో ప్రతిపాదనలు రూపొందించి పంపిన సంబంధిత మెడికల్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్ తో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని సెక్షన్ క్లర్క్,కార్యాలయ సూపరింటెండెంట్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పాత్రలను పరిశీలించి,తదుపరి చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్ కు నివేదించడం జరిగింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శాలిగౌరారం మెడికల్ ఆఫీసర్ ను విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగింది. అదేవిధంగా జిల్లా కార్యాలయంలోని సెక్షన్ క్లర్క్, సూపరింటెండెంట్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసి,వారి వివరణలు తీసుకుని,3 గురిని బదిలీ చేసినట్టు చెప్పారు. తక్షణ చర్యల్లో భాగంగా కార్యాలయ మినిస్టీరియల్ సిబ్బందిలో సెక్షన్ క్లర్క్ టి. కృష్ణమోహన్ ను హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు, జూనియర్ అసిస్టెంట్ పి. రంజిత్ కుమార్ ను వి.టి. నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు,సీనియర్ అసిస్టెంట్ జె. రాకేష్ ను కొండమల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు పంపారు. అసలు దోషులు ఇంకా బయటే ఉన్నారు-సిట్ వేయాలిఅసలు ప్రశ్నలు ఇంకా మిగిలే ఉన్నాయి. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో నకిలీ డెత్ సర్టిఫికెట్ ఇచ్చిన వార్డు ఆఫీసర్,శానిటరీ ఇన్ స్పెక్టర్,క్లర్కులపై ఎందుకు ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయలేదు? నకిరేకల్ తహసిల్దార్ ఇచ్చిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పై "ఉద్యోగానికి వర్తించదు"అని స్పష్టంగా ఉండి కూడా దానిని ఎలా ఆమోదించారు? డి ఎం & హెచ్ ఓ ఉత్తర్వులు ఇవ్వకుండానే దామరచర్ల పీహెచ్సీ హాజరు రిజిస్టర్ లో చామకూరి రాజు పేరు ఎలా వచ్చింది? దీని వెనుక జరిగిన 20 లక్షల రూపాయల బేరం గురించి ఏసీబీ విచారణ ఎందుకు చేయడం లేదు?సాధారణ విచారణ సరిపోదు. జిల్లా కలెక్టర్,ఎస్పీలు పగడ్బందీ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) ను ఏర్పాటు చేసి, రెవెన్యూ,మున్సిపల్,వైద్య ఆరోగ్య,పోలీస్,ఏసీబీ అధికారులతో సమగ్ర విచారణ జరిపి,దోషులందరినీ ఉద్యోగాల నుండి శాశ్వతంగా తొలగించి,క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని ప్రజా సంఘాలు,నిరుద్యోగులు, మేధావులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో తప్పుడు సమాచారం నమోదు చేయడం,తప్పుడు పత్రాలు సమర్పించడం,వాస్తవాలను దాచిపెట్టి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించడం వంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం సహించదని,ఎవరినీ ఉపేక్షించకుండా విచారణ పూర్తి చేసి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి హామీ ఇచ్చినా,ఆ హామీ నిలబెట్టుకోవాలంటే సిట్ తప్పనిసరి.

వైమానిక దళ ఉద్యోగాలపై డిసెంబరు 3న అవగాహన కార్యక్రమం

యువత సద్వినియోగం చేసుకోవాలి
ఇన్‌చార్జి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 5 (విజన్ ఆంధ్ర)భారత వైమానిక దళంలో ఉద్యోగ అవకాశాలు, అర్హతలు, ఎంపిక విధానంపై యువతకు అవగాహన కల్పించేందుకు డిసెంబరు 3న ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. వైమానిక దళంలో చేరాలనే ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో కోరారు. భారత వైమానిక దళంలోని 12వ ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో అగ్నివీర్‌వాయు, ఎయిర్‌మెన్ ఉద్యోగాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మొబైల్ థియేటర్ వ్యాన్ (ఎంటీవీ) ద్వారా ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియపై యువతకు వివరించనున్నట్లు వెల్లడించారు. దేశ రక్షణలో భాగస్వాములు కావడానికి వైమానిక దళం మంచి అవకాశమని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. యువత ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని దేశ సేవకు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు.

36 మంది మహిళలకు రూ.20 వేల వేతనంతో ఉద్యోగాలు

వనపర్తి ఆర్ఎస్ఈటీఐలో దేశంలోనే తొలిసారిగా వినూత్న శిక్షణ
ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబరు 5 (విజన్ ఆంధ్ర)గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో వనపర్తి యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) దేశంలోనే తొలిసారిగా వినూత్నంగా నిర్వహించిన 'జాపా మైడ్ కమ్ హోమ్ క్యులినరీ ఎక్స్‌పర్ట్' శిక్షణ కార్యక్రమం విజయవంతమైంది. 60 మంది మహిళలకు శిక్షణ ఇవ్వగా, వారిలో 36 మందికి నెలకు కనీసం రూ. 20 వేల వేతనంతో ఉద్యోగాలు లభించాయి. ఉద్యోగులతో పాటు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పించడం విశేషం. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మార్గదర్శకత్వంలో, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సహకారంతో, నాబార్డు ఆర్థిక తోడ్పాటుతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని అక్టోబరు 3 నుంచి 28 వరకు 20 రోజులపాటు నిర్వహించారు. నవజాత శిశువులు, బాలింతల సంరక్షణ, తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణ, గృహ వంటకాలు తదితర అంశాల్లో మహిళలకు శిక్షణ ఇచ్చారు.
ప్రభుత్వ నర్సింగ్, వైద్య కళాశాలలకు చెందిన నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ ఇప్పించడంతో పాటు గోపాల్‌పేట మదర్ అండ్ చైల్డ్ కేర్ ఆసుపత్రి, వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో క్షేత్రస్థాయి ప్రాక్టికల్ శిక్షణ అందించారు. అభ్యర్థుల ఎంపిక, సమీకరణలో డీఆర్డీఏ సహకరించింది. ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ బి. అనిల్ కుమార్ ప్రత్యేక చొరవతో హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన పోర్టియా మెడికల్ సర్వీసెస్ సంస్థ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ నెల 5న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేతుల మీదుగా ఎంపికైన మహిళలకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. గత నెల 26న నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, నాబార్డు డీడీఎం మనోహర్ రెడ్డి పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి రమేష్, వైస్ ఛైర్‌పర్సన్ మధుసూదన్, పోర్టియా హెల్త్ సర్వీసెస్ ప్రాంతీయ మేనేజర్ శ్రీకాంత్, ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ అనిల్ కుమార్, డీఆర్డీఏ పీడీ ఉమాదేవి, జెడ్పీ డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్ రెడ్డి, ఎల్‌డీఎం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్. అగ్గు ఎర్రన్నకు విప్లవ జోహార్లు.



నిజామాబాద్ నవంబర్05:(విజన్ ఆంధ్ర) : కామ్రేడ్ అగ్గు ఎర్రన్న సుమారు నాలుగు దశాబ్దాల కాలంగా రైతు కూలి ఉద్యమంలో చురుకైన కార్యకర్త...కామ్రేడ్ ఎర్రన్న సొంత గ్రామమైన మోపాల మండల కేంద్రం.. దాని చుట్టూ ఉన్న గ్రామాల్లోను ,జిల్లా స్థాయిలో జరిగిన ఉద్యమాల్లో చురుకైన పాత్ర వహించారని ఈ సందర్భంగా ఎ.ప్రభాకర్ గుర్తు చేసుకున్నారు. ప్రజా సంఘాల్లోనూ విప్లవ పార్టీలోను ఐక్యత అవసరమని,, కేంద్రీకృత ప్రజాస్వామ్య పద్ధతుల పని చేయాలని నిత్యం కోరుకునేవాడని గుర్తు చేసుకున్నారు.. మంచి స్నేహశీలీ అని అన్నారు. తాను న్యూ డెమోక్రసీ పార్టీలో ఉంటూ కూడా అన్ని విప్లవ పార్టీలతో అర మరికల్లేకుండా ఉండేవాడని గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబానికి రాగల సానుభూతి ప్రజాపందా మాస్ లైన్,, అఖిలభారత ఐక్య రైతు సంఘం. AIIKS తెలియజేసింది. జోహార్లు అర్పించింది.కామ్రేడ్ అగ్గు ఎర్రన్నకు నిజమైన నివాళి అర్పించడం అంటే విప్లవ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించడం అని అన్నారు. తన సొంత గ్రామమైన మోపాల్ మండల కేంద్రం.. అటవీ శాఖ అధికారుల వేధింపులకు వ్యతిరేకంగా,, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలపై,, ఉపాధి హామీ పథకం అమల్లో జరుగుతున్న తప్పుడు విధానాలను సరి చేయడానికి కలిసి పనిచేశామని గుర్తు చేసుకున్నాం... 5 నవంబర్ ఉదయం గంటల 30 నిమిషాలకు తుది శ్వాస వదిలారు... కామ్రేడ్ . అగ్గు ఎర్రన్న పార్థివ దేహాన్ని ప్రజల సందర్శనార్థం న్యూ డెమోక్రసీ పార్టీ నాయకత్వం నీలం రామచంద్రయ్య భవన్లో ఉంచారు.. కామ్రేడ్. అగ్గు ఎర్రన్న పార్టీవ దేహానికి AIUKS రాష్ట్ర అధ్యక్షులు. V ప్రభాకర్. V. గోదావరి. POW జిల్లా అధ్యక్షురాలు. CLC రాష్ట్ర నాయకులు .A. రవీందర్. న్యూ డెమోక్రసీ. జిల్లా కార్యదర్శి పాపయ్య. శ్రీధర్. వేల్పూర్ భూమయ్య. సాయిబాబా.. తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డిసెంబర్ నెలాఖరు నాటికి ధర్పల్లి ఏరియా ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- తుది దశ పనులను నాణ్యతతో వేగవంతంగా జరిపించాలని ఆదేశం



నిజామాబాద్, నవంబర్ 05 :(విజన్ ఆంధ్ర)ధర్పల్లి మండల కేంద్రంలో నూతనంగా నెలకొల్పుతున్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి తుది దశ నిర్మాణ పనులను నాణ్యతతో వేగవంతంగా చేపట్టి డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ధర్పల్లిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను అట పడకల స్థాయి నుండి 100 పడకలకు పెంచుతూ ఏరియా ఆసుపత్రిగా ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిన నేపథ్యంలో రూ. 33.15 కోట్ల నిధులను వెచ్చిస్తూ అధునాతన వసతులతో నూతన భవన నిర్మాణం జరుపుతున్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ధర్పల్లి ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే 90శాతం వరకు పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించి, ఇంకనూ చేపట్టాల్సి ఉన్న తుది దశ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. మిగతా పనులను కూడా యుద్ధ ప్రాతిపదికన చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మాతాశిశు, పీడియాట్రిక్ విభాగాలు, క్యాజువాలిటీ, రేడియాలజీ, ఆపరేషన్ థియేటర్లు, ఆయుష్ బ్లాక్, మేల్, ఫిమేల్ వార్డు, ఆప్తాలమిక్, డెంటల్, ఓ.టీ, డయాగ్నొస్టిక్ తదితర విభాగాలను కలెక్టర్ సందర్శించి పనుల నాణ్యతను నిశితంగా పరిశీలన జరిపారు. నాణ్యత విషయంలో ఎక్కడ కూడా రాజీ పడవద్దని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులు చేపట్టే విషయంలో ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే తమ దృష్టికి తేవాలని సూచించారు. తుది దశ పనులను క్రమం తప్పకుండా సందర్శిస్తూ పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల నిర్మాణాలు, నిర్దేశించిన విధంగా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయా లేదా అన్నది నిర్ధారణ చేసుకున్న తరువాతే హ్యాండ్ ఓవర్ చేసుకోవాలని సూచించారు. ఆసుపత్రి నిర్వహణకు అవసరమైన అన్ని వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్ భుజంగరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, స్థానిక తహసిల్దార్ శాంత, టీజీఎంఐడీసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తదితరులు ఉన్నారు.

పనుల్లో నాణ్యత ఎంతో ముఖ్యం

- పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ నవంబర్05:(విజన్ ఆంధ్ర) నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో కొనసాగుతున్న పనుల్లో నాణ్యత ఎంతో ముఖ్యమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. నగరంలోని 22, 25, 35వ డివిజన్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇటీవల నిర్వహించిన కార్పొరేషన్ కౌన్సిల్ లో ప్రతి డివిజన్ కు 20 లక్షల నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో అన్ని డివిజన్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేయడం జరుగుతుందన్నారు. అలాగే డివిజన్కు కోటి రూపాయల పనులు కూడా కొన్ని డివిజన్లో ప్రారంభమయ్యాయని, మరికొన్ని ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు. అమృత్ 2 పథకం కింద నగరంలో యూజీడీ పనులు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. అయితే పనుల్లో వేగం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించి సూచించడం జరిగిందన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, కావున పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రధానంగా అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని చెప్పడం జరిగిందన్నారు. అలాగే ఇందూరులోనే ఘన చరిత్ర గల అతి పురాతనమైన ఖిల్లా రామాలయ అభివృద్ధిలో భాగంగా రోప్ వే కూడా రాబోతుందన్నారు. ఇటీవల ఇందుకు సంబంధించిన అధికారులు, కంపెనీ ప్రతినిధులు సందర్శించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి, 22వ డివిజన్ కార్పొరేటర్ వైష్ణవి సుధా, 25వ డివిజన్ కార్పొరేటర్ చింతకాయల రాజేందర్, 35వ డివిజన కార్పొరేటర్ ఎర్రం సుధీర్, బీజేపీ నాయకులు పవన్ ముందడ , శ్రీనివాస్, మారావార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణకు పాటుపడాలి

- బీజేపీ అధ్యాత్మిక సెల్ సమావేశంలో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ..



నిజామాబాద్ నవంబర్05:(విజన్ ఆంధ్ర) జిల్లాలోని ఆలయాల పరిరక్షణకు పాటుపడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. బీజేపీ అధ్యాత్మిక సెల్ నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన ఆధ్యాత్మిక సెల్ హిందూ ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా జిల్లాలో చారిత్రాత్మక ఆలయాలు ఎన్నో ఉన్నాయన్నారు. వాటి భూముల పరిరక్షణ చేపట్టాలన్నారు. ఆలయాలపై దాడులు వ్యతిరేక కార్యకలాపాలను ఎదిరించి ఆసరాగా నిలవాలని సూచించారు. హిందువులందరినీ కలుపుకొని సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఆలయాల భూముల కబ్జాలను ఆక్రమణలను అడ్డుకోవాలని తెలిపారు. అనంతరం నూతన కమిటీలను నియమకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యాత్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ సూర్య ప్రకాష్ రావు, కో కన్వీనర్ నిరంజన్ దేశాయ్, జాయింట్ కన్వీనర్ నవీన్, జిల్లా కన్వీనర్ మేఘా సుబేదార్, రాష్ట్ర సలహాదారు ఉదయ్ మహారాజు, జిల్లా కో కన్వీనర్ రాజేష్, చంద్ర కాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్ల నరేందర్ రెడ్డి నూతన గృహప్రవేశం



కీసర, నవంబర్ 5, విజన్ ఆంధ్ర: నాగారం మున్సిపాలిటీ భారతీయ జనత పార్టీ యువ మోర్చా నాయకులు వేంపల్ల నరేందర్ రెడ్డి శివ శంకర్ నగర్ లో నిర్మించిన నూతన గృహప్రవేశం చేశారు. నూతన గృహప్రవేశంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ అనంత రెడ్డి, యువ నాయకులు కౌకుంట్ల రాహుల్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారులు, పలు పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

ఈ స్వీట్లు తింటే ఆస్పత్రికే

అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా తయారీ కేంద్రాలు







నిజామాబాద్ నవంబర్05:(విజన్ ఆంధ్ర) స్వీట్లు చూస్తేనే నోరూరించే రంగులు.. నోట్లో వేస్తే కరిగిపోవాల్సిందే.. కానీ వాటి తయారీ కేంద్రాల్లోకి ఒక్కసారి చూస్తే మాత్రం వాంతులు రావడం ఖాయం. నగరంలోని పలు స్వీట్లు, ఖారా తయారీ కేంద్రాలపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు చేయగా విస్తుపోయే విషయాలు బయటకు వచ్చాయి.14 బృందాలతో..ఈనెల 3న హైదరాబాద్ నుంచి వచ్చిన టీజీ సేఫ్ అధికారులు పలు స్వీట్లు, ఖారా తయారు చేసే దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఏకకాలంలో సుమారు 14 బృందాలు ఈ దాడుల్లో పాల్గొన్నాయి. వీరు నగరంలోని జిల్లా వ్యాప్తంగా మొత్తం 28 ఆహార సంబంధిత వ్యాపార సంస్థల్లో (స్పైసెస్ తయారీ యూనిట్లు, ప్యాకే+జ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్లు, స్వీట్ షాపులు, బేకరీలు, రెస్టారెంట్లు) ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు.

అధికారులే ఆశ్చర్యపోయేలా..

ఆయా స్వీట్లు, ఖారా తయారీ కేంద్రాల్లో అపరిశుభ్రమైన వాతావరణం చూసి అధికారులే ముక్కున వేలేసుకున్నారు. వంటగదుల్లో నేలపై వ్యర్థాలతో దుర్వాసన, బొద్దింకలు, ఈగలు, ఎలుకలు స్వేచ్ఛగా తయారీ కేంద్రాల్లో తిరుగుతుండడం అధికారులకు కనిపించింది. స్వీట్లు తయారు చేసిన ప్రాంతంలోనే ఎలుకల విసర్జితాలు ఉండడం, బొద్దింకలు తిరుగుతుండడం చూసిన అధికారులు స్వీట్లు శాంపిళ్లను తీసుకుని.. వాటిని సిబ్బంది చేత బయట పారేయించారు. ఇక ఫ్రిడ్జ్‌లలో రోజుల తరబడి ఉంచిన ఆహార పదార్థాలు ఉండి దుర్వాసన వస్తుండడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సిబ్బందికి మాస్కులు లేవు.. గ్లౌజ్‌లు లేవు..

తయారీ కేంద్రాల్లో స్వీట్లు, కారా తయారుచేసే వ్యక్తులు కనీసం గ్లౌజ్‌లు, మాస్కులు లేకపోవడం అధికారుల దృష్టికి వచ్చింది. ఆహార పదార్థాలు తయారుచేసిన తర్వాత వాటిపై న్యూస్ పేపర్లు కప్పి ఉంచడాన్ని అధికారులు పరిశీలించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను ఎక్కువకాలం నిల్వ ఉంచడాన్ని అధికారులు నోట్ చేసుకున్నారు. సిబ్బంది కనీసం గ్లౌజ్‌లు, మాస్కులు ఇవ్వకపోవడంపై ఆయా స్వీట్లు, కారా దుకాణాల యజమానులపై అధికారులు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

26 దుకాణాల్లో శాంపిళ్ల సేకరణ..

కల్తీపై అనుమానంతో మొత్తం 26 నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 9,645 కిలోల ఆహార పదార్థాలను అధికారులు సీజ్ చేసి ధ్వంసం చేశారు. వీటి విలువ సుమారు రూ. 17,28,495/- ఉంటుందని అంచనా. సరైన ఖీూూ× లైసెన్సులు లేకుండా నడుస్తున్న మహారాజా స్వీట్ & బేక్స్ (మిర్చి కాంపౌండ్), పంచవటి స్వీట్స్ (దుబ్బ), శివ శక్తి ఐస్ క్రీమ్ (దుబ్బ), సాగర్ బేకరీ (ఆటోనగర్) ని తక్షణమే మూసివేయించారు.

13 సంస్థల లైసెన్సులు సస్పెన్షన్

ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చప్పన్ భోగ్ స్వీట్స్, రాధే మిఠాయి వాటిక, శ్రీ రాధే ఎంటర్‌ప్రైజెస్, ఎల్‌పీ ప్రొడక్ట్స్, జునైరా ఫ్యామిలీ రెస్టారెంట్, ఖురేషియా హోటల్, వాటర్ సొల్యూషన్ కంపెనీ, జనతా ట్రేడర్స్, ఐరా ఫుడ్స్ & బెవరేజెస్, సుఖ్‌జిత్ స్టార్చ్ మిల్స్, శ్రీ అయ్యప్ప ట్రేడర్స్, మొఘ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, క్వాలిటీ స్వీట్స్ & చిక్కి/కెకె స్వీట్స్ సంస్థల లైసెన్సులను సస్పెండ్ చేస్తూ వ్యాపార కార్యకలాపాలను నిలిపివేయాలని ఆదేశించారు. అలాగే నిబంధనలు ఉల్లంఘించిన మరో 12 సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేయగా, స్వల్ప లోపాలున్న మరో 3 సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, భవిష్యత్తులోనూ ఇటువంటి దాడులు కొనసాగుతాయని టీజీ సేఫ్ కమిషనర్ హెచ్చరించారు.

నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టీకరణ



నిజామాబాద్, నవంబర్ 05 :(విజన్ ఆంధ్ర) ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ అధ్యక్షతన క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్టు అమలుపై సమావేశం జరిగింది. జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్ గురించి కలెక్టర్ సమీక్షించారు. ప్రతి ఆసుపత్రి తప్పనిసరిగా జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కింద రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణ తీరు పట్ల ప్రత్యేక పర్యవేక్షణ జరుపుతూ, నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. అన్ని నిబంధనలు పాటించే ఆసుపత్రులకే అనుమతులు, రెన్యూవల్స్ చేయాలని సూచించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ నిబంధనలు పాటించని ఆసుపత్రులకు అనుమతులు మంజూరు చేయకూడదని, నిబంధలకు అనుగుణంగా సదుపాయాలు కలిగి ఉన్న వారికి నిర్దేశిత గడువులోపు అనుమతులు మంజూరు చేయాలని, ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని, ఎవరైనా అవకతవకలకు ఆస్కారం కల్పించినట్లు ఫిర్యాదులు వస్తే ఎంతమాత్రం ఉపేక్షించబోమని, బాధ్యులైన అధికారులు, సిబ్బందిని ఉద్యోగాల నుండి తొలగించేందుకు కూడా వెనుకాడబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏవైనా ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ లేకుండా కొనసాగుతున్నట్లు అయితే వెంటనే నిర్వాహకులకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా, ప్రభుత్వం రూపొందించిన కొత్త నిబంధనలపై ఆసుపత్రుల నిర్వాహకులు అవగాహన పెంపొందించుకుని, వాటిని తుచ తప్పకుండా పాటించేలా చూడాలన్నారు. పార్కింగ్ ఏరియా, అగ్ని ప్రమాద నివారణ జాగ్రత్తలు వంటివి విధిగా పాటించాలని, అన్ని ఆసుపత్రుల్లో వైద్య రుసుముల వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్.ఎం.పి.వైద్యుల పట్ల నిఘా పెంచి అర్హత లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తున్న వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాగా, రోడ్డు ప్రమాద బాధితులకు పీ.ఎం రాహత్ పథకం కింద తక్షణ వైద్య సేవలు అందించేందుకు ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు చొరవ చూపాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ, వైద్య వ్యవస్థ ప్రతిష్టను పెంపొందించేలా కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, నిజామాబాద్, బోధన్ ఐ.ఎం.ఏ శాఖల అధ్యక్షులు డాక్టర్ విశాల్, డాక్టర్ ముకరంజా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భద్రత, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా,నవంబర్ 05(విజన్ ఆంధ్ర); రానున్న గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పుష్కరాల నిర్వహణకు ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాసరతో పాటు జిల్లాలోని పుష్కర ప్రాంతాల్లో భక్తులు సౌకర్యవంతంగా పుణ్యస్నానాలు ఆచరించేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృతంగా పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని, స్పష్టమైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పుష్కర ఘాట్ల వద్ద నిరంతరం పారిశుధ్య నిర్వహణ చేపట్టడంతో పాటు, భక్తులకు మార్గనిర్దేశం చేసేందుకు అవసరమైన చోట్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులతో పాటు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి కూడా అవసరమైన వసతులు కల్పించాలని తెలిపారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. పుష్కర ప్రాంతాల్లో అవసరమైన అన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ ఈఈలు సందీప్, సుభాష్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్రిశూల వైన్స్‌లో ‘టెన్’ రుపీస్ దందా!

- ఎమ్మార్పీ బోర్డులు ఉత్సవ విగ్రహాలేనా?
- బాధితుడు భూక్య ప్రవీణ్ సంచలన ఆరోపణలు!
- ఫంక్షన్ కోసం వెళ్తే ‘ఎక్స్‌ట్రా’ బాదుడు.. నిలదీస్తే సరుకు లేదంటూ దౌర్జన్యం!
- సీసీ కెమెరా విజువల్స్ పరిశీలిస్తే నిజాలు బయటపడతాయి: బాధితుడి డిమాండ్
- పత్రికల్లో వార్తలు వస్తున్నా నిమ్మకు నీరెత్తిన ఎక్సైజ్ శాఖ.. కలెక్టర్ గారైనా స్పందించేనా?



పెన్ పహాడ్, నవంబర్ 5(విజన్ ఆంధ్ర) : మండల కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి సాగుతున్న మద్యం అక్రమ వసూళ్ల పర్వం ఇప్పుడు స్థానికంగా పెను కలకలం రేపుతోంది. ఎమ్మార్పీ ధరల కంటే అదనపు వసూళ్లకు పాల్పడుతూ సామాన్య ప్రజలను నిలువునా దోచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రంలోని త్రిశూల వైన్స్ లో జరుగుతున్న ఈ బహిరంగ దోపిడీపై గురువారం దుబ్బ తండ గ్రామానికి చెందిన భూక్య ప్రవీణ్ అనే వ్యక్తి విలేకరుల ముందు చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో, స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.బాధితుడు భూక్య ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం... తన ఇంట్లో జరిగే ఒక శుభకార్యం (ఫంక్షన్) నిమిత్తం ఎక్కువ మొత్తంలో మద్యం కొనుగోలు చేయడానికి ఆయన త్రిశూల వైన్స్‌కు వెళ్లారు. అయితే, అక్కడ కౌంటర్ లో ఉన్న సిబ్బంది ప్రతి సీసాపై ఎమ్మార్పీ రేటు కంటే అదనంగా పది రూపాయలు చెల్లించాల్సిందేనని తెగేసి చెప్పినట్లు ఆయన ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ఎందుకు ఇవ్వాలని నిలదీయగా... అదనపు డబ్బులు ఇస్తేనే సరుకు ఇస్తామని, లేదంటే ఇక్కడి నుంచి వెళ్ళిపోవాలంటూ సిబ్బంది దురుసుగా సమాధానం ఇచ్చినట్లు ప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒకరిద్దరి సమస్య కాదని, ప్రతిరోజూ వందలాది మంది వినియోగదారులపై జరుగుతున్న నిలువు దోపిడీ అని ఆయన మండిపడ్డారు.ఈ సందర్భంగా భూక్య ప్రవీణ్ అధికారులకు ఒక కీలక విజ్ఞప్తి చేశారు. మద్యం దుకాణంలో జరుగుతున్న ఈ అక్రమ వసూళ్లకు సంబంధించి అక్కడ ఉన్న సీసీ కెమెరా రికార్డుల ఆధారంగా పూర్తిస్థాయి విచారణ జరపాలని ఆయన కోరారు. సీసీటీవీ ఫుటేజ్ ని నిష్పక్షపాతంగా పరిశీలిస్తే వినియోగదారులను నిర్వాహకులు ఎలా ఇబ్బంది పెడుతున్నారు, ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేట్లకు ఎలా విక్రయిస్తున్నారనే నిజాలు పూర్తిగా బయటపడతాయని, తద్వారా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. వినియోగదారుల నుంచి ముక్కుపిండి అదనపు వసూళ్లకు పాల్పడుతున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. పలు దినపత్రికల్లో ఈ అక్రమాలపై వరుస కథనాలు వస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు కళ్ళుండీ చూడలేని కబోదుల్లా వ్యవహరిస్తున్నారని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఉదాసీనత వల్లే మద్యం వ్యాపారులు ఇంతలా రెచ్చిపోతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కలెక్టర్ గారు స్పందించి అడ్డుకట్ట వేయాలి!

మండల కేంద్రంలో సాగుతున్న ఈ మద్యం అక్రమ వసూళ్ల దందాపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని సామాజికవేత్తలు, బాధితులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక అధికారులు మత్తులో జోగుతున్నారనే విమర్శలు వస్తున్న నేపథ్యంలో... కనీసం జిల్లా కలెక్టర్ గారైనా ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి, త్రిశూల వైన్స్ పై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

ఆర్వోబీ వద్ద బాజిరెడ్డి గోవర్ధన్ చిత్రపటానికి పాలాభిషేకం



నిజామాబాద్ నవంబర్05:(విజన్ ఆంధ్ర) నిజామాబాద్ నగర శివారులోని మాధవనగర్ ఆర్వోబీ వద్ద రూరల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రూరల్ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాజిడ్డి జగన్మోహన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఆర్వోబీకి 60శాతం నిధులు బీఆర్ఎస్ హయాంలోనే..ఈ సందర్భంగా బాజిరెడ్డి జగన్మోహన్ మాట్లాడుతూ.. 201516లో బీఆర్ఎస్ హయాంలోనే రైల్వే ఓవర్ వంతెన వద్ద 60శాతం నిధులు మంజూరయ్యాయన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు అప్పటి రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నిధుల సమీకరణలో తీవ్రంగా కృషి చేసి సాధించారన్నారు. అప్పటి ఎంపీ కవిత హయాంలో ఈ నిధులు వచ్చాయన్నారు. కాని ప్రస్తుత కాంగ్రెస్,బీజేపీ పార్టీలు ఆర్వోబీని తామే సాధించాయని గొప్పులు చెప్పుకుంటున్నాయని ఎద్దేవా చేశారు. ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని.. ఆర్వోబీకీ బీజం పడితే బీఆర్ఎస్ హయాంలోని జగన్మోహన్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాజిరెడ్డి రమాకాంత్, తిర్మల్ పటేల్, పద్మారావు, అజయ్, రంగా, బంటు దాస్, ఖానాపూర్ హరి, బాజిరెడ్డి రమాకాంత్, బట్టు సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల ఔషధాల నిల్వకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా,నవంబర్ 05(విజన్ ఆంధ్ర); ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన ఔషధాలను వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) భవనంలో నిల్వ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని టగుల్జార్ మార్కెట్ ఏరియాఊ వైద్య విధాన పరిషత్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం వైద్య కళాశాల అనాటమీ విభాగంలో నిల్వ ఉంచిన ఔషధాలను అవసరాలకు అనుగుణంగా టీవీవీపీ భవనానికి తరలించాలని సూచించారు. ఔషధాల అవసరం, ప్రాధాన్యత ఆధారంగా క్రమబద్ధంగా నిల్వ చేయాలని, వాటి సరఫరా, నిర్వహణకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఔషధాలు పాడవకుండా సురక్షితమైన ప్రదేశంలో భద్రపరచాలని, నిల్వ కేంద్రానికి అవసరమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, డీసీహెచ్ఎస్ కాశీనాథ్, అధికారులు సౌమ్య, వంశీ మాధవ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న అక్కల సురేష్



కీసర, నవంబర్ 5, విజన్ ఆంధ్ర : పది రోజుల క్రితం అన్నంరాజు అంజమ్మ ఇంట్లో దొంగతనం జరిగి, రూ. 30 వేల నగదుతో పాటు జీవనోపాధికి ఆధారమైన ఇస్త్రీ పెట్టెను కూడా దొంగలు ఎత్తుకెళ్లారు.సహాయం తీసుకోవడానికి కూడా ఎంతో మొహమాటపడిన అంజమ్మ ఆత్మగౌరవాన్ని గౌరవిస్తూ సామాజిక కార్యకర్త అక్కల సురేష్ రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు.

తెలంగాణలో బీజేపీకి కొత్త బాస్ ఎవరు?



ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత రాష్ట్ర అధ్యక్షుడిని మార్చి, కొత్త ఉత్సాహంతో, కొత్త వ్యూహంతో 2029 ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసిన వెంటనే ఈ నిర్ణయం వెలువడే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఢిల్లీలో ఈ విషయంపై అనేక సమావేశాలు జరిగినట్లు తెలుస్తోంది. రాష్ట్ర నేతలతో ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడి అభిప్రాయాలు తీసుకుంటున్నారని సమాచారం.

రేసులో ఇద్దరు కాదు.. ఐదుగురు!

మొదట్లో రాష్ట్ర అధ్యక్షుడి రేసులో బండి సంజయ్, ఈటల రాజేందర్ ఇద్దరి పేర్లు మాత్రమే వినిపించాయి. కానీ ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం వారిద్దరితో పాటు మరో ముగ్గురు బలమైన నేతల పేర్లను కూడా కేంద్రం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

వారే.. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, ఎంపీ డి.కె. అరుణ.

అంటే మొత్తం ఐదుగురు నేతల పేర్లు ఇప్పుడు కేంద్ర నాయకత్వం ముందు ఉన్నాయి. ఈ ఐదుగురిలో ఎవరికి పట్టం కట్టినా పార్టీకి మేలు జరుగుతుందని, ఎవరికి వారు తమదైన బలం, అనుభవం, జనాకర్షణ ఉన్న నేతలే అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే కేంద్రం చాలా జాగ్రత్తగా, సర్వేలు చేయించి మరీ నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో జిల్లాలో, ఒక్కో నియోజకవర్గంలో ఈ ఐదుగురి పట్ల ప్రజల అభిప్రాయం ఎలా ఉందో తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని చెబుతున్నారు.

బండి సంజయ్ కు మళ్లీ పగ్గాలు?
ఫైర్ బ్రాండ్ కు మళ్లీ ఛాన్స్?



మళ్లీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పగిస్తే అధికారంలోకి రావడానికి మరింత బలం చేకూరుతుందని పార్టీలో ఒక వర్గం గట్టిగా ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

బండి సంజయ్ గతంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పార్టీకి మంచి పట్టు పెరిగింది. ఆయన నాయకత్వంలో హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ భారీ విజయం సాధించింది. గ్రేటర్ హైదరాబాద్ లో 48 కార్పొరేటర్ సీట్లు గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. అప్పటివరకు హైదరాబాద్ లో బలహీనంగా ఉన్న బీజేపీ, ఒక్కసారిగా బలమైన శక్తిగా ఎదిగింది. అది బండి సంజయ్ దూకుడు, పోరాట పటిమ వల్లే సాధ్యమైందని ఆయన అభిమానులు చెబుతారు.

అంతేకాదు, బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే దుబ్బాక ఉప ఎన్నిక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం, జోష్ పెరిగింది. ప్రతి గ్రామంలో, ప్రతి మండలంలో బీజేపీ జెండా కనిపించే పరిస్థితి వచ్చింది. యువకులు పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. బండి సంజయ్ ప్రసంగాలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆయన మాట్లాడితే చాలు, సభలకు జనం పోటెత్తేవారు.

బండి సంజయ్ ఒక ఫైర్ బ్రాండ్ నేత. ఆయన మాట తీరు, దూకుడు, నేరుగా ప్రత్యర్థులపై విరుచుకుపడే శైలి పార్టీ కార్యకర్తలకు ఎంతో నచ్చుతుంది. కార్యకర్తల కోసం నిలబడే నేతగా ఆయనకు పేరు ఉంది. ఎవరైనా కార్యకర్తపై దాడి జరిగితే వెంటనే స్పందించి, అక్కడికి వెళ్లి అండగా నిలబడతారు. అందుకే కింది స్థాయి కార్యకర్తల్లో ఆయనకు విపరీతమైన అభిమానం ఉంది. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా బండి సంజయ్ అండగా ఉంటారనే నమ్మకం వారిలో ఉంది.

మళ్లీ పార్టీ పుంజుకోవాలన్నా, పార్టీ బలం పెరగాలన్నా బండికే పట్టం కట్టాలని ఆ వర్గం చూస్తున్నట్లు తెలుస్తోంది. బండి సంజయ్ వస్తేనే పార్టీలో జోష్ వస్తుందని, కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేస్తారని, 2029 ఎన్నికల్లో గెలుపు సాధ్యమవుతుందని వారు భావిస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్నా, రాష్ట్ర రాజకీయాలపై ఆయనకు పూర్తి పట్టు ఉందని, రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ పరిస్థితి ఆయనకు తెలుసని చెబుతున్నారు.

మరోవైపు బండి సంజయ్ కు ఆర్ఎస్ఎస్, బీజేపీ కేంద్ర నాయకత్వంతో కూడా మంచి సంబంధాలు ఉన్నాయి. ఆయన నిబద్ధత, క్రమశిక్షణ, హిందుత్వ అంశాలపై స్పష్టమైన వైఖరి కేంద్ర నాయకత్వానికి నచ్చే అంశాలు. కరీంనగర్ ఎంపీగా ఆయనకు తెలంగాణ ఉత్తర భాగంలో బలమైన పట్టు ఉంది. బీసీ వర్గాల్లో కూడా ఆయనకు మంచి ఆదరణ ఉంది. అందుకే బండి సంజయ్ పేరు మళ్లీ ముందు వరుసలో ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఈటల రాజేందర్.. మరో బలమైన పోటీదారు, జన నాయకుడు

అయితే రాష్ట్ర అధ్యక్షునిగా బండితో పాటు ఈటల రాజేందర్ పేరు కూడా ప్రస్తావనలోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈటల రాజేందర్ కూడా మంచి జన నాయకుడిగా పేరున్న వ్యక్తి. తెలంగాణ ఉద్యమం నుంచి ఆయనకు ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. మంత్రిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా ఆయన చేసిన సేవలు ప్రజలకు తెలుసు. ఆయన ఒకప్పుడు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఆర్థిక మంత్రిగా, ఆరోగ్య మంత్రిగా ఆయన పనితీరుకు ప్రజల్లో మంచి పేరు ఉంది.

ఈటల రాజేందర్ కు రాష్ట్ర పగ్గాలు అప్పజెప్పితే మరింత బలం పుంజుకుంటుందని మరో వర్గం భావిస్తోంది. ఈటలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి మంచి సంబంధాలు ఉన్నాయి. ఆ పార్టీల నుంచి కూడా నేతలను బీజేపీలోకి తీసుకురావచ్చనే ఆలోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. ఈటల రాజేందర్ వస్తే ఇతర పార్టీల్లో అసంతృప్తితో ఉన్న నేతలు బీజేపీ వైపు చూస్తారని, పార్టీలో చేరికలు పెరుగుతాయని ఆ వర్గం చెబుతోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ లో అసంతృప్తితో ఉన్న చాలా మంది నేతలు ఈటల వస్తే బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని కూడా ప్రచారం జరుగుతోంది.

ఈటల రాజేందర్ ఒక సౌమ్యమైన, అనుభవజ్ఞుడైన నేత. ఆయన మాట్లాడే తీరు, ప్రజలతో కలిసిపోయే తత్వం, పరిపాలన అనుభవం ఆయనకు ప్లస్ పాయింట్లు. తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలతో ఆయనకు సత్సంబంధాలు ఉన్నాయి. బీసీ వర్గాల్లో ఆయనకు మంచి పట్టు ఉంది. రైతులు, కార్మికులు, ఉద్యోగులు అందరిలో ఆయనకు ఆదరణ ఉంది. హుజూరాబాద్ లో ఆయన సాధించిన విజయాలు ఆయన జనాకర్షణకు నిదర్శనం. స్వతంత్రంగా పోటీ చేసినా గెలిచే సత్తా ఉన్న నేతగా ఆయనకు పేరు ఉంది.

ఈటల రాజేందర్ కు పార్టీ పగ్గాలు అప్పజెప్పాలని కేంద్రంలోని కొంతమంది పెద్దలు మోడీకి, అమిత్ షాకు వివరించినట్లు తెలుస్తోంది. ఈటల వస్తే తెలంగాణలో బీసీ, అన్ని వర్గాల ఓట్లు బీజేపీ వైపు మళ్లుతాయని, పార్టీ విస్తరణకు ఎంతో ఉపయోగపడుతుందని వారు చెప్పినట్లు సమాచారం. ఈటల రాజేందర్ ఒకప్పుడు బీఆర్ఎస్ లో కీలక నేతగా ఉన్నారు. ఆ పార్టీ నిర్మాణం, వ్యూహాలు ఆయనకు బాగా తెలుసు. అది బీజేపీకి ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

అంతేకాదు, ఈటల రాజేందర్ పార్లమెంట్ లో కూడా తెలంగాణ సమస్యలపై గట్టిగా మాట్లాడుతున్నారు. కేంద్రంతో మంచి సంబంధాలు కొనసాగిస్తూనే, రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్నారు. ఆయన నాయకత్వంలో పార్టీ మరింత విస్తరిస్తుందని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు.

జి. కిషన్ రెడ్డి.. సీనియర్, అనుభవశాలి, ?
అందరికీ ఆమోదయోగ్యుడు



ఈ రేసులో మూడో బలమైన పేరు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి. తెలంగాణ బీజేపీ అంటేనే కిషన్ రెడ్డి అనేంతగా ఆయనకు పార్టీలో గుర్తింపు ఉంది. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన సీనియర్ నేత. అంబర్ పేట్ ఎమ్మెల్యేగా, రాష్ట్ర అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా ఆయనకు విస్తృత అనుభవం ఉంది. విద్యార్థి దశ నుంచే ఆయన బీజేపీ, ఏబీవీపీలో పనిచేశారు. పార్టీని కష్టకాలంలో కూడా నిలబెట్టిన నేతగా ఆయనకు పేరు ఉంది.

కిషన్ రెడ్డి వస్తే పార్టీలో అందరినీ కలుపుకుని వెళ్లగలరని, సీనియర్లు, జూనియర్లు అందరికీ ఆమోదయోగ్యమైన నేతగా ఉంటారని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు. హైదరాబాద్ లో ఆయనకు బలమైన పట్టు ఉంది. కేంద్రంతో నేరుగా సంబంధాలు, మోడీ-షాలకు అత్యంత నమ్మకస్తుడిగా ఉండటం ఆయనకు పెద్ద ప్లస్. తెలంగాణకు కేంద్ర నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడంలో ఆయన పాత్ర కీలకమని చెబుతున్నారు. అందుకే కిషన్ రెడ్డి పేరు కూడా కేంద్రం పరిశీలనలో ఉందని తెలుస్తోంది.

కిషన్ రెడ్డి సౌమ్యుడు, వివాదాలకు దూరంగా ఉంటారు. అన్ని వర్గాలతో మంచి సంబంధాలు కొనసాగిస్తారు. సికింద్రాబాద్ ఎంపీగా ఆయన ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటారు. పార్టీలో ఎవరికైనా సమస్య వస్తే ఆయన దగ్గరకు వెళ్లి చెప్పుకోవచ్చనే నమ్మకం ఉంది. అందుకే కిషన్ రెడ్డి అయితే పార్టీలో గ్రూపులు ఉండవని, అందరూ కలిసి పనిచేస్తారని ఆ వర్గం చెబుతోంది.

ఎన్. రామచందర్ రావు..
ప్రస్తుత అధ్యక్షుడికే కొనసాగింపా?

ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పేరు కూడా పరిశీలనలో ఉందని తెలుస్తోంది. ఆయన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీలో సంస్థాగతంగా మార్పులు తీసుకొచ్చారు. బూత్ స్థాయి కమిటీల ఏర్పాటు, కార్యకర్తల శిక్షణ, క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇచ్చారు. పార్టీ కార్యాలయంలో క్రమం తప్పకుండా సమావేశాలు, కార్యకర్తలతో మాట్లాడటం, జిల్లాల పర్యటనలు చేస్తూ పార్టీని బలోపేతం చేసే



ప్రయత్నం చేస్తున్నారు.

రామచందర్ రావు ఒక న్యాయవాది, సిద్ధాంతపరంగా బలమైన నేత. ఆర్ఎస్ఎస్ నేపథ్యం నుంచి వచ్చిన ఆయనకు పార్టీ సిద్ధాంతాలపై పూర్తి అవగాహన ఉంది. వివాదాలకు దూరంగా, అందరితో సామరస్యంగా వెళ్లే తత్వం ఆయన సొంతం. అందుకే ఆయనకే మరోసారి అవకాశం ఇచ్చి కొనసాగించాలని కూడా ఒక వర్గం కోరుతున్నట్లు తెలుస్తోంది. మధ్యలో మార్చడం కంటే ఆయనకే పూర్తి సమయం ఇస్తే 2029 నాటికి పార్టీ మరింత బలపడుతుందని వారు వాదిస్తున్నారు.

రామచందర్ రావు హయాంలోనే బీజేపీ లోక్ సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించింది. పార్టీలో కొత్త నేతలు చేరారు. సంస్థాగతంగా పార్టీ బలపడింది. అందుకే ఆయనను మార్చడం కంటే కొనసాగించడం మంచిదని కొందరు సీనియర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే మరికొందరు మాత్రం జనాకర్షణ ఉన్న నేత కావాలని, రామచందర్ రావు కంటే దూకుడు ఉన్న నేత అవసరమని అంటున్నారు. ఈ రెండు అభిప్రాయాల మధ్య కేంద్రం తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం.

డి.కె. అరుణ.. మహిళా నేతగా బలమైన పోటీ,
పాలమూరు బిడ్డ



ఈ రేసులో ఐదో పేరు, ఏకైక మహిళా నేత డి.కె. అరుణ. మహబూబ్ నగర్ ఎంపీగా, మాజీ మంత్రిగా ఆమెకు తెలంగాణ రాజకీయాల్లో మంచి పేరు ఉంది. పాలమూరు జిల్లాలో ఆమెకు తిరుగులేని పట్టు ఉంది. పాలమూరు అంటే డి.కె. అరుణ అనేంతగా ఆమెకు అక్కడ గుర్తింపు ఉంది.

డి.కె. అరుణకు రాష్ట్ర పగ్గాలు అప్పజెప్పితే మహిళా ఓటర్లు, రైతు వర్గాలు బీజేపీ వైపు మళ్లుతాయని ఆ వర్గం భావిస్తోంది. ఆమె ఒక పోరాట యోధురాలిగా, నేరుగా ప్రజల్లోకి వెళ్లే నేతగా పేరు పొందారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లో ఉన్నప్పుడు కూడా ఆమెకు అన్ని పార్టీలతో మంచి సంబంధాలు ఉన్నాయి. మహిళా నేతకు పగ్గాలు ఇస్తే తెలంగాణలో బీజేపీకి కొత్త ఇమేజ్ వస్తుందని, మహిళా సాధికారత అంశం ముందుకు వెళ్తుందని కేంద్రంలోని కొందరు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

డి.కె. అరుణ గద్వాల సంస్థాన కుటుంబం నుంచి వచ్చినా, ఎప్పుడూ ప్రజలతోనే ఉంటారు. రైతుల సమస్యలపై, పాలమూరు ప్రాజెక్టులపై ఆమె ఎప్పుడూ గట్టిగా మాట్లాడుతారు. మహిళా సమస్యలపై ఆమెకు ప్రత్యేక అవగాహన ఉంది. తెలంగాణలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మహిళా నేతకు పగ్గాలు ఇస్తే పార్టీకి కలిసి వస్తుందని ఆ వర్గం చెబుతోంది. అంతేకాదు, ఆమెకు రెడ్డి సామాజిక వర్గంలో కూడా మంచి పట్టు ఉందని చెబుతున్నారు.

ఐదుగురిలో ఎవరు? నిర్ణయం కేంద్రానిదే

మొత్తం మీద చూస్తే బండి సంజయ్, ఈటల రాజేందర్, కిషన్ రెడ్డి, రామచందర్ రావు, డి.కె. అరుణ.. ఈ ఐదుగురూ తమదైన శైలిలో బలమైన నేతలే.

బండి సంజయ్ అంటే దూకుడు, జోష్, కార్యకర్తల బలం. ఈటల రాజేందర్ అంటే అనుభవం, సౌమ్యత, అన్ని పార్టీలతో సంబంధాలు. కిషన్ రెడ్డి అంటే సీనియారిటీ, కేంద్రంతో అనుబంధం, హైదరాబాద్ పట్టు. రామచందర్ రావు అంటే సంస్థాగత బలోపేతం, క్రమశిక్షణ, సిద్ధాంత బలం. డి.కె. అరుణ అంటే మహిళా నాయకత్వం, పాలమూరు పట్టు, ప్రజల్లోకి వెళ్లే తత్వం.

ఐదుగురిలో ఎవరికి పగ్గాలు అప్పగించినా పార్టీకి మేలు జరుగుతుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. కేంద్ర నాయకత్వం కూడా ఈ ఐదుగురి పేర్లను సమానంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరికి పట్టం కడితే 2029 ఎన్నికల్లో ఎక్కువ సీట్లు వస్తాయి? ఎవరి నాయకత్వంలో బూత్ స్థాయి నుంచి పార్టీ బలపడుతుంది? ఎవరి వల్ల ఇతర పార్టీల నుంచి చేరికలు పెరుగుతాయి? ఎవరి వల్ల యువత, మహిళలు పార్టీ వైపు వస్తారు? అనే అంశాలపై సర్వేలు కూడా చేయిస్తున్నట్లు సమాచారం.

కేంద్రంలో ఏం జరుగుతోంది?

ఢిల్లీలో బీజేపీ కేంద్ర నాయకత్వం తెలంగాణ విషయంలో చాలా సీరియస్ గా ఉందని తెలుస్తోంది. ప్రధాని మోడీ, అమిత్ షా, జేపీ నడ్డా, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శులు తెలంగాణపై ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహిస్తున్నారని సమాచారం. తెలంగాణలోని ప్రతి జిల్లా, ప్రతి నియోజకవర్గ పరిస్థితిని వారు అడిగి తెలుసుకుంటున్నారని చెబుతున్నారు. రాష్ట్ర నేతలతో, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులతో, సర్వే సంస్థలతో చర్చలు జరుపుతున్నారు.

తెలంగాణలో బీజేపీ గెలవాలంటే కేవలం హిందుత్వం చాలదని, అభివృద్ధి, సంక్షేమం, యువతకు ఉద్యోగాలు, రైతులకు మద్దతు వంటి అంశాలపై కూడా దృష్టి పెట్టాలని కేంద్రం భావిస్తోంది. అందుకే అన్ని వర్గాలను కలుపుకుని వెళ్లగల నాయకుడిని ఎంచుకోవాలని చూస్తోంది. కుల సమీకరణాలు, ప్రాంతీయ సమతుల్యత, వయసు, అనుభవం అన్నీ పరిగణనలోకి తీసుకుంటోంది.

మోడీ-షా పర్యటనలు ముమ్మరం

మొత్తం మీద తెలంగాణపై బీజేపీ జెండా ఎగరాలనే ఉద్దేశంతో మోడీ, అమిత్ షా పర్యటనలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల తెలంగాణలో ప్రధాని మోడీ, అమిత్ షా పర్యటనలు పెరిగాయి. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, బహిరంగ సభల ద్వారా తెలంగాణ ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం ద్వారా ప్రజల్లో బీజేపీ పట్ల నమ్మకం పెంచే ప్రయత్నం జరుగుతోంది.

ప్రధాని మోడీ తెలంగాణకు వచ్చిన ప్రతిసారీ తెలంగాణ భాషలో మాట్లాడి, తెలంగాణ సంస్కృతిని గౌరవిస్తూ ప్రజల మనసు గెలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. అమిత్ షా కూడా తెలంగాణలో బూత్ స్థాయి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ, పార్టీ నిర్మాణంపై దృష్టి పెడుతున్నారు. వారి పర్యటనలు తెలంగాణలో బీజేపీకి ఎంతో ఉత్సాహాన్ని ఇస్తున్నాయి.

కాంగ్రెస్, బీఆర్ఎస్ ల పరిస్థితి ఏమిటి?

తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్నా, ప్రజల్లో ఆ పార్టీ పట్ల అసంతృప్తి పెరుగుతోందని బీజేపీ భావిస్తోంది. ఇచ్చిన హామీలు నెరవేర్చలేదనే విమర్శలు ఉన్నాయి. బీఆర్ఎస్ కూడా గత పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని చెబుతున్నారు. ఈ రెండు పార్టీలపై ఉన్న అసంతృప్తిని తనకు అనుకూలంగా మార్చుకుంటేనే బీజేపీ అధికారంలోకి రాగలదని కేంద్రం భావిస్తోంది. అందుకే ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా పోషిస్తూ, ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచిస్తోంది. 2029 నాటికి బీజేపీ అధికారంలోకి వస్తుందా? మరి 2029 ఎన్నికల నాటికి బీజేపీ పుంజుకుంటుందా? అధికారంలోకి వస్తుందా లేదా అనేది వేచి చూడాల్సి వస్తుంది. కానీ ఒక్క విషయం మాత్రం స్పష్టం. తెలంగాణలో బీజేపీ ఇకపై కేవలం ప్రతిపక్షంగా ఉండదు. అధికారమే లక్ష్యంగా ముందుకు వెళ్తుంది. రాష్ట్ర అధ్యక్షుడి మార్పు అనేది ఆ దిశగా వేసే మొదటి అడుగు మాత్రమే.

రాష్ట్ర అధ్యక్షుడు ఎవరైనా, పార్టీ మొత్తం ఒక్కటిగా పనిచేస్తేనే విజయం సాధ్యమవుతుంది. ఐదుగురు నేతల అభిమానుల మధ్య భేదాలు లేకుండా అందరూ కలిసి పనిచేస్తేనే 2029 లో కాషాయ జెండా ఎగురుతుంది. పార్టీలోని సీనియర్ నేతలు కూడా అదే చెబుతున్నారు. ఎవరికి పట్టం కట్టినా, మిగిలిన వారు కలిసి పనిచేయాలని, పార్టీ గెలుపే ముఖ్యమని వారు సూచిస్తున్నారు. గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టి, పార్టీ కోసం పనిచేస్తేనే విజయం సాధ్యమని వారు హెచ్చరిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత కేంద్ర నాయకత్వం ఎవరి పేరును ప్రకటిస్తుందో అనే దానిపై ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. బండి సంజయ్ కు మళ్లీ అవకాశం వస్తుందా? లేక ఈటల రాజేందర్ కు కొత్త బాధ్యతలు అప్పగిస్తారా? లేక కిషన్ రెడ్డి, రామచందర్ రావు, డి.కె. అరుణలలో ఎవరికైనా పట్టం కడతారా? లేక అందరినీ ఆశ్చర్యపరుస్తూ ఆరో వ్యక్తికి అవకాశం వస్తుందా? అనే ప్రశ్నలకు సమాధానం కోసం అందరూ ఎదురుచూస్తున్నారు.

ఏది ఏమైనా తెలంగాణ రాజకీయాల్లో రాబోయే రోజులు ఎంతో ఆసక్తికరంగా ఉండబోతున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పు తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్నే మార్చే అవకాశం ఉంది. తెలంగాణ ప్రజలు కూడా ఏం జరుగుతుందో ఆసక్తిగా గమనిస్తున్నారు. వేచి చూడాలి.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు...

మల్కాజిగిరి, నవంబర్ 5, విజన్ ఆంధ్ర: నేరేడ్ మెట్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మత్తు పనులు కారణంగా ఈ నెల 6వ తేది అంటే శుక్రవారం కింది ఫీడర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఏఈ జి.లత ఒక ప్రకటనలో తెలిపారు. వాజ్‌పేయి నగర్ ఎస్ ఎస్ నుండి వెలువడే 11 కేవీ ఆర్. కె.పురం ఫీడర్‌లో మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు ఆర్.కె.పురం, బాలాజీ కాలనీ, అంతయ్య కాలనీ, శ్రీ కాలనీ, జీ.కె.కాలనీ, అదే విధంగా 11 కేవీ బృందావన్ కాలనీ ఫీడర్‌లో మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు సప్తగిరి కాలనీ, జీకే కాలనీ, బృందావన్ కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. ఈ అసౌకర్యాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని ఏఈ జి.లత కోరారు

వినాయక నగర్ డివిజన్ కాకతీయ నగర్‌లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు!

- పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజల ఆగ్రహం.. పట్టించుకోని అధికారులు.



మల్కాజిగిరి: నవంబర్ 5, విజన్ ఆంధ్ర: వినాయక నగర్ డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ ఆనంద్ బాగ్, నేరేడ్మెట్ లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కాలనీలోని రహదారుల పక్కన ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త సంచులు, ఇతర వ్యర్థాలు రోడ్లపై పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్త కుప్పల వల్ల దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమలు, ఈగలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాకతీయ నగర్‌లో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని, ప్రతిరోజూ పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టి కాలనీలో పరిశుభ్రతను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజన విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట - మంత్రి సీతక్క




ములుగు (ఏటూరునాగారం) నవంబర్ 05 విజన్ ఆంధ్ర ప్రతినిధి: గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన మంత్రి, చదువులో విద్యార్థులు ముందుండేలా గురువులు కృషి చేయాలని సూచించారు. పిల్లల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని, మంచి ఫలితాలు తెచ్చిన పిల్లలను, గురువులను అభినందించాలని చెప్పారు.విద్యార్థుల సమస్యలు తెలిపేందుకు ఉచిత దూరవాణి సంఖ్య ॥1800-425-3369॥, చరవాణి సందేశ సంఖ్య ॥9493368361॥ లను మంత్రి ప్రారంభించారు. గురుకులాలు, వసతి గృహాల్లోని పిల్లలు తమ ఇబ్బందులను ఈ సంఖ్యల ద్వారా తెలపవచ్చని చెప్పారు.కార్యక్రమంలో గిరిజన అభివృద్ధి అధికారి లెనిన్ వత్సల్ టొప్పో, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు రేగా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్ ధరలను తగ్గించనున్న ప్రభుత్వం

- ప్రస్తుత ధరలు అధికంగా ఉన్నాయన్న ఫీడ్‌బ్యాక్‌తో ఈ నిర్ణయం
- రోజువారీ పాస్‌ను రూ.400 నుంచి రూ.325కి తగ్గించే అవకాశం
- నెలవారీ పాస్‌ను రూ.8,500 నుంచి రూ.4,000-4,500 మధ్యకు తగ్గింపు
- దీపావళి నుంచి సవరించిన కొత్త ధరలు అమల్లోకి వస్తాయని అంచనా



హైదరాబాద్ : నగర ప్రయాణికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఇటీవల ప్రవేశపెట్టిన కామన్ పాస్ ధరలను భారీగా తగ్గించాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు చాలా అధికంగా ఉన్నాయని ప్రయాణికుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టింది. సవరించిన ధరలు దీపావళి నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ కామన్ పాస్ ధరలు ప్రయాణికులకు భారంగా మారాయి. రోజువారీ పాస్ కోసం రూ.400, నెలవారీ పాస్ కోసం ఏకంగా రూ.8,500 చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఈ పాస్‌పై ప్రజల నుంచి ఆశించిన స్పందన రాలేదు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు, ధరలను సవరించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తాజా నివేదికల ప్రకారం రోజువారీ పాస్ ధరను రూ.400 నుంచి రూ.325కు తగ్గించనున్నారు. అదేవిధంగా, నెలవారీ పాస్ ధరను రూ.8,500 నుంచి సుమారు రూ.4,000 - రూ.4,500 మధ్యకు తీసుకురావాలని భావిస్తున్నారు. ఇది అమలైతే నెలవారీ పాస్ ధర దాదాపు సగానికి తగ్గుతుంది. ఈ ఉమ్మడి పాస్‌ను అక్టోబర్ ప్రారంభంలో ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. ఈ పాస్ ద్వారా ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలో మెట్రో రైళ్లు, ఆర్టీసీ సిటీ బస్సుల్లో (పుష్పక్ ఏసీ సర్వీసులు మినహా) అపరిమితంగా ప్రయాణించే సౌకర్యం ఉంటుంది. నగరంలో ప్రజా రవాణాను ప్రోత్సహించి, ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ఈ పాస్‌ను ప్రవేశపెట్టారు. అయితే, ధరలు ఎక్కువగా ఉండటంతో ఆ లక్ష్యం నెరవేరలేదు. ధరల సవరణపై ఇప్పటికే మెట్రో, ఆర్టీసీ అధికారులు పలుమార్లు సమావేశమై చర్చలు జరిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో జరగనున్న తదుపరి సమావేశాల అనంతరం కొత్త ధరలపై పూర్తి స్పష్టత రానుంది. ఈ నిర్ణయంతో కామన్ పాస్‌ను వినియోగించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడానికి ఇది దోహదపడుతుందని అధికారులు ఆశిస్తున్నారు.



జీవన వ్యయానికి తగ్గట్టు దినసరి వేతనాల పెంపుపై పరిశీలన - కలెక్టర్.

ములుగు నవంబర్ 05, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న దినసరి వేతన ఉద్యోగుల వేతనాల పెంపుపై జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులతో చర్చించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ లో జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో 2026-27 రేట్ల ప్రాతిపదికన వేతనాలను సవరించడం, పెంచడంపై సమగ్రంగా చర్చ జరిగింది. పెరుగుతున్న జీవన వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని ఉద్యోగుల సంక్షేమం కోసం న్యాయమైన వేతనం నిర్ణయించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో సహాయ కార్మిక అధికారి వి. వినోద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్, డీసీవో రామ్మోహన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి రవీందర్, వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణలో భారీగా మిగిలిపోయిన ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, నవంబర్ 5, : హైదరాబాద్ కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహించిన నీట్-యూజీ 2026 కౌన్సెలింగ్ పలు విడతలుగా పూర్తయినప్పటికీ, రాష్ట్రంలోని ప్రైవేట్ వైద్య కళాశాలల్లో కనీసం 175 ఎంబీబీఎస్ సీట్లు ఖాళీగా మిగిలిపోయాయి. ఈ భర్తీ కాని సీట్లన్నీ ప్రైవేట్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా (కేటగిరీ-బి), ఎన్ఆర్ఐ కోటా (కేటగిరీ-సి) పరిధిలోనివే కావడం గమనార్హం. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఫీజులు చాలా తక్కువగా ఉండటం, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో అక్కడ అన్ని సీట్లు భర్తీ అయ్యాయని జాయింట్ రిజిస్ట్రార్ జె. వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఇలా ప్రైవేట్ కాలేజీల్లో పెద్ద సంఖ్యలో సీట్లు మిగిలిపోవడం ఇదే తొలిసారి అని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ కాలేజీలలో బి-కేటగిరీ సీట్లకు వార్షిక ఫీజు రూ.10 లక్షల నుంచి రూ.11 లక్షల వరకు ఉండగా, ఎన్ఆర్ఐ కోటాకు రూ.24 లక్షల నుండి రూ.25 లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే ప్రైవేట్ యాజమాన్యాలు హాస్టల్ వసతి, ఇతర నిబంధనల పేరుతో అదనపు మొత్తాలను వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కేటగిరీ-ఎ విద్యార్థుల నుంచి సైతం నిబంధనల ప్రకారం ఉన్న రూ.60,000 ఫీజుకు బదులుగా రూ.2.5 లక్షల నుండి రూ.3 లక్షల వరకు దండుకుంటున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంబీబీఎస్ పూర్తైన తర్వాత డ్యూటీ మెడికల్ ఆఫీసర్లుగా చేరే వైద్యులకు నెలకు రూ. 20,000 నుండి రూ. 30,000 మాత్రమే వేతనం లభిస్తోంది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తే తప్ప మంచి అవకాశాలు లభించకపోవడం, మరోవైపు ఇంజినీరింగ్ అభ్యర్థులకు లక్షల రూపాయల ప్యాకేజీలు రావడం వైద్య రంగానికి పెద్ద సవాలుగా మారింది. రాష్ట్రంలో 10,000 కంటే ఎక్కువ ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, వాటిలో 6,000 పైగా సీట్లు 29 ప్రైవేట్ కాలేజీల్లోనే ఉన్నాయి. ఎన్ఎంసీ ఇటీవల 2026-27 విద్యాసంవత్సరానికి మంజూరు చేసిన 1,010 అదనపు సీట్లలో ప్రైవేట్ రంగానికే 900 సీట్లు రావడం విశేషం. వైద్య విద్యపై విద్యార్థులకు ఆసక్తి తగ్గడం వల్ల ఈ సీట్లు ఖాళీగా మిగలలేదని, కేవలం ఆర్థిక భారం, ఇతర కారణాల వల్లే అర్హులైన విద్యార్థులు తమ కలలను వదులుకోవాల్సి వస్తోందని హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కార్తీక్ నాగుల అభిప్రాయపడ్డారు. ప్రైవేట్ కాలేజీలు ఎందుకు ఫీజులను విపరీతంగా పెంచుతున్నాయో తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.

గ్రామీణ యువతకు స్వయం ఉపాధి శిక్షణ అందించేలా చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ,నవంబర్ 05,(విజన్ ఆంధ్ర); గ్రామీణ నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం (ఆర్ఎస్ఈటీఐ) ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామ సమీపంలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, భవన సదుపాయాలు, ఖాళీ స్థలాలు, శిక్షణ తరగతుల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను పరిశీలించారు. కేంద్రం ఏర్పాటుకు కల్పించాల్సిన సదుపాయాలపై అధికారులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ యువతలో నైపుణ్యాలను పెంపొందించి, వారికి స్వయం ఉపాధి మార్గాలను చూపడమే ఆర్ఎస్ఈటీఐ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. యువత శిక్షణను సద్వినియోగం చేసుకుని సొంతంగా ఉపాధి పొందేలా నాణ్యమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణకు వచ్చే వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, మహిళా శిశు వికాస కేంద్ర మేనేజర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సులో భాగంగా బియ్యం ధరల నియంత్రణ

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 5 (విజన్ ఆంధ్ర) : ప్రజా శ్రేయస్సులో భాగంగా ప్రభుత్వం బియ్యం ధరల నియంత్రణ చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో సమత రైస్ డిపో వారు ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్ లెట్ ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, మండల తహసిల్దార్ వనజ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట ధరలకు మించి అమ్మకాలు జరుపకూడదని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ నిర్ణీత ధరకే విక్రయాలు జరిగేలా రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన ప్రీమియం క్వాలిటీ బి.పి.టి. న్యూ రైస్ బ్యాగ్ ను 1 వేయి 352 రూపాయలు, స్టీమ్ రైస్ ను 1 వేయి 482 రూపాయలు, పాత బియ్యం 1 వేయి 638, హెచ్.ఎం.టి. పాత రకం బియ్యం బస్తా 1 వేయి 950 రూపాయలు, జై శ్రీరామ్ పాత బియ్యం 1 వేయి 976 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయాలు జరుపుతామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 5 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి సర్వేయర్లకు జి.ఎన్.ఎస్.ఎస్. రోవర్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, సంబంధిత రైతులకు ముందుగా సమాచారం అందించి, ప్రతి రైతు రీ సర్వేలో హాజరయ్యే విధంగా టామ్ టామ్ ద్వారా తెలియజేయాలని తెలిపారు. రీ సర్వే ద్వారా భవిష్యత్తులో భూ సమస్యలు ఉండవని తెలిపారు. ప్రక్రియ నిర్వహణ కొరకు సర్వేలో వినియోగించే 12 రోవర్లను అందించడం జరిగిందని, వీటి ద్వారా ఖచ్చితమైన సర్వేను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ సర్వే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 5 (విజన్ ఆంధ్ర) : పెండింగ్ సర్వే దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎ.ఓ., అన్ని మండలాల తహసిల్దార్లు, అధికారులు, సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సర్వే దరఖాస్తులు, సర్వే పనుల పురోగతి, జి.ఓ. నం. 76, 59 అమలు తీరు, ఎస్ఐఆర్ ప్రక్రియ, భూ భారతి, భూదాన్ భూములకు సంబంధించిన ఫైళ్లు, కోర్టు కేసులపై సమీక్షించారు. ఆయా అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ప్రతి పనిని పూర్తి చేయాలని, ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన సమయంలోగా అన్ని పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. పోర్టల్, డిజిటల్ గవర్నెన్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు



మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 5 (విజన్ ఆంధ్ర) : ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. పోర్టల్, డిజిటల్ గవర్నెన్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో హెచ్ ఓ ఓ లు, డి డి ఓ లు, మండల స్థాయి అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యతనిస్తూ ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. పోర్టల్ ద్వారా అన్ని బిల్లుల సమర్పణ డిజిటల్ విధానంలో కొనసాగుతుందని, 2027 జనవరి 1వ తేదీ నుంచి మాన్యువల్ విధానానికి పూర్తిగా స్వస్తి పలికి, ప్రభుత్వ కార్యకలాపాలను డిజిటల్ విధానంలోనే నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 31వ తేదీలోగా ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్లలో చేయవలసిన అన్ని వివరాల నమోదు, అప్‌డేషన్లను పూర్తి చేయాలని సూచించారు. జనవరి 1వ తేదీ నుంచి ఎంప్లాయి సర్వీస్ రిజిస్టర్ పూర్తిస్థాయిలో అమలులోకి వస్తుందని తెలిపారు. నూతన డిజిటల్ విధానాలపై ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పూర్తి అవగాహన కలిగి ఉండాలని, శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. శిక్షణలో భాగంగా ఈ.ఎస్.ఆర్. లో ఉద్యోగుల వివరాల నమోదు, నియామకాలు, పోస్టింగులు, సెలవుల దరఖాస్తు, సెలవుల రద్దు తదితర అంశాలను ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ ఆర్ ఎస్ లో ఒకసారి నమోదు చేసిన వివరాలను తిరిగి ఎడిట్ / డిలీట్ చేసే అవకాశం లేనందున, వివరాల నమోదు, ఆమోదం సమయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సందేహాలను శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల కోసం ఐక్య పోరాటం..!

- **సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎర్ర అశోక్**
- **కనీస వేతనం రూ.42 వేలు చెల్లించాలి**
- **బీపీసీఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జెండా ఆవిష్కరణ**





కాప్రా/ నవంబర్ 05(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : కార్మిక హక్కుల పరిరక్షణకు సంఘటిత పోరాటాలే మార్గమని సీఐటీయూ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర అశోక్ అన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని బీపీసీఎల్ పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు నూతనంగా ఏర్పాటు చేసుకున్న బీపీసీఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కోశాధికారి పి.గణేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్ర అశోక్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సీఐటీయూ ఆధ్వర్యంలో యూనియన్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. పరిశ్రమల్లో యాజమాన్యాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు నెలకు రూ.42 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. శాశ్వత ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, ప్రసూతి సెలవులు అమలు చేయాలని, నెలవారీ వేతనాలను ప్రతినెలా ఒకటో తేదీన బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకించాలన్నారు. . కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. కార్మికుల శ్రమ లేకుండా పరిశ్రమల్లో ఉత్పత్తి, అభివృద్ధి సాధ్యం కాదని యాజమాన్యాలు గుర్తించాలన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. కార్మికులు తమ హక్కుల సాధనకు సంఘటితంగా ఉండాలని, యాజమాన్యాల కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బివి.సత్యనారాయణ మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు అవసరమన్నారు. కార్మికులకు న్యాయంగా దక్కాల్సిన వేతనాలు, హక్కులు, సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాక్ పరిశ్రమ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.మణికంఠ, గండూరి ఫుడ్స్ ప్రతినిధి రవీందర్‌రెడ్డి, బీపీసీఎల్ లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, ఖాజా, హార్డ్‌కేస్ ఇంజినీరింగ్ ప్రతినిధి రమేష్, బీపీసీఎల్ కాంట్రాక్టు యూనియన్ నాయకులు శంకర్, రమేష్, నరేందర్, దినేష్, రాజు, శ్రీరామ్, బాలు, కిరణ్, కార్మికులు, లారీ యజమానులు పాల్గొన్నారు.

38 బీసీ కులాల ఆత్మగౌరవ భవనాలకు నిధులు

- జీవోలు అందజేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

- **మినిస్టర్ క్వార్టర్స్ లో ఘనంగా కార్యక్రమం**
- **బీసీల భూములు ఎవరూ తీసుకోరు, అది ప్రచారమే: మంత్రి పొన్నం**

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, నవంబర్ 5:
తెలంగాణలో బీసీ సంక్షేమానికి సంబంధించి కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో 38 బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో పత్రాలను మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు అందజేశారు. మినిస్టర్ క్వార్టర్స్ లో జరిగిన ఈ కార్యక్రమం బీసీ సంఘాలలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయ దేవి, మాజీ ఓబీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఇతర కార్పొరేషన్ చైర్మన్లు, ముఖ్య నేతలు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ ఏం చెప్పారు?

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పలు కీలక విషయాలు వెల్లడించారు. రాష్ట్రంలో 38 బీసీ కుల సంఘాల భవన నిర్మాణాలకు గతంలో కేటాయించిన రూ.88.50 కోట్ల నిధులకు సంబంధించి ప్రభుత్వం జీవోలు జారీ చేసింది. ఆ జీవోలను ఈరోజు సంఘాలకు అందజేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు, ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు భవన నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. గతంలో స్థలాలు కేటాయించినా నిర్మాణాలకు అనువుగా లేని పరిస్థితిని హెచ్ఎండీఏ సహకారంతో పరిష్కరించామని, కుల సంఘాలకు కేటాయించిన స్థలాలను భవన నిర్మాణాలకు సిద్ధంగా ఉండేలా రెడీ టు కన్స్ట్రక్షన్ విధానంలో లేఅవుట్లు అభివృద్ధి చేశామని తెలిపారు. కేటాయించిన నిధులతో కుల సంఘాలు వెంటనే భవన నిర్మాణాలు చేపట్టాలని, కార్తీక మాసంలోనే శంకుస్థాపనలు చేసుకోవాలని సూచిస్తున్నామని అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెలా భవన నిర్మాణాల ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తామని,



నెలవారీ ప్రోగ్రెస్ రిపోర్టులు తీసుకుంటామని చెప్పారు. భవన నిర్మాణాలను ఏడాది కాలంలో లేదా నిర్మాణ పరిస్థితులను బట్టి నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కేవలం నిధులు, స్థలాల కేటాయింపులతో సరిపెట్టుకోకుండా భవనాలు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని, ఇంజనీరింగ్ శాఖ, హెచ్ఎండీఏ సమన్వయంతో అన్ని అనుమతులు సింగిల్ విండో విధానంలో మంజూరు చేసి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేద బీసీ విద్యార్థుల స్కిల్ డెవలప్‌మెంట్, వసతి సౌకర్యాలు, కుల సంఘాల సామాజిక కార్యక్రమాలకు ఈ భవనాలు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. భవనాల నిర్వహణ, పర్యవేక్షణ కోసం కొత్త కార్యవర్గాల ఎంపికకు ప్రభుత్వం జీవో నంబర్ 14 తీసుకొచ్చిందని తెలిపారు.

బీసీ భూములపై ప్రచారానికి మంత్రి గట్టి కౌంటర్

బీసీలకు కేటాయించిన భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. "బీసీలకు కేటాయించిన భూములను కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే కాదు, ఏ ప్రభుత్వం కూడా తిరిగి తీసుకునే పరిస్థితి ఉండదు. బీసీలకు కేటాయించిన భూములు బలహీన వర్గాల ఆస్తి. వాటి పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. కేటాయించిన స్థలాల్లో నిధులతో భవనాలు నిర్మించి, నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయడమే మా సంకల్పం. నిర్మాణాల్లో జాప్యం జరిగితే సంబంధిత సంఘాల ప్రతినిధులను బాధ్యులుగా చేస్తూ నిర్మాణాలు పూర్తి చేయిస్తాం. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు స్థలాలు కేటాయించి వదిలిపెట్టే ప్రభుత్వం మాది కాదు" అని మంత్రి గట్టిగా చెప్పారు. "బీసీల అభ్యున్నతి, సామాజిక న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వ విధానంలో అంతర్భాగం. బీసీలకు సామాజిక న్యాయం



కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుంది. హైదరాబాద్ నగరంలో పద్మశాలి, పేరక, గౌడ, కాపు తదితర కుల సంఘాల వసతి గృహాల ద్వారా వేలాది మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు నిర్మించే భవనాలు భవిష్యత్ తరాలకు ఉపయోగపడాలి. ఆర్థికంగా స్థోమత ఉన్న కుల సంఘాలు ప్రభుత్వ నిధులకు అదనంగా తమ వంతు సహకారం అందించాలి. కుల సంఘాల ప్రతినిధులు అంతర్గత విభేదాలు లేకుండా ఐక్యంగా ఉండి భవనాలు పూర్తి చేసుకోవాలి. బీసీ భవనాలకు ప్రభుత్వం తరపున నూటికి నూరు శాతం సహకారం అందిస్తాం" అని మంత్రి పిలుపునిచ్చారు.

ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

వి.హనుమంతరావు మాట్లాడుతూ, "బీసీ కుల సంఘాలన్నీ ఆత్మగౌరవ భవనాలను నిర్మించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేశారు. రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా కులాల వారీగా ఉన్నప్పటికీ అందరూ ఐక్య భావనతో ముందుకు సాగాలి. గెజిట్ విషయంలో ఎస్సీ, ఎస్టీలతో పాటు ఇతర కులాలకు కూడా న్యాయం జరగాలి. అన్ని వర్గాలు ఐక్యంగా ఉంటేనే మన బలం, మెజారిటీ పెరుగుతుంది. అంబేద్కర్ తర్వాత ఎస్సీలకు రిజర్వేషన్లు లభించాయి, కానీ క్రిమిలేయర్ వల్ల అన్యాయం జరుగుతోందనే ఆవేదన ఉంది. బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలన్నదే సీఎం ఆలోచన. గతంలో ముదిరాజ్, మున్నూరు కాపు కులాలకు భవనాలు ఇచ్చినట్లే ఇప్పుడు ఇతర కులాలకు ఇస్తున్నారు. రాహుల్ గాంధీ సామాజిక న్యాయ ఆలోచనలను తెలంగాణలో అమలు చేస్తున్న నాయకుడు రేవంత్ రెడ్డి" అని అన్నారు.

బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, "ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో 40 బీసీ కుల సంఘాలు మరియు 36 సంచార జాతుల కులాలకు, మొత్తం 76 కులాలకు ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి బడ్జెట్ శాంక్షన్ జీవోలు అందజేశారు. హైదరాబాద్ లో చదువుకునే బీసీ విద్యార్థులకు, ప్రజలకు ఈ భవనాలు ఎంతో ఉపయోగపడతాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, వి.హనుమంతరావులకు ధన్యవాదాలు" అని తెలిపారు. "ప్రగతి భవన్ కు మహాత్మా జ్యోతిబా పూలే పేరు పెట్టడం, హైదరాబాద్ నడిబొడ్డున పూలే దంపతుల విగ్రహాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించడం, బీహార్ తర్వాత తెలంగాణలోనే దేశంలో చారిత్రాత్మకంగా కులగణన సర్వే చేపట్టడం వంటి కార్యక్రమాలతో ఈ ప్రభుత్వం బీసీలను అగ్రభాగాన ఉంచుతోంది. అన్ని కులాలకు భవనాలు ఇచ్చినట్లే, జయంతులు, సభల కోసం 5 ఎకరాల్లో ఉమ్మడి బీసీ భవన్ నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నాం" అని అన్నారు.

వీహెచ్ సూచన - అంబర్ పేట్ స్థలం

ఈ సందర్భంగా వి.హనుమంతరావు ఒక సూచన చేశారు. అంబర్ పేట్ లోని ఛే నెంబర్ చౌరస్తా పరిసరాల్లో ఉస్మానియా యూనివర్సిటీకి సమీపంలో ఒక స్థలం ఉందని, అక్కడ పూలే విగ్రహం కూడా ఏర్పాటు చేశామని, ఆ స్థలం కబ్జాలకు గురవుతోందని, అక్కడ లైబ్రరీ, రవీంద్రభారతి తరహాలో పెద్ద ఆడిటోరియం నిర్మిస్తే విద్యార్థులకు, బలహీన వర్గాలకు ఉపయోగపడుతుందని చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రికి లేఖ రాశానని, మంత్రి పొన్నం కూడా చొరవ తీసుకోవాలని సూచించారు. మొత్తంగా 38 కులాలకు జీవోలు అందజేయడం ద్వారా బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణం ఇక వేగం పుంజుకోనుంది. ప్రభుత్వం చెబుతున్నట్లు ఏడాదిలో ఈ భవనాలు పూర్తయితే, హైదరాబాద్ లో బీసీ విద్యార్థులకు, ఉద్యోగార్థులకు పెద్ద ఊరట లభించనుంది.

దామోదర-లక్ష్మీకాంత రావులపై మహేష్ గౌడ్ సీరియస్ !

హైదరాబాద్, నవంబర్ 5, : తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో రోజురోజుకూ శృతిమించుతున్న గ్రూపు తగాదాలు, బాహాటంగా రచ్చకెక్కుతున్న క్రమశిక్షణా రాహిత్యంపై టీపీసీసీ నాయకత్వం గట్టిగా దృష్టి సారించింది. పార్టీ నేతల వివాదలా? పార్టీ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీస్తోందని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయా? పార్టీ సంస్థాగత నియామకాల విషయంలో నేతల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు చివరకు బహిరంగ ఘర్షణకు దారితీసిందా? ఢిల్లీలోని ఓ ప్రముఖ హోటల్ వేదికగా చోటుచేసుకున్నట్లు ప్రచారంలోకి వచ్చిన ఘటన ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు రైతుల సమస్యలు, మరోవైపు పార్టీ వ్యవహారాలు.. వీటన్నింటినీ పక్కనపెట్టి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఢిల్లీలోనే పరస్పరం తలపడినట్లు వస్తున్న వార్తలు పార్టీ ప్రతిష్ఠకు సవాలుగా మారాయి.పార్టీ అధికారంలో ఉన్న వేళ నేతలు సంయమనం పాటించాల్సింది పోయి.. వ్యక్తిగత ఆధిపత్యం, నామినేటెడ్ పదవులు, నియోజకవర్గ వ్యవహారాలపై పరస్పరం దాడులకు దిగడంపై ఆయన సీరియస్ అయ్యారు. అంతర్గత క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై ఎంతటి స్థాయి నేతలైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావుల వివాదాన్ని టీపీసీసీ చీఫ్ తీవ్రమైన అంశంగా పరిగణించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా హోటల్ లాబీలో డీసీసీ అధ్యక్ష పదవి, సంస్థాగత నియామకాల విషయంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి, సహచర ఎమ్మెల్యేల ముందే బాహాబాహీకి దిగే స్థాయికి వెళ్లడం పార్టీ వర్గాల్లో పెను దుమారం రేపింది. తోటి ఎమ్మెల్యేల సమక్షంలో మంత్రి దామోదర తనపై తీవ్ర పదజాలంతో దూషణలకు దిగారని ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావు ఇప్పటికే పీసీసీకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటన పార్టీ హైకమాండ్ దృష్టికి కూడా వెళ్లింది. ఈ వివాదంపై పూర్తి విచారణ జరిపేందుకు బుధవారం నాడు గాంధీ భవన్‌కు స్వయంగా హాజరుకావాల్సిందిగా మంత్రి దామోదర, ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావులకు పీసీసీ చీఫ్ ఆదేశాలు జారీ చేశారు.మంత్రి, ఎమ్మెల్యే వివాద పరిష్కారం తర్వాత.. రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల్లో ఇటీవల చోటుచేసుకున్న వరుస క్రమశిక్షణా ఉల్లంఘనలపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని పీసీసీ నిర్ణయించింది. ఢిల్లీలోని శాంగ్రిలా హోటల్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు సమాచారం. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల నియామకాలకు సంబంధించి ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. తమ వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న పట్టుదల, పార్టీ పదవుల పంపకాలపై అసంతృప్తి ఈ వివాదానికి కారణమన్న ప్రచారం జరుగుతోంది.ఈ క్రమంలో హోటల్ లాబీలోనే ఇద్దరి మధ్య మాటామాటా పెరిగినట్లు సమాచారం. 'రూములో వేసి నీ గురించి ఏం అనుకుంటున్నావు?' అంటూ మంత్రి దామోదర రాజనర్సింహ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో ఇద్దరూ పరస్పరం దాడికి దిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఒకరినొకరు కొట్టుకునే స్థాయికి వివాదం వెళ్లిందన్న వార్త రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది.

ఇతర ఎమ్మెల్యేల ముందే అవమానం?

ఈ ఘటన సమయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఓ సీనియర్ జర్నలిస్ట్ అక్కడే ఉన్నట్లు సమాచారం. ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో మంత్రి తనను దూషించి అవమానించారని లక్ష్మీకాంతరావు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఆయన ఇప్పటికే పీసీసీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అంతటితో ఆగకుండా పార్టీ అధిష్ఠానానికి కూడా ఫిర్యాదు చేయాలని యోచిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది.ఈ వ్యవహారం నిజంగా ఎంతవరకు వెళ్లింది? ఇద్దరు నేతల మధ్య వివాదానికి అసలు కారణాలేమిటి? పార్టీ పెద్దలు ఈ అంశాన్ని ఎలా పరిష్కరిస్తారు? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయఈ ఘటన రాజకీయంగా మరో కీలక చర్చకు తెరలేపింది.

తెలంగాణలో రైతులు వివిధ సమస్యలతో సతమతమవుతున్న సమయంలో అధికార పార్టీ నేతలు మాత్రం పార్టీ పదవులు, వర్గ రాజకీయాల కోసం ఢిల్లీలోనే ఘర్షణలకు దిగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు తమలో తాము ఆధిపత్య పోరుకు దిగడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి, ప్రజల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే మధ్యే సఖ్యత లేకపోతే పార్టీ కేడర్‌కు ఎలాంటి సందేశం వెళుతుందన్నది మరో ప్రశ్న. జిల్లా స్థాయి పార్టీ పదవుల విషయంలోనే నేతలు సంయమనం కోల్పోతే, ప్రభుత్వ పాలనలో సమన్వయం ఎలా ఉంటుందన్న విమర్శలకు ఈ పరిణామం అవకాశం కల్పిస్తోంది.

అధిష్ఠానం జోక్యం తప్పనిసరేనా?

కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు కొత్తేమీ కాకపోయినా, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అంతర్గత విభేదాలు ఇలాంటి స్థాయికి చేరుతున్నాయన్న ప్రచారం పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఈ వివాదం పీసీసీ పరిధిలోనే ముగుస్తుందా? లేక ఢిల్లీ పెద్దల వరకు చేరుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.డీసీసీ అధ్యక్షుల నియామకాల కోసం మొదలైనట్లు చెబుతున్న వివాదం ఇప్పుడు మంత్రి, ఎమ్మెల్యే మధ్య వ్యక్తిగత ఘర్షణగా మారిందన్న వార్త కాంగ్రెస్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. రైతుల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన సమయంలో నేతల మధ్య ఈ తరహా పరిణామాలు చోటుచేసుకోవడం పార్టీకి రాజకీయంగా ఎంతమేర నష్టం కలిగిస్తుందో వేచి చూడాలి.హోటల్‌లో జరిగినట్లు ప్రచారంలో ఉన్న ఘర్షణకు సంబంధించి ఇరువురు నేతల అధికారిక స్పందన, స్వతంత్ర ధ్రువీకరణ అందుబాటులోకి వచ్చిన తర్వాత పూర్తి వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.ప్రధానంగా నియోజకవర్గ నిధుల పంపిణీ, స్థానిక సంస్థల సమన్వయం, అధికార వర్గాల బదిలీల విషయంలో మంత్రులపై బహిరంగంగా గళమెత్తుతున్న అసంతృప్త ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల వ్యవహార శైలిపై పార్టీ అధిష్ఠానం నివేదికలు సిద్ధం చేస్తోంది. మునుగోడు, జడ్చర్ల వంటి స్థానాల్లో సొంత పార్టీ ప్రజాప్రతినిధులే ప్రభుత్వంపై విరుచుకుపడుతుండటం, జిల్లాల్లో డీసీసీ అధ్యక్షుల నియామకాల వేళ వర్గపోరు భగ్గుమంటున్న పరిస్థితులన్నింటినీ సమీక్షించి ఆయా నేతలకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు హెచ్చరికలు జారీ చేయనున్నారు.



పెంచలేదనడం అబద్ధం

- ములుగులో పన్నుల మోతపై ప్రజల ఆగ్రహం, కౌన్సిలర్ల వాకౌట్

ములుగు నవంబర్ 05,
విజన్ ఆంధ్ర ప్రతినిధి :

నూతన మున్సిపాలిటీలో పన్నులు పెంచలేదని చెప్పడం అబద్ధమని ప్రజలు, కౌన్సిలర్లు అన్నారు. కమిషనర్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో పన్నుల విషయంలో స్పష్టమైన సమాధానం రాకపోవడంతో అఖిలపక్ష కౌన్సిలర్లు సమావేశం నుంచి బయటకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు.

1. పెంచలేదనడం అబద్ధమని ప్రజల వాదన:
పన్నులు పెంచలేదని చెబుతున్నా వాస్తవంలో 800 నుంచి 1000 శాతం వరకు పెరిగాయని ప్రజలు అంటున్నారు. గతంలో వందల్లో ఉన్న పన్ను ఇప్పుడు వేల రూపాయలకు చేరిందని, రనీదులే దీనికి సాక్ష్యమని తెలిపారు. పెంచలేదనడం అబద్ధమని ప్రజలు స్పష్టం చేశారు.

2. పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర భారం:
పెంకుటిళ్లపైనా వేల రూపాయల పన్ను భారం పడుతోంది. పూట గడవని కుటుంబాలు పన్ను కట్టలేక ఇబ్బంది పడుతున్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలు లబోదిబోమంటున్నాయని కౌన్సిలర్లు అన్నారు.

3. చిన్న వ్యాపారులు దుకాణాలు మూసే పరిస్థితి:
చిన్న వ్యాపారాలు నడుపుతున్న వర్తకులు పన్నుల భారంతో దుకాణాలు మూసే పరిస్థితికి చేరుకున్నారు. రియల్ ఎస్టేట్ పడిపోవడం, ఎల్ నినో ప్రభావంతో వరి పంటలు వేయలేకపోవడం ప్రజల కష్టాలను మరింత పెంచిందని తెలిపారు.

4. చట్టాన్ని పట్టించుకోవడం లేదు:
నూతన మున్సిపాలిటీలో మూడు సంవత్సరాల వరకు పన్నులు పెంచకూడదని చట్టం చెబుతున్నా కమిషనర్ పట్టించుకోవడం లేదని కౌన్సిలర్లు ఆరోపించారు. మున్సిపాలిటీకి నిధులు సమకూర్చుకోవడానికి ఎన్నో మార్గాలు ఉన్నా ప్రజలపై భారం వేయడం సరికాదన్నారు.

5. భువన సర్వేపై పట్టణ సభకు డిమాండ్:
భువన సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణ సభ ఏర్పాటు చేయాలని అఖిలపక్ష కౌన్సిలర్లు కోరారు. పన్నులు తగ్గించే ప్రసక్తే లేదని కమిషనర్ చెప్పడంతో కౌన్సిలర్లు వాకౌట్ చేసి నిరసన తెలిపారు.


6. ప్రజలు క్షమించరని హెచ్చరిక:
ప్రజల ఆర్తనాదాలను పట్టించుకోకుండా పన్నుల భారంతోనే అభివృద్ధి చేస్తామనడం సరికాదని కౌన్సిలర్లు అన్నారు. ఇదే వైఖరి కొనసాగితే ములుగు ప్రజలు క్షమించరని హెచ్చరించారు. పన్నులు వెంటనే తగ్గించి ప్రజలకు ఊరట కల్పించాలని అఖిలపక్ష కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.

విజన్ ఆంధ్ర | ప్రత్యేక కథనం.....

షేక్ పేట్ లో గుర్రం మాయం - నగరమంతా ఒకటే చర్చ!

మూడు గుర్రాలలో ఒకటి కనిపించకపోవడంతో అనుమానాలు

- వివరణ ఇవ్వని జీహెచ్ఎంసీ



తెలంగాణ స్టేట్ బ్యూరో, నవంబర్ 5, విజన్ ఆంధ్ర: హైదరాబాద్ లో ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకటే మాట. "షేక్ పేట్ ఫ్లైఓవర్ కింద గుర్రం ఏమైంది?" ఉదయం ఆఫీసుకు వెళ్లే వాళ్లు, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే వాళ్లు, ఆటో డ్రైవర్లు, బస్సులో వెళ్లే ప్రయాణికులు – అందరూ ఇదే విషయం మాట్లాడుకుంటున్నారు. సుందరీకరణ కోసం ఎంతో అందంగా పెట్టిన మూడు గుర్రాలలో ఇప్పుడు రెండే కనిపిస్తున్నాయి. మూడో గుర్రం ఎక్కడికి వెళ్లిందో ఎవరికీ తెలియడం లేదు. జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం ఇప్పటివరకు నోరు విప్పడం లేదు. దీంతో అనుమానాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.

ఒకప్పుడు ఆ ప్రాంతానికే గుర్తింపు

షేక్ పేట్ ఫ్లైఓవర్ అంటేనే హైదరాబాద్ లో చాలా మందికి తెలుసు. టోలీచౌకి నుంచి గచ్చిబౌలి వైపు వెళ్లే వాళ్లకు ఇది ముఖ్యమైన మార్గం. ఫ్లైఓవర్ కింద ఖాళీగా ఉన్న స్థలాన్ని అందంగా మార్చాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. అందులో భాగంగా మూడు గుర్రాలు పరుగెడుతున్నట్లుగా ఉండే విగ్రహాలను ఏర్పాటు చేసింది. ఆ విగ్రహాలు చూడగానే ప్రయాణికులకు ఒక ప్రత్యేక అనుభూతి. రాత్రి వేళ లైట్ల వెలుగులో అవి మరింత అందంగా కనిపించేవి. చాలా మంది తమ పిల్లలకు "అదిగో గుర్రాలు చూడు" అని చూపించేవారు. క్యాబ్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు ఆ ప్రాంతాన్ని గుర్తుపట్టడానికి "గుర్రాల దగ్గర ఆపు" అని చెప్పేవారు. అంతగా ఆ మూడు గుర్రాలు షేక్ పేట్ కు ఒక ల్యాండ్ మార్క్ గా మారిపోయాయి. కానీ ఇప్పుడు ఆ అందం సగం అయిపోయింది. మూడు గుర్రాలు ఉండాల్సిన చోట రెండే ఉన్నాయి. మధ్యలో ఖాళీ స్థలం కనిపిస్తోంది. ఆ ఖాళీని చూసిన ప్రతి ఒక్కరూ "మూడో గుర్రం ఏమైంది?" అని అడుగుతున్నారు.

ఎప్పుడు మాయమైంది? ఎవరూ చెప్పలేకపోతున్నారు

ఈ గుర్రం ఎప్పుడు మాయమైందో కచ్చితంగా ఎవరూ చెప్పలేకపోతున్నారు. కొందరు కొన్ని రోజుల క్రితమే గమనించామని అంటున్నారు. మరికొందరు వారం రోజులుగా కనిపించడం లేదని అంటున్నారు. మొదట్లో ఎవరో మరమ్మతుల కోసం తీసుకెళ్లి ఉంటారని అనుకున్నారు. కానీ రోజులు గడుస్తున్నా తిరిగి రాకపోవడంతో అనుమానం మొదలైంది. గుర్రాన్ని అధికారులే తొలగించారా? లేక ఎవరైనా దొంగిలించారా? లేక ఏదైనా వాహనం ఢీకొట్టి పాడైపోయిందా? అనే ప్రశ్నలకు ఇప్పటివరకు సమాధానం లేదు. అధికారులు వివరణ ఇస్తే ఈ అనుమానాలన్నీ తీరిపోతాయి. కానీ వారు మౌనంగా ఉండటం వల్లే ప్రజల్లో ఆగ్రహం పెరుగుతోంది. "మరమ్మతుల కోసం తీసుకెళ్లి ఉంటే, అక్కడ ఒక బోర్డు పెట్టాలి. 'మరమ్మతుల్లో ఉంది, త్వరలో తిరిగి వస్తుంది' అని రాయాలి. అలా చేయకుండా ఊరుకుంటే ప్రజలు ఏమనుకుంటారు? దొంగతనం జరిగిందనే అనుకుంటారు" అని స్థానిక వ్యాపారి ఒకరు అన్నారు.

ప్రజా ధనం – బాధ్యత ఎవరిది?

ఈ విగ్రహాల కోసం ప్రజల సొమ్ము ఖర్చు చేశారు. డిజైన్ చేయడం, తయారు చేయడం, తీసుకువచ్చి ఏర్పాటు చేయడం, లైటింగ్ పెట్టడం – అన్నీ ప్రజా ధనంతోనే జరిగాయి. అలాంటి వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీదే అని స్థానికులు గట్టిగా అంటున్నారు. "నగరాన్ని అందంగా చేయడం మంచిదే. కానీ పెట్టిన తర్వాత వదిలేయడం కాదు. వాటిని చూసుకోవాలి. భద్రత కల్పించాలి. సీసీటీవీ కెమెరాలు పెట్టాలి. రోజూ పరిశీలించాలి. లేకపోతే ఇలాగే ఒక్కొక్కటి మాయమైపోతాయి" అని మరో స్థానికుడు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ లో ఇదే పరిస్థితి చాలా చోట్ల ఉందని నగరవాసులు అంటున్నారు. ఎక్కడో ఒక చోట విగ్రహం పెడతారు. ఫోటోలు దిగుతారు. ప్రారంభోత్సవం చేస్తారు. ఆ తర్వాత పట్టించుకోరు. కొన్ని నెలలకే రంగులు పోతాయి. కొన్ని పాడైపోతాయి. కొన్ని ఇలా మాయమైపోతాయి. షేక్ పేట్ ఘటన ఈ నిర్లక్ష్యానికి పెద్ద ఉదాహరణగా మారిందని వారు అంటున్నారు.

సోషల్ మీడియాలో సరదా – నిజంలో సీరియస్ ప్రశ్న

ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అయింది. "గుర్రం పారిపోయిందా?", "రేసుకు వెళ్లిందా?", "షేక్ పేట్ గుర్రం మిస్సింగ్ – వెతికి ఇచ్చిన వారికి బహుమతి" అంటూ సరదాగా పోస్టులు పెడుతున్నారు. మీమ్స్ కూడా వస్తున్నాయి. కానీ సరదా వెనుక సీరియస్ ప్రశ్న ఉంది. బహిరంగ ప్రదేశంలో ఉన్న విగ్రహమే భద్రంగా లేకపోతే, నగరంలో భద్రత ఎలా ఉందని ప్రజలు అడుగుతున్నారు. ఫ్లైఓవర్ కింద సీసీటీవీ కెమెరాలు ఉంటే ఆ ఫుటేజ్ చూడాలి. దొంగతనం జరిగి ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అధికారులు తీసుకెళ్లి ఉంటే ఆ విషయాన్ని బహిరంగంగా చెప్పాలి. ఇదే ప్రజలు కోరుతున్నది.

ఇప్పుడు జీహెచ్ఎంసీ ఏం చేయాలి?

స్థానికుల డిమాండ్ చాలా స్పష్టంగా ఉంది.

1. మాయమైన గుర్రం ఏమైందో వెంటనే వివరణ ఇవ్వాలి.
2. దొంగతనం అయితే పోలీసు ఫిర్యాదు చేసి దర్యాప్తు చేయించాలి.
3. మరమ్మతుల కోసం తీసుకెళ్లి ఉంటే ఎప్పుడు తిరిగి పెడతారో తేదీ చెప్పాలి.
4. ఇక నుంచి అన్ని సుందరీకరణ విగ్రహాలకు సీసీటీవీ నిఘా, నిర్వహణ ఏర్పాటు చేయాలి.

షేక్ పేట్ గుర్రం తిరిగి వస్తుందా? లేదా ఆ ఖాళీ అలాగే మిగిలిపోతుందా? అనేది ఇప్పుడు జీహెచ్ఎంసీ చేతిలో ఉంది. అధికారులు స్పందిస్తేనే ఈ చర్చకు ముగింపు వస్తుంది. లేకపోతే ఈ "మిస్సింగ్ గుర్రం" కథ హైదరాబాద్ లో మరింత పెద్ద చర్చగా మారుతుంది.

బ్యారేజీలు.. భద్రం! మేడిగడ్డకు మళ్లీ పునర్జన్మ

నిపుణుల సూచనల మేరకే పునరుద్ధరణ

డిసెంబర్ లో పనులు ప్రారంభం

రూ.4,193 కోట్లతో మూడు బ్యారేజీలకు మరమ్మతులు



తెలంగాణ స్టేట్ బ్యూరో,విజన్ ఆంధ్ర, నవంబర్ 05: సెక్రటేరియట్:

తెలంగాణ రైతులకు శుభవార్త. కుంగిపోయిన కాళేశ్వరం బ్యారేజీలకు మళ్లీ పునర్జన్మ రాబోతోంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల – ఈ మూడు బ్యారేజీలను సురక్షితంగా తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్ణయించారు. డిసెంబర్ లోనే పనులు ప్రారంభించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. "భద్రత విషయంలో ఒక్క అడుగు కూడా రాజీ లేదు. నిపుణులు చెప్పినట్లే చేయండి. గత ప్రభుత్వం చేసిన తప్పులు మళ్లీ జరగకూడదు" – ఇదీ సీఎం మాట.

గత ప్రభుత్వ తప్పు - ప్రజా ప్రభుత్వ బాధ్యత

సమీక్షలో సీఎం ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్లే మేడిగడ్డ కుంగిపోయింది. ఆ తప్పులను సరిదిద్ది, ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత ఇప్పుడు తమ ప్రభుత్వంపై ఉందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టి ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదే కాదని గుర్తుచేశారు. ప్రాణహిత నీటిని తక్కువ ఖర్చుతో ఎల్లంపల్లికి తీసుకురావచ్చని, కరువులో కూడా ఇబ్బంది ఉండేది కాదని అన్నారు. అయినా జరిగిపోయిన దాని గురించి కాదు, ఇప్పుడు ఏం చేయాలో దానిపై దృష్టి పెట్టాలని సీఎం చెప్పారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక వ్యవసాయ విస్తీర్ణం పెరిగిందని, వరి దిగుబడిలో దేశంలోనే రికార్డు సాధించామని గుర్తుచేశారు. ఆ దూసుకుపోతున్న వ్యవసాయానికి నీళ్లు అందించాలంటే బ్యారేజీలు బాగుండాలని స్పష్టం చేశారు.

మేడిగడ్డ వద్ద నీళ్లున్నా ఎందుకు లిఫ్ట్ చేయలేం? అసలు నిజం ఇదీ!

ఈ మధ్య "మేడిగడ్డ వద్ద నీళ్లున్నా ప్రభుత్వం లిఫ్ట్ చేయడం లేదు" అనే ప్రచారం జరుగుతోంది. దీనిపై సమీక్షలో ఇంజనీర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో స్పష్టంగా వివరించారు. మేడిగడ్డ నుంచి లిఫ్ట్ చేసిన నీళ్లు ఎల్లంపల్లికి చేరాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను మూసివేయాలి. కానీ ఆ రెండు బ్యారేజీల్లో నిర్మాణ లోపాలున్నాయి. అందుకే ఎన్ డీఎస్ ఏ ఆ గేట్లను తెరిచే ఉంచాలని హెచ్చరించింది. గేట్లు మూస్తే ప్రమాదం జరగొచ్చు. అందుకే అక్కడ కనిపించే నీటిని ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతికంగా లిఫ్ట్ చేయడం సాధ్యం కాదు. ఈ తప్పుడు ప్రచారాన్ని మంత్రులు తిప్పికొట్టాలని సీఎం సూచించారు. నిజాలు ప్రజలకు చెప్పాలన్నారు.

దేవాదుల, సీతారామ - గోదావరి నీటిని వృథా పోనివ్వలేదు

మేడిగడ్డ ఆగిపోయినా ప్రభుత్వం చేతులు కట్టుకుని కూర్చోలేదు. దిగువ గోదావరి నీటిని దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా లిఫ్ట్ చేశామని సీఎం చెప్పారు.

లెక్కలు చూడండి:

- గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీలు
- ఈ మూడేండ్లలో సగటున 18.13 టీఎంసీలుఅంటే 89% అధికం
- ఈ ఏడాది అక్టోబర్ నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ద్వారా 8.10 టీఎంసీలు – మొత్తం 24.81 టీఎంసీలు

ఈ నీటితోనే ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగునీరు, తాగునీరు అందించామని సీఎం చెప్పారు.

రూ.4,193 కోట్లు - ఎవరు భరిస్తారు?

మూడు బ్యారేజీల పునరుద్ధరణకు దాదాపు రిరూ.4,193 కోట్లని అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో ఒక కీలక నిర్ణయం ఉంది. నిర్మాణ లోపాలకు సంబంధించిన మరమ్మతుల వ్యయాన్ని నిర్మాణ సంస్థలే భరించాలి. అదనపు పనుల వ్యయాన్ని మాత్రమే ప్రభుత్వం భరిస్తుంది. అంటే తప్పు చేసిన వారే దానికి ఖర్చు పెట్టాలి అని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ప్రణాళికకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. జాతీయ స్థాయి నిపుణులు, కేంద్ర సాంకేతిక సంస్థలతో సమగ్ర అధ్యయనం పూర్తయింది.

డిసెంబర్ లో పనులు - రెండు దశల్లో పూర్తి

సీఎం ఇచ్చిన టైం లైన్ చాలా స్పష్టంగా ఉంది:
- ఈ నెలాఖరులోగాలి తుది అనుమతులు పొందాలి
- డిసెంబర్ లో పనులు ప్రారంభించాలి
- పనుల్లో జాప్యం లేకుండా అన్ని ప్రక్రియలు సమాంతరంగా జరగాలి
- పనులను రెండు దశలుగా విభజించాలి
1) నీటి వినియోగ సామర్థ్యం పునరుద్ధరణ,
2) రక్షణ పనులు

బ్యారేజీల భద్రతకు సంబంధించిన ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, కేంద్ర సంస్థలు, నిర్మాణ సంస్థల మధ్య సమన్వయం ఉండాలని సీఎం చెప్పారు. అవసరమైన అనుమతుల కోసం కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, టన్నెల్స్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరీక్షిత్ మెహ్రో, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు. మేడిగడ్డ కుంగినప్పుడు తెలంగాణ రైతు గుండె కుంగింది. ఇప్పుడు మళ్లీ ఆ గుండెకు ధైర్యం వచ్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. డిసెంబర్ లో పనులు మొదలైతే, మూడు బ్యారేజీలు మళ్లీ బతుకుతాయి. గోదావరి నీళ్లు మళ్లీ పొలాలకు పారుతాయి.

ఏ రిజిస్ట్రేషన్లకు లైన్ క్లియర్


హైదరాబాద్, నవంబర్ 5,: తెలంగాణలో ఓపెన్ ప్లాట్లు, ఇళ్లు కొనుగోలు చేసి ఏళ్ల తరబడి నిషేధిత జాబితా చిక్కుముడుల్లో పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్న లక్షలాది మంది సామాన్యులకు, రియల్ ఎస్టేట్ వర్గాలకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. దశాబ్దాల క్రితం లేఅవుట్ అనుమతులు పొంది, నాన్-నాలా నిబంధనలు కలిగిన ఆస్తులు సాంకేతిక లోపాలు , బేస్ సర్వే నంబర్ల బ్లాకింగ్ కారణంగా 22-ం నిషేధిత జాబితాలో నిలిచిపోవడంతో కొనుగోలుదారులు తీవ్ర నష్టపోయారు. ఈ సమస్యపై సమగ్ర విచారణ చేపట్టిన ప్రభుత్వం, చట్టబద్ధమైన అనుమతులు ఉన్న నాన్-నాలా ప్లాట్లు, ఇళ్ల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

రెవెన్యూ శాఖ జారీ చేసిన తాజా ఆదేశాల ప్రకారం.. జీహెచ్ఎంసీ , హెచ్ఎండీఏ , డీటీసీపీ , మున్సిపాలిటీలు , నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన అప్రూవ్డ్ లేఅవుట్లకు సంబంధించిన ఆస్తులు 22-ం జాబితాలో ఉన్నప్పటికీ వాటి రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. లింక్ డాక్యుమెంట్లు, బిల్డింగ్ లేదా లేఅవుట్ అనుమతి పత్రాలు పక్కాగా ఉన్న సందర్భాల్లో నిషేధిత జాబితా ఆంక్షలు వర్తించవు. ఈ నిర్ణయంతో రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా 264కి పైగా కాలనీలు , లేఅవుట్లలో చిక్కుకుపోయిన ప్లాట్లకు రిజిస్ట్రేషన్ స్వేచ్ఛ లభించింది.అంతేకాకుండా, సాగు భూముల్లో గతంలో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన అర్హమైన నాలా దరఖాస్తుల పరిష్కారానికి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. న్యాయ వివాదాలు లేని ఆస్తులకు నిర్ణీత నాలా రుసుముతో పాటు పారదర్శక నిబంధనలను వర్తింపజేస్తూ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేస్తారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దరఖాస్తుదారుల డాక్యుమెంట్లను డిజిటల్ డేటాతో సరిచూసి, ఆన్‌లైన్ వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే బయోమెట్రిక్ విధానంలో వేగంగా డిజిటల్ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు.

ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎక్కడైనా క్షేత్రస్థాయి సాంకేతిక ఇబ్బందులు లేదా శాఖల మధ్య వ్యత్యాసాలు ఎదురైతే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కలెక్టర్ల నేతృత్వంలో ప్రత్యేక 'జిల్లా స్థాయి కమిటీల'ను కూడా బాధ్యులుగా నియమించారు.ప్రభుత్వ తీసుకున్న ఈ సాహసోపేత నిబంధనల సవరణ వల్ల ఏళ్ల తరబడి నిలిచిపోయిన స్థిరాస్తి లావాదేవీలు తిరిగి పుంజుకోవడమే కాకుండా, మధ్యతరగతి ప్లాట్ల యజమానులకు తమ సొంత ఆస్తులపై పూర్తి హక్కులు దక్కనున్నాయి

ఏక్తా నగర్ యాత్ర విజయవంతం

- కలెక్టర్ ను శాలువాతో సత్కరించిన కుమార్ గౌడ్



ములుగు నవంబర్ 05, విజన్ ఆంధ్ర ప్రతినిధి :ఏక్తా నగర్ యాత్రను విజయవంతంగా ముగించుకుని వచ్చిన ములుగు జిల్లా బృందం జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు, ఇంచర్ల సర్పంచ్ లిముశ్నిపెల్లి కుమార్ గౌడ్‌లి కలెక్టర్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

1. కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బృందం ఏక్తా నగర్ కు:
జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుల నాయకత్వంలో ప్రజాప్రతినిధుల బృందం ఏక్తా నగర్ యాత్రలో పాల్గొంది. ఆయనతో పాటు ఫోరం ఉపాధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్, ఐలాపురం సర్పంచ్ పీర్ల సురేష్, విద్యార్థులు యాత్రలో భాగస్వాములయ్యారు.

2. కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక చొరవతో యాత్ర:
జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్ నాథ్ ప్రత్యేక చొరవతో 20 మంది ప్రత్యేక ఆహ్వానితుల బృందం ఏక్తా నగర్ వెళ్లింది. పీఎంశ్రీ టీజీఎంఎస్ బండారుపల్లి పాఠశాల నోడల్ అధికారి చిర్ర ప్రశాంత్ కుమార్ బృందానికి నాయకత్వం వహించారు.

3. స్టాట్యూ ఆఫ్ యూనిటీ సందర్శన – విద్యార్థుల్లో స్ఫూర్తి:
ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన సర్దార్ వల్లభభాయ్ పటేల్ విగ్రహం స్టాట్యూ ఆఫ్ యూనిటీని, మ్యూజియాన్ని సందర్శించారు. సంస్థానాల విలీనం, భారత సమాఖ్య నిర్మాణం, సర్దార్ పటేల్ సేవల గురించి విద్యార్థులు తెలుసుకున్నారు.

4. ఏక్తా దివస్ పరేడ్ ప్రత్యక్ష వీక్షణ:
అక్టోబర్ 31న జరిగిన ఏక్తా దివస్ పరేడ్ ను ప్రత్యేక ఆహ్వాన పత్రాలతో కేటాయించిన స్థానాల్లో కూర్చుని వీక్షించారు. వివిధ రాష్ట్రాల పోలీసు బలగాల కవాతు, భిన్నత్వంలో ఏకత్వం విద్యార్థుల్లో జాతీయ సమైక్యతా స్ఫూర్తిని పెంచింది.

5. కుమార్ గౌడ్ కృతజ్ఞతలు:
విద్యార్థులకు ఇంతటి ప్రతిష్ఠాత్మక జాతీయ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు కుమార్ గౌడ్ కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. మారుమూల ప్రాంత విద్యార్థులకు జాతీయ స్థాయి కార్యక్రమాలు చూసే అవకాశం కల్పించడం గొప్ప విషయమని ముస్నేపల్లి కుమార్ గౌడ్ అన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన భూములకు రక్షణ కల్పించండి.

- కలెక్టర్ ను కోరిన నెమలి నర్సయ్య మాదిగ, చింత కృష్ణ



ములుగు నవంబర్ 05, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రభుత్వం పంపిణీ చేసిన ఎస్సీ, ఎస్టీల భూములకు రక్షణ కల్పించాలని గురువారం మాదిగ దండోరా, తుడుందెబ్బ నాయకులు జిల్లా కలెక్టర్ ను కోరారు.

1. అగ్రవర్ణాల వారు భూములు గుంజుకుంటున్నారు – నర్సయ్య మాదిగ ఆవేదన:
ములుగు జిల్లాలో దళితులు, ఆదివాసీల భూములను ఉన్నత వర్గాల వారు రాజకీయ అండదండలతో, అధికారులపై ఒత్తిడి చేసి గుంజుకుంటున్నారని దళితరత్న లినెమలి నర్సయ్య మాదిగలి ఆవేదన వ్యక్తం చేశారు.

2. అందుగుల మీది గ్రామంలో భూ కబ్జా:
వెంకటాపూర్ మండలం బూరుగుపేట పంచాయతీ అందుగుల మీది గ్రామంలో ఐదవ షెడ్యూల్ భూభాగంలో ఉన్నా వైశ్య కులానికి చెందిన కొండా సూరయ్య నాయకపోడ్ ఆదివాసి మందారపు స్వరూప కుటుంబ భూమిని గుంజుకుంటున్నారని ఆరోపించారు. అనాథ బిడ్డ పెళ్లికి నిత్యావసరాలు ఇచ్చి ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో ఐటీడీఏ ద్వారా ఇచ్చిన తిమ్మాపూర్ సర్వే నెంబర్ 21/బి/2 భూమిని లాక్కోవడం బాధాకరమని అన్నారు.

3. నెలలుగా ఫిర్యాదు చేసినా పట్టింపు లేదు:
ఈ సమస్యను గత కొన్ని నెలలుగా జిల్లా అధికారులు, రెవెన్యూ శాఖ దృష్టికి తీసుకెళ్లినా కాలయాపన జరుగుతోందని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చింత కృష్ణ అన్నారు. వెంటనే సత్వర న్యాయం చేయాలని కోరారు.
న్యాయం జరగకపోతే పీడిత వర్గాలు, దళితులు, ఆదివాసీలతో జిల్లాలో దిగ్బంధం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో నాయకపోడ్ దెబ్బ జిల్లా ఇంచార్జ్ ఖమ్మం వెంకట్, మాదిగ దండోరా యువసేన జిల్లా నాయకులు వాసం చెంతన్, తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి అర్రేం నారాయణ, మండల నాయకులు చేదా దేవేందర్, చల్లగొండ జగత్ రెడ్డి, మహిళా నాయకురాలు చేదా రూప, మమత తదితరులు పాల్గొన్నారు.



EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.